ఆంధ్రజ్యోతి

కర్నూలు

బుధవారం 2 ఆగస్టు 2017 | 16



పవన్ కల్యాణ్‌తో మా కుటుంబానికి ఎన్నో ఏళ్లుగా అవినాభావ సంబంధం ఉంది. ఆయనంటే మాకు ఎంతో అభిమానం. అమ్మానాన్నతో పవన్ సన్నిహితంగా ఉండేవారు. ఆయన మద్దతు తప్పకుండా మాకే ఉంటుంది.

నంద్యాలలో మంగళవారం మంత్రి అఖిలప్రియ ధీమా ఇది.

జనసేన.. ఎవరి పక్షాన..?

- పవన్ కల్యాణ్ ప్రకటనపై ఉత్కంఠ
- తమకే మద్దతు ఇస్తారంటున్న టీడీపీ
- అటు వెళ్తే తమకు నష్టమేనని వైసీపీ అంచనా
- వేడెక్కిన నంద్యాల ఉప ఎన్నిక సమరం

ఇంతకీ పవన్ ఏ నిర్ణయం తీసుకుంటారు? టీడీపీకి మద్దతు ప్రకటిస్తారా? తటస్థంగా ఉండిపోతారా? ఆయన నిర్ణయం ఎవరికి ప్రయోజనం? ఎవరికి నష్టం? రాజకీయవర్గాల్లోనే కాదు.. సామాన్యుల్లో కూడా రెండు రోజులుగా ఇదే చర్చ సాగుతోంది. జనసేన కార్యకర్తలు కూడా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. పవన్ నిర్ణయం ఉప పోరులో కీలకంగా మారుతుందని, జయాపజయాలను ప్రభావితం చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే.. పవన్ మద్దతు తమకేనని టీడీపీ ధీమాగా ఉంది. 7



నేడు టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి **నామినేషన్** 6

హాజరు కానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు



"నంద్యాల శాసనసభ ఉప ఎన్నిక ప్రత్యేక పరిస్థితుల్లో వచ్చింది. జనసేన ఎవరికి మద్దతు ఇవ్వాలో రెండు రోజుల్లో ప్రకటిస్తా"

అమరావతిలో సోమవారం పవన్ కల్యాణ్ చేసిన ప్రకటన ఇది.

ఉందామా.. పోదామా?

కార్యకర్తలతో ఎమ్మెల్సీ శిల్పా సమాలోచన

సీనియర్ నాయకుల నుంచి మిశ్రమ స్పందన

2 చివరకు వైసీపీలోకి వెళ్లాలనే నిర్ణయం

జోరుగా టీడీపీలోకి చేరికలు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జోరందుకున్నాయి. అమరావతిలో మంగళవారం పలువురు నాయకులు సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గోస్పాడు మండలం దీబగుంట్లకు చెందిన 46 మంది టీడీపీలో చేరారు. 7





14 ఎంఆర్ వ్యాక్సినేషన్ సందర్భంగా నగరంలోని ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

10.54 లక్షల మందికి ఎంఆర్ వ్యాక్సిన్

తల్లిదండ్రులు బాధ్యతగా వేయించాలి: కలెక్టర్ సత్యనారాయణ

శకటాల ప్రదర్శన ఉండదు

స్వాతంత్ర్య వేడుకలపై ఉప ఎన్నిక ఎఫెక్ట్ 2

జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు

అయ్యో.. ఒకటో తారీఖు



16

తొలిరోజు ప్రతికూల ఫలితాలు

సాంకేతికంగా ఇబ్బందులు

నిరాశపరిచిన పథకాల అమలు

కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం ఇలా..

"ఇది ప్రభుత్వ ఆసుపత్రి కదా! ఇక్కడ వైద్యం ఎలా ఉంటుందో మీకు ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. నేను చెప్పిన ప్రైవేటు ఆసుపత్రికి పోతే బాగా చూసుకుంటారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉంది కదా! ఇంకేం.. పొద్దున్నే అక్కడికి వెళ్లు. కావాలంటే నేనే వచ్చి ఆపరేషన్ చేస్తా. కార్డు లేకున్నా పర్వాలేదు. ఫీజు తగ్గించేలా చూస్తా" కర్నూలు పెద్దాసుపత్రిలోని కొందరు వైద్యుల తీరిది. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ ఇంటి దొంగలుగా మారారు. కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులకు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తద్వారా కమీషన్లు జేబులో వేసుకుంటున్నట్టు తెలుస్తోంది. నెల వ్యవధిలోనే 21 కేసులు బయటకు పంపించినట్టు ఆరోపణలు ఉన్నాయి.

ప్రత్యేక కథనం సెంటర్‌స్ప్రెడ్‌లో..

పెద్దాసుపత్రిపై కార్పొరేట్ గద్దలు



ఎన్టీఆర్ వైద్యసేవ కేసులే వారి టార్గెట్

దళారులుగా మారిన కొందరు వైద్యులు

రోగిని పంపితే రూ.10 వేల కమీషన్

ఉండామా.. పోదామా?

- కార్యకర్తలతో ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి సమాలోచన
- సీనియర్ నాయకుల మిశ్రమ స్పందన
- వైసీపీలో చేరాలనే నిర్ణయించినట్లు సమాచారం
- శిల్పా వెంట వెళ్లేవారు ఎందరు..?
- రేపు జగన్ సమక్షంలో చేరే అవకాశం

ఆంధ్రజ్యోతి - కర్నూలు: టీడీపీలో అవమానాలు.. మన పనులు కావడం లేదు.. గుర్తింపు లేదు.. శ్రీశైలం టికెట్ ఇస్తానని గట్టి హామీ ఇవ్వడం లేదు.. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీలో ఉందామా.. వెళ్దామా..? అంటూ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి కార్యకర్తల సూచనలు కోరారు. ఆయనకు అత్యంత సన్నిహితులు పార్టీని వీడి వైసీపీలో చేరుదామని సూచిస్తే.. సీనియర్ నాయకులు ఇలా పార్టీలు మారడం ఎంత వరకు సమంజసం.. ఎక్కడికి వెళ్లినా ఇవే ఇబ్బందులు ఉంటాయి..పునరాలోచించడం మంచిదని సూచించినట్లు తెలిసింది. దీంతో ఎమ్మెల్సీ శిల్పా ఎటూ తేల్చుకోలేక డైలామాలో పడ్డట్టు సమాచారం. అయితే.. 3న నంద్యాల ప్రచారానికి రానున్న జగన్ సమక్షంలో వైసీ పీలో చేరడం ఖాయమని ఆయన అత్యంత సన్నిహితులు పేర్కొంటున్నారు. ఉప ఎన్నిక వేళ రెండు రోజులుగా నంద్యాల రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. నంద్యాలలో శిల్పా చక్రపాణిరెడ్డిని ఆయన అన్న, వైసీపీ అభ్యర్థి మోహన్‌రెడ్డి కలిసి వైసీపీలోకి ఆహ్వానించడం.. ఆ వెంటనే టీడీపీ నేతలు ఆయన వద్దకు వెళ్లి చర్చలు జరపడం తెలిసిందే. అయితే కార్యకర్తల నిర్ణయం మేరకే భవిష్యత్తుకార్యాచరణ ఉంటుందని, రాబోయే ఎన్నికల్లో శ్రీశైలం టికెట్‌పై అధి నాయకత్వం తనకు పక్కా హామీ ఇవ్వాలని శిల్పా చక్రపాణిరెడ్డి టీడీపీ నేతలకు ఖరాఖండిగా తేల్చి చెప్పారు. కార్యకర్తలు, అనుచరుల సూచనలు, సలహాల కోసం మంగళవారం నంద్యాలలో శ్రీశైలం, ఆత్మకూరు, మహానంది, బండిఆత్మకూరు, వెలుగోడు మండలాల సన్నిహితులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు, మండల స్థాయి ప్రజాప్రతినిధులతో మండలాల వారిగా సమావేశమయ్యారు. ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిలర్లు మరబత్తుల స్వామి, రాజగోపాల్,నజీర్ అహ్మద్, తిమ్మోతి, అమర్, లాలూ, రహీంలతో పాటు 12 మంది కౌన్సిలర్లు సమావేశానికి వెళ్లారు. టీడీపీ సీనియర్ నాయకులు గోవిందరెడ్డి, శివరామిరెడ్డి, క్రిష్ణగౌడ్, జడ్.శ్రీనివాసరెడ్డి, ఆత్మకూరు ఎంపీపీ సౌజన్య భర్త రమణ తదితరులు శిల్పాతో సమావేశమైన వారిలో ఉన్నారు. మొదటి నుంచి టీడీపీలో కొనసాగుతున్న నాయకులు కొందరు పార్టీ మారాలనే ఆలోచన సరైంది కాదని, పునరాలోచించుకోమని సూచించినట్లు తెలుస్తోంది. మరికొందరు మాత్రం వైసీపీలో చేరుదామని సూచించినట్లు సమాచారం. కార్యకర్తలు, అనుచరుల నుంచి మిశ్రమ స్పందన రావడంతో పునరాలోచనలో పడ్డారని, అందుకే ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదని మరి కొందరు అంటున్నారు.



ఈనెల 3న జగన్ సమక్షంలో వైసీపీలో చేరడం ఖాయమని, ఆ దిశగా సన్నాహాలు చేస్తున్నారని, నంద్యాలలో ఉన్న వైసీపీ నేతలు బొత్స సత్యనారాయణ తదితరులు శిల్పాను వైసీపీలోకి ఆహ్వానించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారని సమాచారం.

కొరవడిన స్పష్టత

అయితే.. శాసన మండలి సభ్యుడు శిల్పా చక్రపాణిరెడ్డితో సమావేశమైన కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల్లో ఎంత మంది ఆయన వెంట వెళ్తారనే స్పష్టత లేదు. కొందరైతే తాము శిల్పా పిలవడంతో సమావేశానికి వెళ్లాంగాని తెలుగుదేశం పార్టీలో ఉంటామని చెప్పినట్లు తెలుస్తోంది. మరికొందరు శిల్పా నిర్ణయమే తమ నిర్ణయం అంటున్నారని సమాచారం. దీంతో కొందరు ఒకలా, ఇంకొందర మరోలా చర్చించుకుంటున్నారు.

జాగ్రత్తగా స్వాతంత్ర్య వేడుకలు

అధికారుల సమీక్షలో కలెక్టర్ ఎస్.సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యనారాయణ

కర్నూలు (కలెక్టరేట్): నంద్యాల ఉప ఎన్నికల నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత జాగ్రత్తగా ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్.సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ భవనంలో ఈనెల 15వ తేదీ నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను సమీక్షించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికల సందర్భంగా అభివృద్ధి శకటాల ప్రదర్శన, ఛాయాచిత్ర ప్రదర్శనల స్టాల్స్‌ను ఉప సంహరిస్తున్నామని తెలిపారు. కాబట్టి కేవలం జాతీయ పతాకం ఏర్పాట్లపైనే దృష్టినిలపాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులను గుర్తించి కార్యక్రమానికి ఆహ్వానించి సన్మానించాలని డీఆర్‌వో గంగాధరగౌడ్‌ను ఆదేశించారు. జాతీయ పతాకం ఏర్పాట్లను పోలీసు శాఖ, పోలీసు పరేడ్ మైదానంలో పెయింటింగ్ బాధ్యతను ఆర్‌అండ్‌బీ శాఖ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మైదానంలో సీటింగ్, షామియానా ఇతర ఏర్పాట్లు చేయాలని ఆర్‌డీవో హుసేన్ సాహెబ్‌ను ఆదేశించారు. వేడుకలకు వచ్చిన వారికి తాగునీటి వసతి మున్సిపల్ కమిషనర్‌ను, పాఠశాల విద్యార్థులకు బిస్కెటు ప్యాకెట్ల పంపిణీ చేయాలని తాసీల్దారును ఆదేశించారు. మైదానంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని డీయంహెచ్‌వోను ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు.

సందేశం ప్రతిలో స్వాతంత్ర్య పోరాటంలో జిల్లా నాయకులు చేసిన కృషిని పేర్కొనాలని సమాచారశాఖ ఉప సంచాలకులను ఆదేశించారు. జిల్లా అధికారులందరూ తమ తమ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేయాలన్నారు. ఉత్తమ సేవలందించిన సిబ్బంది, ఉద్యోగులకు ప్రశంసా పత్రాల పంపిణీ నిమిత్తం ప్రతి శాఖ నుంచి ముగ్గురి చొప్పున నామినేట్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో గంగాధరగౌడ్, అడిషనల్ ఎస్పీ వెంకటేష్, డ్వామా పీడీ పుల్లారెడ్డి, ఐసీడీఎస్ పీడీ జుబేదాబేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరసింహులు పాల్గొన్నారు.

'మీసేవా అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి'

కర్నూలు(కలెక్టరేట్):మీసేవా ద్వారా వచ్చిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని భూపరిపాలనశాఖ కమీషనర్ అనీల్ చంద్రపునీఠత జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం విజయవాడ నుంచి జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనీల్ చంద్ర పునీఠత మాట్లాడుతూ మీసేవలో గడువు దాటిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పరిష్కరించి గడువులోపు ఉన్న అర్జీలకు పరిష్కార మార్గాలు చూపాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో కలెక్టరేట్ నుంచి డిఆర్వో గంగాధరగౌడ్, కలెక్టరేట్ ఏవో వెంకటనారాయణ, సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించాలి

- సోలార్ పరిశ్రమలో భూములు కోల్పోయిన వారికి పరిహారం ఇవ్వాలి
- తహసీల్దార్ కార్యాలయం ముట్టడి, ధర్నా
- జాతీయ రహదారి దిగ్బంధం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భూ నిర్వాసితులు

ఓర్వకల్లు: సోలార్ ప్రభావిత వ్యవసాయ కూలీలకు పునరావాసం కల్పించి భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని భూ నిర్వాసితుల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ధర్నాచేసి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి అధికారులను బయటికి పంపారు.అనంతరం కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిని గంటపాటు నిర్బంధించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో ప్రయాణికులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తహసీల్దార్ శ్రీనాథ్, బేతంచర్ల సీఐ కంబగిరి రాముడు, స్థానిక పోలీసుల విజ్ఞప్తులను ఆందోళనకారులు పట్టించుకోలేదు.శకునాల సోలార్‌లో భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం ఇవ్వాలని మూడు సంవత్సరాలుగా ఆందోళనలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా సీపీఎం పాణ్యం డివిజన్ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం ప్రకారం సోలార్‌లో బాధిత రైతులకు పునరావాసాలు కల్పించాలని, ఈ చట్టాన్ని అధికారులు తుంగలో తొక్కుతున్నారని ఆయన ఆరోపించారు.

30 సంవత్సరాలుగా భూములు సాగుచేసుకుంటున్న రైతులకు పట్టాపాసుపుస్తకాలు ఉన్నప్పటికీ పరిహారం ఇవ్వలేదన్నారు. ఆర్డీవోకు రైతులపై కనికరం లేదని ఆయన ఆరోపించారు. తహసీల్దార్ శ్రీనాథ్ ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రోడ్డు దిగ్బంధాన్ని విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగన్న, వీరన్న, షాజహాన్, చంద్రబాబునాయుడు, బాధిత రైతులు రమణమ్మ, రమాదేవి, లక్ష్మీదేవి, పుల్లన్న, మద్దిలేటి పాల్గొన్నారు.

'నిబంధనలకు వ్యతిరేకంగా బదిలీలు'

కర్నూలు(రాజ్‌విహార్): ఏ ప్రభుత్వ శాఖ, ప్రభుత్వ రంగ సంస్థల్లో లేని విధంగా విద్యుత్ శాఖలో పూర్తిస్థాయిలో నిబంధనలకు వ్యతిరేకంగా బదిలీ ప్రక్రియ కొనసాగుతున్నాయని 327 యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.గిరిధర్ కుమార్ ఆరోపించారు. మంగళవారం స్థానిక విద్యుత్ భవన్ విశ్రాంతి భవన్‌లో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అధ్యక్షతన యూనియన్ ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ స్థాయి, జిల్లా స్థాయి బదిలీల్లో కార్పొరేట్ స్థాయి అధికారుల జోక్యంతో విద్యుత్ సంస్థలో పరిపాలనా వ్యవస్థ అస్తవ్యస్తం అయిందని ఆయన విమర్శించారు.

సీఎండీ హెచ్‌వై దొర తనకున్న విస్తృత అధికారులను దుర్వినియోగం చేశారని ఆయన మండిపడ్డారు. జిల్లా అధ్యక్షుడడు రామాంజనేయులు మాట్లాడుతూ సబ్ డివిజన్ స్థాయిలో జేఎల్‌ఎం, ఎల్‌ఐ, ఎల్‌డీసీ స్థాయిలో పోస్టులను ఒక సీఎండీ స్థాయిలో వందలకొద్ది బదిలీ ఆదేశాలు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. ఇది కింది స్థాయి అధికారుల అధికారులను నిర్వీర్యం చేయడమేనని ఆయన అన్నారు. దీని వల్ల సంస్థ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే ప్రమాదముందన్నారు. దీనిపై న్యాయ పోరాటానికి సిద్ధమవుతామని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి, వ్యతిరేఖ విధాలను తొలగించాలిన ఆయన కోరారు. ఈ సమావేశంలో ఓసీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.రాఘవేంద్ర ప్రసాద్, డి.ఇబ్రహీం, కంపెనీ స్థాయి ప్రతినిధులు లక్ష్మీకాంతరెడ్డి, సిద్దేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

అడవి బిడ్డలకు..అగచాట్లు

పెన్షన్ తీసుకోవాలంటే ఐదు కిమీలు నడవాల్సిందే..

కొత్తపల్లి: ప్రభుత్వ ఫలం పొందాలంటే అడవి బిడ్డలకు అగచాట్లు తప్పడం లేదు. ప్రతి నెల ప్రభుత్వం అందజేస్తున్న సామాజిక భద్రతా పింఛన్ పొందాలంటే సుమారు ఐదు కిలోమిటర్లు నడవాల్సి వస్తోంది. దీంతో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పలుఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని పాలెం చెరువు గూడేనికి చెందిన సుమారు 30 మంది చెంచులు తమ సమీపానున్న గువ్వలకుంట్ల గ్రామానికి కాలినడకన వచ్చి పింఛన్లు పొందుతున్నారు.ఆ రోజు పింఛన్ ఇవ్వకపోతే మళ్లీ మరుసటి రోజు రావాల్సి వస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రతి గ్రామంలో పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వం చెబుతోంది. కానీ గూడేల్లో మాత్రం ప్రభుత్వ నిబంధన అమలు కావడం లేదు. చెంచులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా స్థానికంగానే పింఛన్లు అందజేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.ఈ విషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా పింఛన్ కోసం ఎంతదూరమైన నడుచుకుంటూ వెళ్లాల్సిందేనని చెప్పడం గమనార్హం.


కాలినడకన వెళుతున్న వృద్ధులు

వీధి బాలల జీవితాల్లో వెలుగు నింపుదాం: ఎస్పీ

● జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్ ● 122 మందిని రెస్క్యూ చేసిన పోలీసులు

కర్నూలు: వీధి బాలల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అందరూ కృషి చేయాలని ఎస్పీ గోపినాథ్ జెట్టి కోరారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, దేవాలయాలు, రహదారి కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో తిరిగే పిల్లలను సమీకరించారు. వీరిలో కొందరని వారి తల్లిదండ్రులకు అప్పగించామని, అనాథలను 1098 చైల్డ్‌లైన్‌కు అప్పగించాక వారిని ప్రభుత్వ వసతి గృహాల్లో, ప్రభుత్వ హాస్టళ్లల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనాథ, వీధి బాలలు కనిపిస్తే వెంటనే 1098 చైల్డ్‌లైన్‌కు, సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రజలు, వివిధ స్వచ్ఛంద సంస్థలకు విజ్ఞప్తి చేశారు.



ఆపరేషన్ ముస్కాన్‌లో పట్టుకున్న పిల్లలలో పోలీసులు

122 మందిని చేరదీసిన పోలీసులు

ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు 122 మంది వీధి బాలలను చేరదీశారు. వీరిలో 110 మందిని వారి తల్లిదండ్రులకు, మిగతా 12 మందిని చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. ఆదోని సబ్ డివిజన్‌లో 55 మంది, కర్నూలు సబ్ డివిజన్‌లో 33 మంది, డోన్ సబ్ డివిజన్‌లో ఒక్కరు, నంద్యాల సబ్ డివిజన్‌లో 33 మంది పిల్లలను పోలీసులు గుర్తించారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

ఆదోని: పట్టణంలోని ఓ ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. ఆటోలో మరిచిపోయిన సంచిని పోలీసుల సమక్షంలో సదరు వ్యక్తికి అందజేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచాడు.



పోలీసుల సమక్షంలో ఖలీల్‌కు సంచి అందజేస్తున్న ఆటో డ్రైవర్ వీరేష్

పట్టణంలోని ఖలీల్ అహమ్మద్ రైల్వే స్టేషన్‌కు చేరుకునేందుకు ఎస్కేడీ కాలనీ 2 వ రోడ్డులో వెళ్తున్న వీరేష్ ఆటో ఎక్కాడు. స్టేషన్ రాగానే దిగిపోయిన ఖలీల్ ఆటోలో తన వెంట తెచ్చుకున్న సంచి మరిచిపోయాడు. ఆటో డ్రైవర్ వీరేష్ ఆ సంచిని తీసుకెళ్లి ఖలీల్‌కు ఇచ్చేందుకు స్టేషన్‌లోకి వెళ్లాడు. ఎక్కడా కన్పించకపోవడంతో సంచితో టూటౌన్ పోలీస్ స్టేషన్ చేరుకుని ఏఎస్‌ఐ రామస్వామికి విషయం చెప్పాడు. సంచిలో ఉన్న కాగితాల ఆధారంగా ఆయన ఖలీల్‌కు ఫోన్ చేసి స్టేషన్ పిలిపించి ఆటో డ్రైవర్ వీరేష్ చేతుల మీదుగా సంచిని ఇప్పించారు. సంచిలో 12వేలు డబ్బు, రూ.16వేలు విలువ చేసే 2 బంగారు ఉంగరాలు, విలువైన డాక్యుమెంట్లు ఉన్నాయి. వీరేష్ నిజాయితీకి మెచ్చి ఖలీల్ ఆయనకు రూ.500 బహుమతిగా ఇచ్చాడు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆదోని: పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద పట్టాలు దాటుతున్న ఓ వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో చనిపోయాడు. మృతుడి ఒంటిపై ఆకుపచ్చ కలర్ లుంగీ, టీ షర్టు ఉన్నాయని, కుడిచేతిలో కడియం, ఎర్రదారం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుడు ఆదోనికి చుట్టుపక్కల గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి ఏరియా ఆస్పత్రికి తరలించారు. తల, మొండెం నుంచి విడిపోవడంతో మృతుడిని గుర్తించడం కష్టంగా మారిందని, గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీస్ స్టేషన్ హౌస్ అధికారి ఫకృద్దీన్ తెలిపారు.

V CELLULOID 4K DOLBY® ATMOS™ 3D
Follow us on : f //vcelluloid
Be the first one to enjoy the experience

Kurnool Anand cine Complex
Telugu: 11:30 AM 06:30 PM, 11:50 AM 06:50 PM, 02:30 PM 09:30 PM, 02:50 PM 09:50 PM
Telugu: 11:40 AM, 02:40 PM, 06:40 PM, 09:40 PM
Hindi: 12:05 PM, 02:45 PM, 06:45 PM, 09:45 PM
Telugu: 11:40 AM, 03:00 PM, 06:35 PM, 09:55 PM
Telugu: 12:00 PM, 03:10 PM, 07:00 PM, 10:10 PM
28th July to 3rd Aug

Adhoni Dwaraka cine Complex
Telugu: 11:40 AM, 02:40 PM, 06:40 PM, 09:40 PM
Telugu: 11:30 AM 06:30 PM, 11:50 AM 06:50 PM, 02:30 PM 09:30 PM, 02:50 PM 09:50 PM
28th July to 3rd Aug

To book your movie tickets,
Tap in your paytm APP & scan PAYTM QR CODE
Use code: vcelluloid & Get flat Rs.75/- Cashback on Booking minimum two tickets
Advance Booking Available From 10:00 AM to 10:00PM

యువకుడి దారుణ హత్య

● 56 రోజుల తరువాత శవమై వెలుగు చూసిన వైనం
● లొంగిపోయిన ముగ్గురు నిందితులు

నందికొట్కూరు టౌన్: నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కేసు మిస్టరీ వీడింది. వెంకటేశ్వర్లును దారుణంగా హతమార్చి వీపనగండ్ల, బొల్లవరం గ్రామాల మధ్య కల్వర్టు వద్ద పడేసి మృతదేహంపై బండరాళ్లు వేశారు. ఈ హత్య కేసులో నిందితులు రాజు, హాజీరా, మదార్ బాషా మంగళ వారం బ్రాహ్మణ కొట్కూరు వీఆర్వో వద్దకు వచ్చి నేరాన్ని అంగీకరించారు. దీంతో వీఆర్వో వారిని పోలీసులకు అప్పగించారు. నందికొట్కూరు ఇన్‌చార్జి తహసీల్దార్ జాకీర్‌హుసేన్, సీఐ వెంకటరమణ నిందితుల సమాచారం మేరకు వీఆర్వో సమక్షంలో కల్వర్డు వద్ద శవాన్ని వెలికి తీయించారు. అనంతరం నందికొట్కూరు సీఐ వెంకటరమణ నిందితులను విలేఖర్ల ముందు హాజరు పరిచారు. నిందితులు చెప్పిన హత్య ఉదంతాన్ని వివరించారు. బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన దాసరి రాజు అలియాస్ నాగస్వాములు అలియాస్ హాజీజుల్లా భార్య హాజీరా తనపై వెంకటేశ్వర్లు అత్యాచారం చేశాడనే ఆరోపణ చేసింది. దీంతో వెంకటేశ్వర్లను హత్య చేయాలని రాజు పథకం వేశాడు. ఇందులో అల్లూరు గ్రామానికి చెందిన దాదా బాషా, మాదార్ బాషాలను భాగం చేశాడు. ఆ ప్రకారం హాజీరా తో వెంకటేశ్వర్లకు ఫోన్ చేయించి పిలిపించారు. వెంకటేశ్వర్లును ఆటోలో తీసుకొని రాజు, హాజీరా, దాదాబాషా, మాదార్‌బాషా మిడుతూరు సమీపంలో హాజీరాను అత్యాచారం చేసిన స్థలానికి తీసికెళ్లారు. వెంకటేశ్వర్లు కాళ్లు హాజీరా పట్టుకోగా రాజు తాడుతో గొంతు నులిమి హత్య చేశాడు. దాదాబాషా, మదార్ సహకారంతో మృత దేహాన్ని ఆటోలో తీసుకుని వీపనగండ్ల, బొల్లవరం గ్రామాల మధ్య కల్వర్టు పక్కన పడేసి బండరాళ్లు వేశారు. ఆటోను వెంకాయపల్లి ఎల్లమ్మ గుడి సమీపంలో కేసీ కెనాల్ వద్ద ఉంచి ఎల్లమ్మగుడి వద్ద రాత్రి బస చేశారు. రాజు, హాజీరా కొన్ని రోజులు కర్నూలులో, మరికొన్ని రోజులు ఆత్మకూరులో తలదాచుకున్నారు. అయితే నిందితులు స్వయంగా వీఆర్వో వద్దకు వచ్చి నేరాన్ని అంగీకరించి లొంగిపోయారు. పరీక్షల కోసం మృత దేహం ఎముకలను ఫోరెనిక్స్ ల్యాబ్‌కు పంపారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు. మరో నిందితుడు దాదాబాషా కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం, బాలనరసింహులు పాల్గొన్నారు.



హత్యకు గురైన వెంకటేశ్వర్లు (ఫైల్)

శవాన్ని చూసి సొమ్మసిల్లిన తల్లిదండ్రులు

ఒక్కగానొక్క కుమారుడు అదృశ్యమై 56 రోజుల తరువాత శవమై కనిపించడంతో వెంకటేశ్వర్లు తల్లిదండ్రులు లక్ష్మీదేవి, ఆంజనేయులు సొమ్మసిల్లిపోయారు. తమ కొడుకును హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి

ఆళ్లగడ్డ: మండలంలోని మిట్టపల్లె గ్రామానికి చెందిన చాకలి నడిపి గురువయ్య (23) అనే గొర్రెల కాపరి విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందాడు. మిట్టపల్లె గ్రామానికి చెందిన ఓ రైతు అడవి పందులు బెడద నుంచి పంటను కాపాడుకునేందుకు పంట పొలాలం చుట్టూ కంచె ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేశాడు. ఈ విషయం తెలియని గురువయ్య కంచెను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గురువయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీఐ దస్తగిరిబాబు, రూరల్ ఎస్‌ఐ రామయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాపులో ఉంది.



మృతి చెందిన నడిపి గురువయ్య

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బేతంచెర్ల శాఖ, కర్నూలు జిల్లా

స్వాధీనతా ప్రకటన
రూల్ 8(1) మరియు (2) క్రింద (స్థిరాస్తి కొరకు)
రూలు 4 క్రింద (చరాస్తి కొరకు)

A/c నం. 11267645717 (క్యాష్ క్రెడిట్) **తేది: 28.07.2017**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 9తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను ఉపయోగిస్తూ **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బేతంచెర్ల శాఖ** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు ప్రకటన స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా **15.02.2016 నాటికి** ప్రకటనలోని మొత్తం **రూ.5,31,099.00 (రూపాయలు ఐదులక్షల ముప్పైఒక్కవేల తొంభై తొమ్మిది మాత్రమే)** లను దానిపై **15.02.2016** నుండి తదుపరి వడ్డీ మరియు ఖర్చులతో తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత **M/S బాంబే స్లాబ్ పాలిషింగ్ ఇండస్ట్రీ, యజమాని శ్రీ. వలి మొహిద్దీన్ ఖాతీబ్, తండ్రి కె. నజీర్ అహ్మద్ (స్వర్గీయ)** సర్వే నం. 47/సి & 69/సి, బుగ్గనిపల్లి గ్రామం, బేతంచెర్ల మండలం. ఇం.నం. 117/1, St An. E.M స్కూల్‌కు ఎదురుగా, బేతంచెర్ల మండలం & పోస్ట్, కర్నూలు జిల్లా వారిని కోరుతూ **18.02.2016** తేదీ గల **డిమాండ్ ప్రకటన** జారీ చేశారు.

సదరు మొత్తమును తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత/హామీదారు విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇందులో వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **28 జూలై 2017**న స్వాధీనం చేసుకున్నారని ఇందుమూలంగా రుణగ్రహీత/ హామీదారు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది.

సదరు ఆస్తులతో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా రుణగ్రహీత / హామిదారులు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది. మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ వ్యవహారమైన మొత్తం **రూ.5,31,099.00** +దానిపై వడ్డీ+ వ్యయాలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బేతంచెర్ల వారికి చెల్లించుటకు లోబడియుంటాయి.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సమయం ఉన్నందున, SARFAESI యాక్ట్‌లోని సెక్షన్ 13 లోని సబ్‌సెక్షన్(8) నిబంధనలను గమనించవలసినదిగా రుణగ్రహీతలు కోరబడుచున్నారు

చర & స్థిరాస్తి వివరణ
మెషినరీ తనఖా

నమోదిత సెల్ డీడ్ డాక్యుమెంట్ నం.2172/1991, తేది:12-12-1991, పడమట చేను పైకి ఎ.0.64 సెంట్లుగా పిలువబడే సర్వే నం.47/C, 4-52 సెంట్ల విస్తీర్ణం, పడమట చేను పైకి ఎ. 0.15 సెంట్లుగా పిలువబడే సర్వేనం.69/C, ఎ.1-09 సెంట్ల విస్తీర్ణం, డోన్ S.R.D మరియు కర్నూలు R.D తో బుగ్గనిపల్లి వద్ద గల ఆస్తి. **సరిహద్దులు: తూర్పు:** M/S UMMI స్లాబ్ పాలిషింగ్ ఇండస్ట్రీ, **పశ్చిమం:** కర్నూలు రోడ్, **ఉత్తరం:** M/S సాయి లక్ష్మీ వెంకటేశ్వర స్లాబ్ పాలిషింగ్ ఇండస్ట్రీ, **దక్షిణం:** M/S మోహన్ స్లాబ్స్.

తేది: 28.07.2017 **సం/-అధీకృత అధికారి**
ప్రదేశము: బేతంచెర్ల **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

టీడీపీకి మద్దతు పలికిన రజకులు

నంద్యాల రూరల్: నంద్యాల పట్టణంలో గుడిపాటి గడ్డకు చెందిన రజక సంఘం నాయకులు టీడీపీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఇటీవలే సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు, ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు చిట్టిబొట్ల భరద్వాజ ఆధ్వర్యంలో ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి గెలుపునకు కృషి చేస్తామన్నారు. కాలనీకి చెందిన పెద్ద వీరన్న, పెద్దమద్దిలేటి, నాగప్ప, అంజి, మహేష్, హనుమంతు, మంగయ్య, వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్యలు మాట్లాడుతూ నంద్యాల అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమని, టీడీపీకే ఓటు వేసి అభ్యర్థిని గెలిపించుకుంటామని పేర్కొన్నారు.

అభివృద్ధి పేరుతో ఓటు అడగగలరా?

వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి

నంద్యాల టౌన్: అభివృద్ధి పేరుతో ఓటు అడిగే హక్కు టీడీపీకి ఉందా అని వైసీపీ నేత భూమన్ కరుణాకర్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. భూమన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదని ఆరోపించారు. వైసీపీ ఎమ్మెల్యేలను టీడీపీలోకి చేర్చుకొని మంత్రి పదవులు ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కడమేనని అన్నారు. రాష్ట్ర మంత్రులు నంద్యాల ఉప ఎన్నికలలో భాగంగా వార్డు కౌన్సిలర్ స్థాయికి దిగజారడం తగదన్నారు. నంద్యాలలో వైసీపీ అభ్యర్థి శిల్పాను ప్రకటించిన తరువాత నంద్యాల అభివృద్ధి జపం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో


మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి

ప్రజాస్వామ్యం కనిపించడం లేదని, పోలీసులతో బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ వ్యతిరేకతను కప్పి పెట్టడానికి మంత్రులతో నంద్యాలలో అబద్ధపు ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు. నంద్యాల వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి ఘన విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి, సుబ్బలక్ష్మయ్య, ద్వారకానాథ్, శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.

మీ ఓటు నంద్యాల ప్రగతికి పూలబాట

నంద్యాలలో శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర దంపతుల ఇంటింటి ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న తుగ్గలి నాగేంద్ర దంపతులు

నంద్యాల: 'అమ్మా.. మీ ఓటుతో నంద్యాలను ప్రగతి బాటలో నడిపించండి.. టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి ప్రగతికి పట్టం కట్టండి' అంటూ శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, ఆయన సతీమణి తుగ్గలి జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 28,29 వార్డులో ఇంటింటికీ తిరుగుతూ సీఎం చంద్రబాబు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, నంద్యాల నియోజకవర్గం ప్రగతికి సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. భార్యాభర్తలు ఇద్దరు నంద్యాలలో మాకాం వేసి ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా నాగేంద్ర విలేఖరులతో మాట్లాడుతూ ఏ వీధికి వెళ్లినా అనుహ్య స్పందన ఉందని, టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని అన్నారు.

టీడీపీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని ఆయన పేర్కొన్నారు.

ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారు: బీసీ

గోస్పాడు: నంద్యాల ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి పోటీ చేస్తున్న శిల్పా మోహన్‌రెడ్డి ఏముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి మంగళవారం గోస్పాడులో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, జడ్పీ చైర్మన్ మల్లెల రాజశేఖర్‌లతో కలిసి మాట్లాడుతూ 10 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన శిల్పా మోహన్‌రెడ్డి నంద్యాల అభివృద్ధిని తుంగలో తొక్కి, సొంత వ్యాపారం చేసుకున్నాడన్నారు. పదవీ వ్యామోహంతో పార్టీని వీడిన శిల్పా మోహన్‌రెడ్డిని ఉప ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. నీరు- చెట్టులో భూగర్భ జలాలు పెరిగి రైతుల కష్టాలు తీరుతున్నాయని, రాజధాని అమరావతిని ఆదర్శంగా నిర్మిస్తున్నారన్నారు. బుధవారం


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ జనార్దన్‌రెడ్డి

టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి నామినేషన్‌కు నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

'చక్రపాణికి పార్టీని వీడాల్సిన అవసరం లేదు'

వైసీపీ పార్టీలో ఇమడలేకనే శిల్పా చక్రపాణిరెడ్డి టీడీపీలో చేరారని, పార్టీలో సీఎం ఆయనకు సముచిత స్థానం కల్పించారని, పార్టీని వీడాల్సిన అవసరం లేదని బీసీ అన్నారు. శిల్పా చక్రపాణిరెడ్డి పార్టీకి విధేయుడన్నారు. నాయకులు వెంకటేశ్వరరెడ్డి, వీరేంద్ర సింహారెడ్డి, పెద్దఉసేన్‌సాహెబ్, విశ్వనాథ్‌రెడ్డి, భూమా ఉసేని, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

క్రైస్తవ మైనార్టీలకు అధిక ప్రాధాన్యం: కేఈ

నంద్యాల (ఎడ్యుకేషన్): రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలతో పాటు క్రైస్తవ మైనార్టీలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పించిందని డిప్యూటీ సీఎం, రెవెన్యూ శాఖ మంత్రి కే.ఈ.కృష్ణమూర్తి అన్నారు. మంగళ వారం నంద్యాలలోని రైట్.రెవరెండ్ దేవ ప్రియం రైడర్ మెమోరియల్ హాల్‌లో క్రైస్తవ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమానికి డిప్యూటీ సీఎం కే.ఈ.కృష్ణమూర్తి, రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, భూమా అఖిలప్రియ, నంద్యాల టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీకి పూర్తిస్థాయి


మాట్లాడుతున్న కేఈ కృష్ణమూర్తి

మద్దతును ప్రకటిస్తామని క్రైస్తవ సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు, సంఘ కాపరులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కే.ఈ.కృష్ణ మూర్తి మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమాభి వృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కష్టపడుతుందన్నారు. ప్రస్తుత నంద్యాల ఉప ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. మంత్రి భూమా అఖిలప్రియ మాట్లా డుతూ నంద్యాల టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించా లని, సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటారని ఆమె పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర క్రైస్తవ మైనార్టీ ఆర్థిక సంస్థ అల్ప సంఖ్యాక వర్గ సంక్షేమ శాఖ బ్రోచర్‌ను విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక కన్వీనర్ మేరీపాల్, ప్రతినిధులు ఇమ్మానియేలు, స్వామిదాస్, భాస్కర్, ప్రవీణ్, మనోజ్, అందనం ఏసన్న, 500 మంది పాస్టర్లు పాల్గొన్నారు.

వేధించినవారికి బుద్ధి చెప్పండి: అఖిలప్రియ

నంద్యాల: తనకు ఓట్లు వేయలేదని కక్షగట్టి గత మూడేళ్లుగా వేధించిన వారే మొసలి కన్నీరు కారుస్తూ ఓట్ల కోసం వస్తున్నారని, ప్రజలు వారికి బుద్ధి చెప్పాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం 19వ వార్డులోని ఎన్‌జీవో కాలనీలో అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డితో కలిసి మంత్రి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనార్టీ వర్గాలు తనకు ఓట్లు వేయలేదని శిల్పా మోహన్‌రెడ్డి సాగించిన కక్ష సాధింపులు ఇంకా కళ్ల ముందు కదలాడుతున్నాయని అన్నారు. మున్సిపల్ కాంప్లెక్స్‌లో మైనార్టీల దుకాణాలకు బాడుగలను పెంచి పరోక్షంగా లక్షల్లో గుడ్‌విల్ దండుకున్నారని ఆరోపించారు. ఎంపీ ఎస్పీవై రెడ్డి తోపుడు బండ్ల వ్యాపారులు, మార్కెట్‌లో చిన్న వ్యాపారులకు మార్కెట్ ఫీజులను రద్దు చేసేందుకు తానే వేలం వేస్తే శిల్పా కక్షగట్టి వేధించారని ఆరోపించారు. మైనార్టీ వర్గాల పట్ల శిల్పా ప్రేమ మొత్తం కపట ప్రేమేనని


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి అఖిల, అభ్యర్థి బ్రహ్మనందరెడ్డి

అన్నారు. అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ మైనార్టీలను ఓట్లు అడిగే అర్హత వైసీపీకి లేదని అన్నారు. ముస్లింలపై అక్రమ కేసులు బనాయించి రౌడీషీట్లు తెరిపించిన శిల్పా మోహన్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకొని తిరిగి మైనార్టీలను ఓట్లను అడిగేందుకు వస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. అభివృద్ధికి అండగా నిలిచి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

ఈ ప్రచారంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారంలో ఉండగా ఏం చేశారో చెప్పాలి

విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు

నంద్యాల: నంద్యాల నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, అధికారంలో ఉండి ఎలాంటి అభివృద్ధి చేశారో వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి చెప్పాలని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మూల సాగరంలో ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అధికారంలో ఉండగా ఎలాంటి అభివృద్ధి చేయకుండా ఉప ఎన్నికల్లో ఏడాదిన్నర కాలంలో ఏమి చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధిని చేసి చూపిస్తూ టీడీపీ ప్రజా మన్ననలు పొందుతుంటే జీర్ణించుకోలేని స్థితిలో వైసీపీ నాయకులు ఉన్నారని అన్నారు. భూమా నాగిరెడ్డి మరణానంతరం సీఎం నారా చంద్రబాబునాయుడు అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీల మేరకే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని అన్నారు. అయితే కొందరు ఉప ఎన్నికల కోసం అభివృద్ధి మంత్రం జపిస్తున్నారంటూ వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా


మాట్లాడుతున్న బోండా ఉమామహేశ్వరరావు

ఉన్నాయన్నారు. ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహానంది దేవస్థానం మాజీ ధర్మకర్త రాచమల్ల గంగమ్మ, నాయకులు రాచమల్ల విశ్వం, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఏవీఆర్ ప్రసాద్, మిద్దె భూపాల్, కామిని నరసింహులు, కామిని బాలయ్య, కామిని కృష్ణమూర్తి, మణికంఠ, చిమ్మ శ్రీనివాసులు, మైనార్టీ నాయకుడు అమానుల్లా, కౌన్సిలర్లు అన్నం శశిరేఖ, ఫాతిమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి నిరోధకులను తరిమికొట్టండి'

నంద్యాల (ఎడ్యుకేషన్): అభివృద్ధి నిరోధక నాయకులను తరిమికొట్టండని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా 24వ వార్డు కౌన్సిలర్ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో దేవనగర్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోండా ఉమా మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ హయాంలో 10 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న శిల్పా మోహన్‌రెడ్డి నంద్యాలను అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. అనంతరం కౌన్సిలర్ దిలీప్‌కుమార్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని పరిశీలించి కౌన్సిలర్‌ను అభినందించారు. ప్రచార కార్యక్రమంలో అనంతపురం జిల్లా పామిడి మున్సిపల్ చైర్మన్ గౌస్‌పీరా, గుంతకల్లు ఎంపీపీ రాయల్ రామయ్య, మాజీ కౌన్సిలర్ దస్తగిరి, అశోక్‌కుమార్, మావలి, ఇమ్మానుయేలు, సంపత్, మోహన్, మత్తయ్య, ఇర్ఫాన్, శరత్, దేవనగర్ టీడీపీ యూత్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షం కోసం గంగమ్మకు పూజలు

గోస్పాడు: వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ మంగళవారం గోస్పాడులో పెద్ద సంఖ్యలో మహిళలు గంగమ్మకు బోనాలు సమర్పించారు. ఖరీఫ్‌లో వేసిన పంటలు ఎండిపోతున్నాయని, చాలా రోజుల నుంచి వర్షాలు పడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వర్షాలు కురవాలని పూజలు చేస్తున్నట్లు మహిళలు తెలిపారు.



బోనాలతో వెళ్తున్న మహిళలు

'7,8,9 తేదీల్లో ఛలో ఢిల్లీ'



సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

నంద్యాల (ఎడ్యుకేషన్): చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ జనసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో లక్ష్మీనరసింహ మాట్లాడుతూ బీసీల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఆగస్టు నెల 7,8,9వ తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో 56 శాతం, పంచాయతీరాజ్ సంస్థల్లో 50 శాతానికి రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని టీడీపీ, వైసీపీ ఎంపీలు పార్లమెంట్ సమావేశంల్లో బీసీల సమస్యలపై గళం విప్పాలని డిమాండ్ చేశారు. యువకులు, ఉద్యోగులు, మేధావులు అధిక సంఖ్యలో ఛలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను, బీసీ జనసభ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, నాయకులు ముక్తార్‌బాషా, వెంకటేష్, బాలరాజు, కార్తీక్, లక్ష్మణ్, సుధాకర్ పాల్గొన్నారు.

ఇరువురిపై వేధింపుల కేసు నమోదు

బండిఆత్మకూరు: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన పుల్లయ్య, లీలావతిలపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విష్ణునారాయణ మంగళవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళను పుల్లయ్య వివాహం చేసుకున్నాడన్నారు. అయితే ఇటీవల లీలావతి అనే మహిళతో పరిచయం ఏర్పరచుకొని భార్య లక్ష్మిని మానసికంగా వేధించేవాడని తెలిపారు. అదనపు కట్నం తేవాలని, భార్యా పిల్లలను ఇంటి నుంచి బయటకు పంపించాడని లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మోటార్ సైకిల్‌పై నుంచి పడి యువతి మృతి

పాణ్యం: మండలంలోని తమ్మరాజుపల్లె టర్నింగ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చాకలి చంద్రకళ(25) అనే యువతి మృతి చెందిందని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. గత నెల 31వ తేదీన చంద్రకళ నంద్యాల నుంచి తన బావతో పాటు మోటార్ సైకిల్‌పై సిమెంట్ నగర్‌కు వెళ్తుండగా తమ్మరాజుపల్లె వద్ద స్పీడ్ బ్రేకర్లు దాటుతూ అదుపు తప్పి మోటార్ సైకిల్‌పై నుంచి కిందపడటంతో తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు తెలిపారు. ఆమె కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సమాచారం

పాణ్యం మండల అధికారుల ఫోన్ నంబర్లు

ఎంపీడీవో	- 9949603399
తహసీల్దార్	- 8333988957
పశువైద్యాధికారి	- 9966368818
ప్రభుత్వ వైద్యాధికారి	- 9492759499
ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ	- 9440105233
ఉపాధి ఏపీవో	- 7702074563
పాణ్యం సీఐ	- 9440795534
ఎస్ఐ	- 9440795535

జీపీఆర్ఎస్ ద్వారా అధికారుల కదలికల పరిశీలన

ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్



సమావేశంలో పాల్గొన్న ఎన్నికల అధికారులు

నంద్యాల టౌన్: ఎన్నికలలో విధులు నిర్వహించే ప్రతి అధికారి కదలికలు జీపీఆర్ఎస్ ద్వారా పరిశీలించనున్నట్లు రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికలలో విధులు నిర్వహించే అధికారులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు నిర్వహించాల్సిన విధులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అధికారుల మధ్య సమాచారం తెలుసుకోవడానికి ప్రత్యేక వాట్సప్, యాప్ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎటువంటి సంఘటన జరిగినా తక్షణమే అధికారుల దృష్టికి తీసుకొని రావాలన్నారు. అధికారులు విధి నిర్వహణలో అలసత్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి విషయాన్ని వీడియోలో చిత్రీకరించాల్సిన అవసరం ఉందన్నారు. గృహ యజమానుల అనుమతులు లేకుండా వాల్ పోస్టర్లు అంటించరాదని పేర్కొన్నారు. అభ్యర్థి నామినేషన్ వేసిన సమయం నుంచి ఖర్చులను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అభ్యర్థుల ప్రచార సమయంలో ఎవరినీ కించపరిచే విధంగా దుర్భాషలాడరాదని తెలిపారు. సభలు సమావేశాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో 6 ఫ్లయింగ్ బృందాలు, 3 అదనపు ఫ్లయింగ్ బృందాలు, 3 నోడల్ కోడ్ బృందాలు, 3 వీడియో సర్వేలైన్ బృందాలు, ఒక వీడియో లివింగ్ బృందాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో అధికారులు స్పెషల్ కలెక్టర్ తిప్పేనాయక్, జడ్పీ సీఈవో ఈశ్వర్, ఆర్డీవోలు రాంసుందర్‌రెడ్డి, ఓటులేసు, డీఎస్పీ గోపాల్‌కృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ గెలుపు.. రాష్ట్రాభివృద్ధికి మలుపు: పెద్దిరెడ్డి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

గోస్పాడు: ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి గెలుపు రాబోయే వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధికి మలుపు అని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం దీబగుంట్లలో సొసైటీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శిల్పా మోహన్‌రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో వైసీపీ ప్రచారం

నంద్యాల వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి మంగళ వారం రాయపాడు, కూలూరు, తేళ్లపురి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న పాలన జగన్‌మోహన్‌రెడ్డి తోనే సాధ్యమని, చంద్రబాబు పరిపాలనలో ఎక్కడా అభివృద్ధి జరగడం లేదని, అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. రాయపాడు గ్రామంలో మాజీ సర్పంచ్ యాశం మహేశ్వరరెడ్డి వైసీపీలో చేరారు. ఆయనతోపాటు జయరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గాండ్ల రాజశేఖర్, బాబు, మరో 20 మంది యువకులు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ నాగేశ్వరమ్మ, పీపీ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ రామసుబ్బారెడ్డి, రవికుమార్‌రెడ్డి, నారాయణ, అన్నయ్య, సుధాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

పదవుల ఎరవేస్తున్నారు: శిల్పా

నంద్యాల రూరల్: ఉప ఎన్నికలో అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక నాయకులకు పదవుల ఎర వేసి తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 18 వార్డులో ఉప ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో వార్డులోని ప్రతి వీధిలో తిరిగి ఇంటింట ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు జగన్ ఈ నెల 3వ తేదీన నంద్యాలకు రానున్నారని తెలిపారు. ఉప ఎన్నికలో వైసీపీ ఘన విజయం సాధించనున్నదని పేర్కొన్నారు. తనను ఆదరించి తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ ప్రచారంలో ఆయన వెంట మున్సిపల్ చైర్ పర్సన్ దేశం సులోచన, స్థానిక కౌన్సిలర్ సుబ్బరాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచార ర్యాలీలో పాల్గొన్న శిల్పా మోహన్‌రెడ్డి

ఎస్‌డీఆర్‌లో పట్టాభిషేకం వేడుకలు



విద్యార్థికి పట్టాభిషేకం చేస్తున్న ప్రిన్సిపాల్

నంద్యాల టౌన్: నంద్యాల సమీపంలోని ఎస్‌డీఆర్ స్కూల్‌లో పట్టాభిషేక వేడుకలు ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా 2017-18 అకాడమి విద్యార్థులకు వివిధ రకాల పదవులను కేటాయించి పట్టాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీఆర్ స్కూల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శనివారపు కొండారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్కూల్ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అధ్యాపక బృందం, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గురురాజ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న దస్తగిరిరెడ్డి

నంద్యాల (ఎడ్యుకేషన్): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో నంద్యాల గురురాజ పాఠశాల విద్యార్థిని బి. రాజేశ్వరి అత్యంత ప్రతిభ కనబర్చి పతకాన్ని సాధించిందని గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత పి.దస్తగిరి రెడ్డి మంగళవారం తెలిపారు. విశాఖ పట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి 3వ తైక్వాండో పోటీల్లో 45 కేజీల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి రాజేశ్వరిని దస్తగిరిరెడ్డి, ఆ విద్యాసంస్థల కో-డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి అభినందించారు.

ఏవీ సమక్షంలో టీడీపీలో చేరికలు



ఏవీ సమక్షంలో టీడీపీలో చేరిన యువకులు, మహిళలు

నంద్యాల: నంద్యాల పట్టణంలోని వైఎస్ నగర్, బొమ్మలసత్రం కాలనీలకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఏపీఆర్ఐసీ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. నూనెపల్లెకు చెందిన బాబుల్లా ఆధ్వర్యంలో, వైఎస్‌నగర్‌కు చెందిన రోహిత్, సుభాన్, ఇమ్రాన్, రఫీ, నూర్జహాన్, తదితరుల నాయకత్వంలో పలువురు టీడీపీలో చేరారు. బొమ్మల సత్రం పుల్లయ్య, ఉమామహేశ్వరరావు, బాలదాసు, ఈశ్వరయ్యల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఏవీ సుబ్బారెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆంధ్రజ్యోతి దిన పత్రిక కావలసిన వారు ఈ సెల్ నెంబర్లను సంప్రదించగలరు.

ఏసీవో సెల్: 9985411377

ఎస్ఆర్ సెల్: 9985457435

నంద్యాల కాంగ్రెస్ అభ్యర్థిగా అబ్దుల్ ఖాదర్



నంద్యాల: నంద్యాల ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎస్.అబ్దుల్‌ఖాదర్ పేరును ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి హైదరాబాద్‌లో ప్రకటించారు. బనగానపల్లె పల్లె మండలం ఉసేనాపురం గ్రామానికి చెందిన అబ్దుల్ ఖాదర్ న్యాయవాదిగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ప్రస్తుతం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. గతంలో పీసీసీ లేబర్ సెల్ అధ్యక్షుడిగా, ఐఎన్‌టీయూసీ కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా కూడా అబ్దుల్ ఖాదర్ పని చేశారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన అబ్దుల్ ఖాదర్ గత 23 ఏళ్లగా ట్రేడ్ యూనియన్ కార్యకలాపాల్లో నాయకుడిగా రాణిస్తున్నారు. కర్నూలు జిల్లా డీసీసీ, పీసీసీ నాయకుల సిఫారస్ మేరకు కాంగ్రెస్ అభ్యర్థిగా అబ్దుల్ ఖాదర్ పేరును ఖరారు చేస్తున్నట్లు రఘువీరారెడ్డి పేర్కొన్నారు. నంద్యాల ఉప ఎన్నికలు దుష్ట త్రయానికి (టీడీపీ, బీజేపీ, వైసీపీ), కాంగ్రెస్ పార్టీకి మధ్య పోటీ అని ఆయన పేర్కొన్నారు. ఈనెల 4, 5 తేదీల్లో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు అభ్యర్థి అబ్దుల్‌ఖాదర్ వెల్లడించారు.

ఈవీఎంలపై అపోహలు వద్దు : జేసీ, ఆర్వో

నంద్యాల (ఎడ్యుకేషన్): ఈవీఎంలపై అపోహలు ఉండకూడదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. నంద్యాల బొమ్మలసత్రం సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఆయన ఈవీఎం మిషన్లపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈవీఎంల ఆపరేటింగ్ గురించి సంబంధించిన నిపుణులు ప్రజెంటేషన్ చేశారు. మిషన్లు ఖచ్చితంగా, సరిగ్గా పని చేస్తాయని, వాటిపై ఎలాంటి సందేహాలు వద్దని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు ఎన్నికల కమిషన్ రూపొందించిన నియమావళిని క్షుణ్ణంగా తెలుసుకొని ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో నంద్యాల ఆర్డీవో రామ్‌సుందర్‌రెడ్డి, నంద్యాల తహసీల్దార్ జయరామిరెడ్డి, టీడీపీ నాయకుడు జేవీ మనోహర్ రెడ్డి, వైసీపీ నాయకుడు ద్వారం



ఈవీఎంను పరిశీలిస్తున్న ప్రసన్న వెంకటేష్

మాదవరెడ్డి,కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ రియాజ్, ఈవీఎం ఇంజనీర్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

Andhra Jyothi CLASSIFIEDS Hello... 99854 11141, 99854 02121

HELLO: 998541 1141, 99854 02424, 99854 02544, 99854 02121

శ్రీ వెంకటేశ్వర స్టడీ సెంటర్

NIOS ద్వారా ఒకే సంవత్సరంలో 10th తరువాత Inter (All Groups) ఫెయిల్ అయిన అభ్యర్థులకు 2017 సెప్టెంబర్‌లో Exams జరుగును. SK, RU University ల ద్వారా డిగ్రీ, PG పూర్తి చేయబడును. పై చదువులకు ప్రమోషన్‌లకు ఉపయోగపడును. Cont: 9701643243, 9052697084 KNL. AJL-371678

ఆర్మీ క్లర్క్ N.A.ట్రేడ్‌మెన్ ర్యాలీ

పై జాబ్స్ 100% పొందుటకు (C.A.) ప్రత్యేకమైన కోచింగ్, హాస్టల్, గ్రౌండ్, ఆన్‌లైన్ అప్లికేషన్ చేయు వసతులు కలవు. వృద్ధి చాలా తక్కువ కలదు. వెంటనే సంప్ర: WIN Defence Academy, కడప, సెల్: 8499868703,9515471598 AJC-397117

GOLD FINANCE

బంగారము బ్యాంకులలో గానీ, ఏ ఇతర ప్రైవేట్ సంస్థలలో గానీ, తాకట్టులో నివి విడిపించి మేమే కొనబడును. సంప్ర : 8790783258 Ajc-397116

LOANS

● DHILLON HIRE PURCHASE PVT.LTD నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (R.O.C & RBI అప్రూవ్డ్) ద్వారా అన్ని రకముల లోన్స్ తక్కువ వడ్డీతో పొందగలరు. బ్యాంక్ రిజెక్ట్ చేసిన/ సిబిల్ ప్రాబ్లమ్స్ వారికి కూడా లోన్స్ ఇవ్వబడును. ఫోన్: 9115151517 AJH -384721

LOANS

● అపరిమిత రుణాలు!!! ఆస్తిపై విద్యార్థులకు, రైతులకు, కొత్తవ్యాపారులకు, ప్రైవేట్ మరియు ప్రభుత్వ ఉద్యోగులకు 1 లక్ష నుండి 10 కోట్ల వరకు రుణం ఇవ్వబడును. ఏజెంట్లు అవసరం. గమనిక: CIBIL బ్యాంక్ తిరస్కరించబడిన దరఖాస్తుదారులు దరఖాస్తు చేసుకోవచ్చు. UNLIMITED FINANCIAL LTD. ఫోన్: 8054949494, 8054959595. AJH-274

పుట్టగొడుగుల పెంపకం (ఫ్రెష్ మష్రూమ్స్ డీలర్ షిప్)

➡ పుట్టగొడుగుల పెంపకం ద్వారా ఇంట్లో గంట పనిచేస్తూ 10,000/- అధిక ఆదాయం. శిక్షణ ఇచ్చి పుట్టగొడుగులను మేము కొంటాము. మష్రూమ్స్ విత్తనాల (స్పాన్) లభించును. ఫంక్షన్లకు, శుభకార్యాలకు ఫ్రెష్ మష్రూమ్స్ సప్లయ్ చేయబడును. 9966158007 AJA-397517

WANTED

● ప్రైవేట్ బ్యాంకు నందు పనిచేయుటకు అకౌంట్స్ క్యాషియర్, కం.ఆపరేటర్స్, క్లర్క్, డేటా ఎంట్రీ సెక్యూరిటీ గార్డ్స్ బిలకార్స్ కావలెను. ఆకర్షణీయమైన జీ: రూం+మీల్స్ ఫ్రీ. Q:10th-డిగ్రీ Age 18-42 ఫోన్: 9700273952 AJH-11502

పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.

బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.

పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

- మేనేజర్



CLASSIFIED ADVERTISEMENT FROM KURNOOL DIST 4-LINES Rs.220 Only/ EXTRA LINE Rs.45/- +5% GST EXTRA.

FOR FURTHER DETAILS CONTACT, KURNOOL

కర్నూలు : 99854 11141, 99854 02424, 97036 18696, 99854 02890, 99854 02544, నంద్యాల : 99854 02121, 94940 25064, పత్తికొండ : 99854 11074, 97036 18726 ఆదోని : 97036 18726, ఆళ్ళగడ్డ: 9885227305, 99854 02534 డోన్: 99854 11178, శ్రీశైలం : 99854 04381, 83329 77089 నందికొట్కూరు: 9985402890, ఎమ్మిగనూరు : 78931 48646 బనగానపల్లె : 99854 02121, ఆత్మకూరు: 99854 08498

కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి

కర్నూలు (కలెక్టరేట్): జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను నంద్యాల ఉప ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మంగళవారం పరిశీలించారు. నంద్యాల ఆర్వో కారణంగా నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి నంద్యాల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్వో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను తనిఖీ చేశారు.

221 తుపాకులు డిపాజిట్

నంద్యాల ఉప ఎన్నిక నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 221 తుపాకులను డిపాజిట్ చేశారు. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి నేటి వరకు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న 221 లైసెన్స్ తుపాకులను డిపాజిట్ చేశారు. గత జనరల్ ఎన్నికలలో 1094 తుపాకులు డిపాజిట్ కాగా... నోటిఫికేషన్ వెలువడి నాలుగు రోజులవుతున్నా కేవలం 221 తుపాకులు డిపాజిట్ అయ్యాయి. జూలై 31వ తేదీన ఒక్క రోజులోనే 208 తుపాకులను డిపాజిట్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 278 లీటర్ల మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు.

రక్షణ చర్యలకు ప్రత్యేక బృందాలు: కలెక్టర్

కర్నూలు (కలెక్టరేట్): నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా రక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకూడదన్నారు. ఇందుకు సరిహద్దు చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టోరియల్ ఆఫీసర్లు, మోడల్ కాండక్ట్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

ఆరు బార్డర్ చెక్‌పోస్టుల ఏర్పాటు..

జిల్లా సరిహద్దుల్లో ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఇక్కడ విధులు నిర్వహించేందుకు ఒక్కొక్క బృందంలో ముగ్గురు ఉంటారు. ఈ మూడు బృందాలు షిప్టుల వారిగా విధులు నిర్వహిస్తారు. హాలహర్వి పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్షేత్ర గుడి వద్ద, కర్నూలు మండలంలోని పంచలింగాల, ప్యాపిలి మండల కేంద్రం వద్ద, చాగలమర్రి మండల కేంద్రం వద్ద, ఆత్మకూరు, మాధవరం పోలీస్‌స్టేషన్ పరిధిలలో బార్డర్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని నిర్వహించేందుకు మండలానికి ముగ్గురు చొప్పున అధికారులకు బాధ్యతలు అప్పగించారు. నంద్యాల నియోజకవర్గాన్ని 22 ప్రాంతాలుగా విభజించారు. ఒక్కొక్క ప్రాంతంలో ఒక పోలింగ్ స్టేషన్‌ను మొదలుకుని 5లేదా 6 పోలింగ్ స్టేషన్‌లు వరకు ఒక ప్రాంతం క్రిందకు తీసుకొచ్చారు. ఒకొక్క ప్రాంతంలో సెక్టోరియల్ ఆఫీసర్లుగా ఒక రెవెన్యూ, ఒక పోలీసు అధికారిని నియమించారు.

నేడు భూమా బ్రహ్మానందరెడ్డి నామినేషన్

నంద్యాల: నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థిగా భూమా బ్రహ్మానందరెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పద్మావతినగర్‌లోని భూమా ఇంటి నుంచి ఉదయం 9 గంటలకు వేలాది మంది కార్యకర్తలు, అభిమానులతో బారీర్యాలీతో నామినేషన్‌కు బయలుదేరేందుకు ఏర్పాటు పూర్తి చేశారు. ర్యాలీ సూరజ్ హోటల్ సెంటర్, సంజీవనగర్‌గేట్, శ్రీనివాససెంటర్ మీదుగా మార్కెట్ యార్డుకు చేరుకుంటుంది. మార్కెట్ యార్డులో బహిరంగ సభ నిర్వహిస్తారు. ఉదయం ఆళ్లగడ్డలో భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డిల ఘాట్‌ల వద్ద మంత్రి అఖిలప్రియ, బ్రహ్మానందరెడ్డి ఇతర కుటుంబ సభ్యులు శ్రద్ధాంజలి ఘటిస్తారు. అక్కడి నుంచి నంద్యాలకు చేరుకొని ర్యాలీ, బహిరంగ సభల్లో పాల్గొంటారు. టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి నామినేషన్‌కు ఉపముఖ్యమంత్రి కే.ఈ.కృష్ణమూర్తి, మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాల్వ శ్రీనివాసులు, ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎన్‌టీఆర్, బాలకృష్ణ అభిమానులు భారీగా తరలి రానున్నారు. ఈ సందర్భంగా భూమా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి అండగా నిలిచి నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలి రావాలని కోరారు.

రేపు నంద్యాలకు జగన్

ఎస్‌పీజీ హైస్కూల్ గ్రౌండ్‌లో బహిరంగ సభ



నంద్యాల: వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం నంద్యాలకు వస్తున్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శిల్పా మోహన్‌రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాలకు వస్తున్నారు.

మొదటి రోజుఎస్‌పీజీ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. జగన్ పర్యటనలో నాలుగు రోజుల పాటు నంద్యాల నియోజకవర్గంలో అభ్యర్థి శిల్పా విజయం కోసం జగన్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. జగన్ బహిరంగ సభను భారీగా నిర్వహించేందుకు వైసీపీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నాన్న చనిపోయాక ఇబ్బందులు పెట్టారు: మంత్రి అఖిల ప్రియ

ఆంధ్రజ్యోతి - కర్నూలు: నాన్న భూమా నాగిరెడ్డి చనిపోయాక నంద్యాల టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి ఎన్నో ఇబ్బందులకు గురి చేశాడు.. అధిష్టానం ఆదేశాలతో వాటిని ఓర్పుతో భరించానని పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. మంగళవారం ఆమె ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, గుర్తించడం లేదని పేర్కొనడం సరైంది కాదన్నారు. పార్టీ పని చేసే వాళ్లకు మంచి గుర్తింపే ఇస్తుందని తెలిపారు. పార్టీల నిర్ణయమే శిరోధార్యమని ఆయన తమ్ముడు శిల్పా చక్రపాణిరెడ్డి శాసన మండలి ఎన్నికల్లో పోటీ చేస్తే ఆయన గెలుపు కోసం కృషి చేసి గెలిపించుకున్నామన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా పని చేస్తున్నామని తెలిపారు. శిల్పా చక్రపాణిరెడ్డి ఇప్పటికీ టీడీపీలోనే ఉన్నారని వివరించారు. జిల్లాలో జరిగే అభివృద్ధిని చూసి పార్టీని వీడుతారని తాను అనుకోవడం లేదన్నారు. తాను ప్రజల దగ్గరకు వెళ్లి పని చేశామన్నారు. తమ పనిని చూసి సీఎం చంద్రబాబు నాయుడు తగిన గుర్తింపు ఇచ్చారు.

కష్టపడి పని చేసే వాళ్లకు టీడీపీలో ఎప్పటికీ ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డికి ఓటు వేస్తే అభివృద్ధిని అడ్డుకుంటారని వివరించారు.

జనసేన.. ఎవరి పక్షాన?

- పవన్ కల్యాణ్ ప్రకటనపై ఉత్కంఠ
- తమకే మద్దతు ఇస్తారంటున్న టీడీపీ
- అటు వెళ్తే నష్టమేనని వైసీపీ అంచనా

ఆంధ్రజ్యోతి-కర్నూలు: నంద్యాల ఉప ఎన్నిక టీడీపీ, వైసీపీకి ప్రతిష్ఠాత్మకంగా మారాయి. 2019 సాధారణ ఎన్నికలకు ముందు వస్తున్న ఉప ఎన్నిక కావడంతో.. నంద్యాల ఓటర్లు ఎలాంటి తీర్పు ఇస్తారోనని రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఓటు ఎంతో కీలకం. ప్రధానంగా టీడీపీ, వైసీపీ మధ్యే పోరు ఉంటుంది. దీంతో గెలుపే లక్ష్యంగా ఇరుపార్టీల నాయకులు వ్యూహాత్మకంగా ఎత్తులు వేస్తున్నారు. సీఎం చంద్రబాబు, ప్రతిపక్షనేత జగన్ తమ సైన్యాన్ని నడిపిస్తున్నారు. ఈ తరుణంలో సామాజికవర్గాల వారీగా ఓటర్లను ఆకట్టుకోవడానికి ఇరు పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోమవారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసిన తర్వాత చేసిన ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. నంద్యాల ఉప ఎన్నిక ప్రత్యేక పరిస్థితుల్లో వచ్చిందని, ఎవరికి మద్దతు ఇవ్వాలో రెండు రోజుల్లో ప్రకటిస్తానని ఆయన అన్నారు. దీంతో పవన్ తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

అధినేత నిర్ణయం కోసం ఎదురుచూపు


అక్టోబరు నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో చురుగ్గా ఉంటారని పవన్ ఇప్పటికే ప్రకటించారు. రెండు మూడు నెలల నుంచే జిల్లాల్లో జనసేన సేవాదళ్ కార్యకర్తలు క్రియాశీలక సభ్యత్వ నమోదు, పవన్ అభిమాన బలం అంశాలపై లోతైన విశ్లేషణ చేశారు. నంద్యాల నియోజకవర్గంలోని నంద్యాల అర్బన్, నంద్యాల రూరల్, గోస్పాడు మండలంలో జనసేన సేవాదళ్ క్రియాశీలక సభ్యత్వం 4 వేల మంది తీసుకున్నారు. వీరు కల్యాణ్ ఏ నిర్ణయం తీసుకున్నా సైనికుల్లా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరు కాదని పవన్ బాటన నడిచేందుకు ఆ సామాజికవర్గానికి చెందిన 25 వేల నుంచి 35 వేల మంది అభిమానులు, సేవాదళ్ సాధారణ కార్యకర్తలు, పవన్ కల్యాణ్ ఆశయ సాధన సమితి సభ్యులు ఉన్నారని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. వీరంతా పవన్ ప్రకటన కోసం ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారు. అయితే.. ఇప్పటికే పవన్ పవన్ అభిమానులను తమ వైపు తిప్పుకోవడానికి ప్రధాన పార్టీలు చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని జనసేన సేవాదళ్ కార్యకర్తలు రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి తాము ఎటు వెళ్లాలో దిశానిర్దేశం చేయాలని కోరినట్లు సమాచారం. ఇలాంటి కీలక పరిస్థితుల్లో కల్యాణ్ తీసుకునే నిర్ణయం ఎన్నికల్లో నిర్ణయాత్మకంగా మారవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

పవన్ మద్దతు తమకేనని అధికార పార్టీ ధీమా

2014 ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన మిత్రపక్షాలుగా పోటీ చేశాయి. జనసేన అధినేత అభ్యర్థులను బరిలో దింపకపోయినా టీడీపీ, బిజేపీకి మద్దతుగా ప్రచారం చేశారు. మూడేళ్లలో ఉద్దానం వంటి సమస్యలు, ప్రత్యేక హోదా వంటి అంశాలపై ముక్కుసూటిగా నిలదీసినా మిత్రపక్షం నుంచి బయటికి రాలేదు. పలుసార్లు సీఎం చంద్రబాబును కలిసి సమస్యలు వివరించారే తప్ప.. అధికార పక్షానికి వ్యతిరేకంగా మాట్లాడిన సందర్భాలు లేవు. ఈ పరిణామాలను పరిశీలిస్తే ఉప ఎన్నికలో పవన్ మద్దతు తమకే ప్రకటిస్తారని అధికారపార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.అదే క్రమంలో పవన్ తీసుకునే నిర్ణయం వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతా యోనని వైసీపీ అంచనా వేస్తోంది. పవన్ టీడీపీకి మద్దతు ఇస్తే ఏఏ సామాజికవర్గాల్లో తమకు నష్టం వాటిల్లుతుందో.. ఆ నష్టాన్ని ఎలా పూడ్చుకోవాలోనని వైసీపీ నాయకులు వ్యూహాత్మక ఎత్తులు వేస్తున్నారు. పవన్ ఏ నిర్ణయం తీసుకున్నా తమకు సహకరించాలని ఆయన అభిమానులను వారు కోరినట్లు సమాచారం. మిత్రపక్షమైన తమకు జనసేన సేవాదళ్ కార్యకర్తలు ప్రచారానికి రావాలని టీడీపీ నాయకులు కోరగా.. పవన్ కల్యాణ్ తీసుకునే నిర్ణయానికే తాము కట్టుబడి ఉంటామని వెల్లడించినట్లు సమాచారం. జనసేన సైన్యం ఏ బాటన నడుస్తుందో తేలాలంటే ఒకటి రెండు రోజులు ఆగాల్సిందే.

నిర్ణయాత్మకంగా మారే అవకాశం

పవన్ తీసుకునే నిర్ణయం ఉప ఎన్నికలో నిర్ణయాత్మకంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. నంద్యాల నియోజకవర్గంలో 2,09,612 మంది ఓటర్లు ఉన్నారు. ముస్లింలు, బలిజలు, ఆర్యవైశ్యులు, రెడ్లు, ఎస్సీ, ఎస్టీ ఓటర్లు ఉన్నారు. బలిజ ఓటర్లు దాదాపు 42 వేలు ఉంటారని అంచనా. దీంతో పవన్ తీసుకునే నిర్ణయం బలిజ ఓటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆ సామాజికవర్గం అధికార పక్షానికి మద్దతుగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో టీడీపీకి పవన్ మద్దతిస్తే బలిజ ఓటర్లు ఆ పార్టీకి మరింత పెరిగే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



పవన్ మద్దతు మాకే ఉంటుంది: మంత్రి అఖిలప్రియ

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తో మా కుటుంబానికి ఎన్నో ఏళ్లుగా అవినాభావ సంబంధాలు ఉన్నాయి. ఆయన అంటే మాకు ఎంతో ప్రేమ, అభిమానం. మా రెండు కుటుంబాలు సన్నిహితంగా ఉంటాయి. నంద్యాల ఉప ఎన్నికలో పవన్ కళ్యాణ్ మద్దతు మాకే ఉంటుంది. ఆ నమ్మకం నాకు బలంగా ఉంది. ఈ ఉప ఎన్నికలో పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన పార్టీ సేవాదళ్ కార్యకర్తలు సహకరిస్తారు. ఇందులో ఎలాంటి సందేహమే లేదు.

టీడీపీలోకి వెల్లువ



టీడీపీలో చేరుతున్న చింతల సుబ్బరాయుడు

నంద్యాల: నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయం కోసం కృషి చేస్తామంటూ పలువురు ప్రముఖులు సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. మంగళవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో పలువురు గ్రామస్థాయి నాయకులు, నంద్యాల పట్టణానికి చెందిన ప్రముఖులు పార్టీలో చేరారు. గోస్పాడు మండలం దీబగుంట్ల గ్రామానికి చెందిన ఇసుకపల్లె మహేశ్వరరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, వర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి, మండల టీడీపీ మాజీ కన్వీనర్ వేమారెడ్డి, వెంకటరెడ్డిలతో పాటు మరో 40 మంది టీడీపీలో చేరారు. వీరందరికీ చంద్రబాబు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శిరివెళ్ళ మండల టీడీపీ కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కామినేనిపల్లె సర్పంచ్ రాంభూపాల్‌రెడ్డి టీడీపీలో చేరారు. అలాగే నంద్యాల పట్టణానికి చెందిన బలిజ సంఘం మాజీ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ చింతల సుబ్బరాయుడు, యువ నాయకుడు చింతల కుమార్ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వెదుర్ల రామచంద్రారావు ఆధ్వర్యంలో సీఎం సమక్షంలో టీడీపీలో చేరారు. సీఎం మాట్లాడుతూ కేశవరెడ్డి బాధితుల్లో అందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

విభీషణుడనుకున్నాం..మైరావణుడయ్యాడు

- అభివృద్ధిని అడ్డుకోవడమే జగన్ నైజం
- మైనార్టీలపై శిల్పా కక్ష సాధింపు చర్యలు
- నంద్యాల ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం
- భారీ మెజార్టీతో గెలుపు ఖాయం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే.ఈ.కృష్ణమూర్తి

నంద్యాల:ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి విభీషణుడిలా ఉంటాడని భావించామని, అయితే మైరావణుడిగా మారుతున్నాడని ఉప ముఖ్యమంత్రి కే.ఈ. అనుమానం వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర ప్రచార కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి వైసీపీలోకి వెళ్లిపోయినా.. ఆయన సోదరుడు ఎమ్మెల్సీ చక్రపాణిరెడ్డి విభీషణుడిలా టీడీపీని అంటిపెట్టుకుని ఉంటాడని భావించామని, అయితే ఆయన మైరావణుడిగా మారుతున్నట్లు ఉందని విమర్శించారు. వైసీపీ అభివృద్ధి వ్యతిరేకతే లక్ష్యంగా పని చేస్తున్నదని అన్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసి విఫలమైన జగన్.. నంద్యాల అభివృద్ధిని సైతం అడ్డుకోవాలని దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి ప్రతిపక్ష నేత జగన్‌కు కాళ్లూ చేతులు ఆడక దిక్కుతోచని స్థితిలో ఉన్నాడని విమర్శించారు.కేసుల నుంచి తప్పించుకో వడానికి ప్రధాని మోదీ ముందు మోక రిల్లిన జగన్ అవినీతి ఆరోపణల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగాఉందన్నారు. జగన్ సొంత జిల్లాలో ఎమ్మెల్సీని గెలిపించుకోలేకపోయారని, అలాంటి వ్యక్తి నంద్యాలకు వచ్చి ఏం చేస్తారని ప్రశ్నించారు. నంద్యాల ఉప ఎన్నికల ఇన్‌చార్జిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని, భారీ మెజార్టీతో టీడీపీ విజయం ఖాయమని అన్నారు. గత ఎన్నికల్లో తనకు ఓట్లు వేయలేదని కక్షగట్టి మైనార్టీలను అక్రమ కేసుల్లో శిల్పా ఇరికించారని, మున్సిపల్ దుకాణాల అద్దెలను పథకం ప్రకారం పెం చి ఇబ్బందుల పాలు చేశారని అన్నారు. మైనార్టీ నేత లు ఫరూక్, నౌమాన్‌ల మీద ద్వేషాన్ని పెంచుకొని వేధించారని, పదవులు రాకుండా అడ్డు తగిలారని, పార్టీ నుంచి శిల్పా బయటకు వెళ్ళిన తరువాతనే మైనార్టీలకు పదవులు వచ్చాయని కే.ఈ. గుర్తు చేశా రు. నంద్యాల ఉప ఎన్నికలను టీడీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి

వయో పరిమితి తగ్గింపుపై అపోహలు వద్దు: కేఈ కృష్ణమూర్తి

ఉద్యోగుల వయో పరిమితి తగ్గింపు ప్రచారం పచ్చి అబద్ధమని ఉప ముఖ్యమంత్రి కే.ఈ.కృష్ణమూర్తి అన్నారు. అనవసర ప్రచారం చేసి ఉద్యోగుల్లో అభద్రత భావాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వైసీపీ నాయకులు, వారి ఆస్థాన పత్రిక, ఛానల్ చేస్తున్న అవాస్తవ ప్రచారాలను ఉద్యోగులు నమ్మవద్దని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే ఎస్.వీ.మోహన్‌రెడ్డి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలి

నంద్యాలకు ఏమి చేస్తారో చెప్పాలి: మంత్రులు



సభలో మాట్లాడుతున్న అమర్‌నాథ్‌రెడ్డి

నంద్యాల: నంద్యాల నియోజకవర్గ అభివృద్ధి గత 13 ఏళ్ల కాలంలో ఏ స్థితికి దిగజారిందో ప్రజలందరికీ తెలుసునని, గతాన్ని తెలుసుకోకుండా బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వైసీపీ నేతలు ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం నంద్యాల మండలం మునగాలలో ఎన్నికల ప్రచారంలో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ నాయకుడు విశ్వనాథ్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. 13 ఏళ్లు అధికారంలో ఉన్న శిల్పా మోహన్‌రెడ్డి అడుగడుగునా నంద్యాల అభివృద్ధిని అడ్డుకున్న విషయం ప్రజలందరికీ తెలుసునని అన్నారు. రోడ్ల విస్తరణ, కుందూ బ్రిడ్జి, చామకాలువ అభివృద్ధి, వివిధ వర్గాల కమ్యూనిటీ హాల్, రోడ్ల నిర్మాణం, అర్హులందరికీ పింఛన్లు, రేషన్ కార్డులను భూమా ఆశయ సాధన కోసం చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీ మేరకే అభివృద్ధి చేస్తున్నామే తప్ప ఉప ఎన్నికల కోసం కాదని స్పష్టం చేశారు. నంద్యాలకు ఏమి చేస్తారో వైసీపీ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులకు గుణపాఠం చెప్పేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారని, టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ నంద్యాలలో అమాయకులపై అక్రమ కేసులు, రౌడీషీట్లు, ఎస్సీ, ఎస్టీ కేసులు, రేప్ కేసులు, హత్యాయత్నం కేసులను పెట్టించిన చరిత్ర శిల్పా మోహన్‌రెడ్డిదేనని విమర్శించారు. ఈ ప్రచారంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, తోట శీనుబాబు, మహానంది దేవస్థానం మాజీ చైర్మన్ కంచెర్ల సురేష్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.



పెద్దాసుపత్రిపై కార్పొరేట్ గద్దలు

- ఎన్టీఆర్ వైద్యసేవ కేసులే టార్గెట్
- దళారులుగా కొందరు వైద్యులు
- రోగిని పంపితే రూ.10 వేలు
- నెలరోజుల్లో 21 కేసులు ఎగరేసుకుపోయారు
- ప్రభుత్వ వైద్యంపై విషం చిమ్ముతూ..

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలో ఉన్న పెద్దాసుపత్రిలో అడ్మిట్ అయ్యే రోగులే వీరి టార్గెట్..! మరీ ముఖ్యంగా.. ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఆపరేషన్లకు వచ్చేవారిపై వల విసురుతారు. వార్డులు బాగాలేవని, వైద్యులు పట్టించుకోరని, నాణ్యమైన పరికరాలు లేవని.. ఇలా రకరకాలుగా రోగులను, వారి బంధువులను భయాందోళనకు గురిచేస్తారు. తరువాత ప్రైవేటు ఆసుపత్రులకు తరలించేస్తారు. ఈ మాఫియాలో నగరంలోని ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు, ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తూ.. ప్రైవేటు ఆసుపత్రుల్లో అదనపు సంపాదనకు మరిగిన వైద్యులు, ఎగ్జిక్యూటివ్‌లు, దళారులు.. ఇలా చాలామందే ఉన్నారు. ఓ రోగిని ఆసుపత్రిలో అడ్మిట్ చేస్తే.. ఎవరి కమిషన్ వారికి అందేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసింది ఈ మాఫియా.

ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. నెలరోజుల వ్యవధిలో సుమారు 21 కేసులు ప్రభుత్వాసుపత్రిలో అడ్మిట్ అయి.. ప్రైవేటుకు తరలిపోయాయి. ఆసుపత్రిలో పనిచేస్తున్న కొందరు జూనియర్ వైద్యులు పనిగట్టుకుని ఈ తతంగం నడిపిస్తున్నారు. పెద్దాసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నా.. దుష్ప్రచారం చేసి రోగులలో అపనమ్మకం, భయాందోళనలు కలిగించి ప్రైవేటు బాట పట్టిస్తున్నారు. ఈ పనిచేసినందుకు వీరికి భారీగా కమీషన్లు అందుతున్నాయి

కేస్ వన్..

సుమారు పదిరోజుల క్రితం. అనంతపురం జిల్లా గుత్తి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి గుండె జబ్బుతో బాధపడుతూ పెద్దాసుపత్రికి వచ్చాడు. అడ్మిట్ చేసుకున్న వైద్యులు వాల్వ్‌లు బ్లాక్ అయినట్లు గుర్తించారు. స్టంట్స్ వేయాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద రోగి పేరు నమోదు చేసుకున్నారు. ఆంజియోగ్రామ్ సహా.. అన్ని వైద్యపరీక్షలు, స్కానింగ్‌లు పూర్తి చేశారు. తెల్లవారితే అతనికి ఆపరేషన్. ఆ సమయంలో ఓ వైద్యుడు బెడ్ వద్దకు వచ్చాడు. 'ఇక్కడ బెడ్స్ ఖాళీ లేవు. షెడ్యూల్ బిజీగా ఉంది. మీకు తెలుసు కదా..? ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం ఎలా ఉంటుందో..! ఎలాగూ ఆరోగ్యశ్రీ ఆపరేషనే కదా.. బయట ప్రైవేటు ఆసుపత్రిలో చేరండి. అక్కడికే వచ్చి ఆపరేషన్ చేస్తా..' అని సలహా ఇచ్చాడు. అంత ప్రేమగా, బాధ్యతగా డాక్టరే తమకు సలహా ఇస్తుంటే కాదనగలరా..? పెద్దాసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. డాక్టర్‌గారు సూచించిన ప్రైవేటు ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. అక్కడ రెండు స్టెంట్లు వేశారు. మూడు రోజుల తరువాత డిశ్చార్జి చేశారు.

కేస్ టూ..

వారం రోజుల క్రితం.. పత్తికొండకు చెందిన రసూల్ అనే ఐదేళ్ల బాలుడికి గుండెలో రంధ్రం పడింది. పెద్దాసుపత్రిలో అడ్మిట్ చేశారు. తన నియోజకవర్గానికి చెందిన వారే కావడంతో మెరుగైన వైద్యం చేయాలని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి వైద్యులకు సిఫార్సు చేశారు. సీటీ సర్జరీలో వైద్యులు అంతా సిద్ధం చేశారు. బాలుడి కుటుంబ సభ్యులకు పెద్దగా అవగాహన లేకపోవడంతో అదనపు శ్రద్ధ చూపారు. మరికాసేపట్లో సర్జరీ అనుకుంటుండగా.. బాలుడి కుటుంబ సభ్యులు సర్జన్ వద్దకు వచ్చారు. బైపాస్ సర్జరీ వద్దని, డిశ్చార్జి చేయాలని కోరారు. 'ఎందుకు..? ఏమైంది..?' అని వైద్యుడు ప్రశ్నిస్తే మౌనం వహించారు. ఓ వైపు బాలుడి పరిస్థితి బాగాలేదు. మరోవైపు డిప్యూటీ సీఎం ఫోన్ చేశారు.బాలుడి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ వారు వినలేదు. డిశ్చార్జి చేయించుకు వెళ్లిపోయారు. సీన్ కట్ చేస్తే.. ఆ బాలుడికి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ చేశారు. ఏం జరిగుంటుందో చెప్పాల్సిన పనిలేదు కదా..!

నిఘా పెట్టాల్సిందే..



పెద్దాసుపత్రిలో అడ్మిట్ అయిన చిన్నారిని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించేందుకు ఓ జూనియర్ డాక్టర్ లేనిపోనివి నూరిపోశాడని తెలిసింది. ఇక్కడి దళారి వ్యవస్థ వల్ల ఎన్టీఆర్ వైద్య సేవ కింద రిజిస్టర్ అయిన కేసులను బయటకు వెళుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటిదాకా ఇలా బయటకు తరలించిన కేసులవల్ల పెద్దాసుపత్రికి దాదాపు రూ.30 లక్షలు దాకా ఆదాయానికి గండి పడింది. ఈ తతంగంపై సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఉంది. పెద్దాసుపత్రిలో తిష్టవేసిన దళారులపై, వైద్యులపై నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవ కింద అడ్మిట్ అయిన రోగుల వివరాలు, వారు ఏ ప్రైవేటు, కార్పొరేటు ఆసుపత్రులకు వెళ్లి ఆపరేషన్ చేయించుకున్నది ఎన్టీఆర్ వైద్య వెబ్‌సైట్‌లో ఉంటాయి. విజిలెన్స్ అధికారులు ఈ వివరాల ఆధారంగా విచారిస్తే మెడికల్ మాఫియా గుట్టు రట్టవుతుంది.

21 కేసులు బయటకు

గత కొన్ని రోజులుగా కార్డియాలజీ నుంచి ప్రైవేటుకు వెళ్లే కేసుల సంఖ్య పెరిగింది. ఎన్టీఆర్ వైద్యసేవ కింద నమోదైన 21 కేసులు కర్నూలు ప్రభుత్వాసుపత్రి నుంచి ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. జూలై నెలలో గుండె శస్త్ర చికిత్స కింద కేవలం ఒక్క కేసు మాత్రమే సీటీ సర్జరీ విభాగానికి వచ్చింది. కార్డియాలజీలో అడ్మిట్ అయిన ఎన్టీఆర్ వైద్యసేవ రోగులను కొందరు జూనియర్ డాక్టర్లు, సిబ్బంది భయాందోళనకు గురిచేసి ప్రైవేట్‌కు తరలిస్తున్నారు. 'ఇక్కడ వైద్యం బాగా చేయరు. చేస్తే బతకటం కష్టం.. ఆ తరువాత మీ ఇష్టం..' అని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలిస్తున్నారు.

ఒక్క కేసుకు రూ.10 వేలు..

కర్నూలు నగరానికి కార్పొరేట్ ఆసుపత్రులు వచ్చిన తర్వాత కమీషన్ వ్యాపారానికి తెరలేచింది. భారీ కమీషన్లకు కక్కుర్తిపడి కొందరు వైద్యులు రోగులను ప్రైవేట్‌కు తరలిస్తున్నారు. ఇందుకు గానూ ఒక్కో కేసుకు రూ.10 వేలు కమీషన్ ఇస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వైద్య వ్యాపారాన్ని పెంచుకునేందుకు నగరంలోని పలు ప్రైవేటు, కార్పొరేటు ఆసుపత్రులు దళారులు, ఏజెంట్లను నియమించుకున్నాయి. రోగులకు, వారి బంధువులకు బ్రెయిన్ వాష్ చేసి ప్రైవేటుకు పంపడమే వీరి 'ఉద్యోగం'

ఇంటి దొంగలు ఎవరు?

దశాబ్దాల ఘన చరిత కలిగిన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇటీవల ఇంటి దొంగలు ఎక్కువయ్యారు. కొంత మంది వైద్యులు, సిబ్బంది వైద్య మిత్రలు ఆసుపత్రికి వచ్చిన కేసులను ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. ఆసుపత్రిలోని అర్థోపెడిక్, కార్డియాలజీ, పీడీయాట్రిక్ సర్జరీ, క్యాన్సర్, మెడిసిన్, సర్జరీ రోగులను ప్రైవేటు ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు ఏకంగా తమ ఏజెంట్లను నియమించుకుని దందా సాగిస్తున్నాయి.

వైద్యుల అడ్డదారి..

ప్రాణాన్ని కాపాడాల్సిన కొందరు వైద్యులు అడ్డదారులు తొక్కుతున్నారు. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని సంపాదన మార్గంగా ఎన్నుకున్నారు. పెద్దాసుపత్రికి రోజుకు సుమారు మూడు వేలమంది రోగులు ఆరు జిల్లాల నుంచి వస్తుంటారు. అడ్మిట్ అయిన రోగులపై కొందరు వైద్యులు, సిబ్బంది నిఘా వేస్తున్నారు. మాయమాటలు చెప్పి తమ ప్రైవేట్ ఆసుపత్రులకు ఎగరేసుకుపోతున్నారు. పెద్దాసుపత్రిలో పనిచేసే చాలా మంది వైద్యులకు ప్రైవేట్ క్లీనిక్, ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. మరికొందరు కార్పొరేటు, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆపరేషన్‌లు, అత్యవసర సేవలకు వెళుతున్నారు. సంపాదన పెంచుకోవడం కోసం ప్రభుత్వ ఆసుపత్రి ఆదాయానికి గండికొట్టడంతోపాటు ఆసుపత్రి వైద్యంపై దుష్ప్రచారం చేస్తూ ప్రభుత్వ వైద్యాన్ని నిర్వీర్యం చేస్తున్నారు.



కేసులు బయటకు వెళ్లకుండా చర్యలు..



ఆసుపత్రిలోని ఎన్టీఆర్ వైద్యసేవ కేసులను బయటకు తరలిస్తున్నవారిపై నిఘా ఏర్పాటు చేశాం. కేసులు బయటకు తరలిస్తున్న కార్పొరేట్ హాస్పిటల్స్‌పై నిరంతరం నిఘా ఉంచాం. కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లను నియమించుకున్నట్లు తెలిసింది. పెద్దాసుపత్రిలో అలాంటి వారు కనిపిస్తే పట్టుకొని పోలీసులకు అప్పగిస్తాం. ఆసుపత్రిలో కొంత దళారీ వ్యవస్థ ఉంది. దీన్ని రూపుమాపుతాం.

- డాక్టర్ పి.చంద్రశేఖర్, సూపరింటెండెంట్, కర్నూలు ప్రభుత్వాసుపత్రి

వరినారు ఇలా పెంచండి

వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్

శిరివెళ్ల: ఖరీఫ్ వరిసాగు సమయం సమీపిస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. బోర్లు, బావుల కింద ఇప్పటికే కొంతమేర నారుమళ్లను సాగు చేస్తు న్నారు. మరి కొందరు కేసీ కెనాల్, తెలుగుగంగ తదితర సాగునీటి వనరుల కింద నారుమళ్లను సిద్ధం చేసుకుంటు న్నారు. ఈ నేపథ్యంలో వరి నారుమడి సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను శిరివెళ్ల మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ రైతులకు వివరించారు.

- ఒక ఎకర పొలానికి 5 సెంట్ల నారుమడి అవసరం.
- ట్రైకోథర్మ విరిడి లేదా మ్యాంకోజబ్‌తో విత్తనశుద్ధి చేయాలి. శుద్ధి చేసిన విత్తనాలను 24 గంటలు మండె కట్టిన తరువాత చల్లుకోవాలి.
- ఐరన్ లేదా జింక్ లోపం పొలంలో ఉన్నట్లైతే ఒక లీటర్ నీటిలో అన్నభేది ఒక గ్రాము లేదా రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
- నారుమడిలో యూరియా చల్లరాదు.
- ఆరోగ్యకరమైన నారుకు 21 నుంచి 25 రోజుల వయసు ఉండాలి.
- నారు పీకేందుకు ఒక రోజు ముందు ఒక సెంటు నారుమడికి 150 నుంచి 200 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు నారుమడిలో చల్లాలి. ఇలా చేస్తే ప్రధాన పొలంలో నాటిన తరువాత రెక్కల పురుగును నివారించవచ్చు.
- 2 నుంచి 3 ఆకులు గల నారును మాత్రమే వాడుకోవాలి.
- ముదురు నారు నాటితే దిగుబడి తగ్గుతుంది.



బోరు కింద రైతులు సాగు చేసిన వరి నారు

ఆదాయానికి ఆన్‌లైన్ దెబ్బ



ఆదోని ఎస్కేడీ కాలనీ 3వ రోడ్డులో అక్రమ నిర్మాణం

- భవన నిర్మాణ అనుమతులు క్లిష్టతరం
- ఆన్‌లైన్ ఫీజుల భారం మూడు రెట్లకుపైనే..
- మున్సిపాలిటీల్లో భారీగా తగ్గిన ఆదాయం

ఆదోని టౌన్: భవనాల నిర్మాణాల అనుమతులు సత్వరమే పొందేందుకు మున్సిపాలిటీలలో ప్రవేశ పెట్టిన ఆన్‌లైన్ విధానం సత్ఫలితాలు ఇవ్వడంలేదు. దీంతో మున్సిపాలిటీల ఆదాయానికి భారీ గండి పడుతోంది. ప్లాను మంజూరుకు చెల్లించాల్సిన ఫీజు తడిసి మోపెడు అవుతోందని, నిబంధనలు కఠినతరంగా ఉన్నాయని బిల్డర్లు, స్వగృహ నిర్మాణదారులు అంటున్నారు. భవన నిర్మాణ అనుమతి ప్రక్రియలో అధికారుల అవినీతి, నిబంధనల అతిక్రమణలను అరికట్టడానికి 2016 ఏప్రిల్ నుంచి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశ పెట్టారు. 5 నిమిషాలలో ప్లాన్‌కు అనుమతి మంజూరు మాటలు మాటలకే పరిమితమైంది. మున్సిపాలిటీ పరిధిలోని లే అవుట్లు, నాన్ లే అవుట్లు, సర్వే నంబర్ల వివరాలు ఆన్‌లైన్‌లో పూర్తి స్థాయిలో పొందుపరచకపోవడంతో ప్లానుల మంజూరులో ఆలస్యం జరుగుతోంది.

కూల్చివేతల భయం..

ఆన్‌లైన్‌లో ప్లాను మంజూరు అనంతరం నిర్మాణ దశలో టాస్క్‌ఫోర్స్ బృందాలు పరిశీలిస్తాయి. ఈ సమయంలో సెట్‌బ్యాక్ స్థలాలలో నిర్మాణాలను కూల్చివేస్తారన్న నిబంధన యజమానులకు ఆందోళన కలిగిస్తోంది. దీంతో అధిక శాతం యజమానులు ఆన్‌లైన్ ప్లాన్ అనుమతి పొందేందుకు ఆసక్తి చూపడం లేదు. అదనంగా నిర్మించే కట్టడాలను క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

అధిక ఫీజులు, కఠిన నిబంధనలు..

పాత పద్ధతితో పోలిస్తే ఆన్‌లైన్ పద్ధతిలో చెల్లించాల్సిన ఫీజులు మూడు రెట్లకు పైగా పెరిగాయి. దీంతో మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్లాను మంజూరు కోసం నాలుగు వైపులా సెట్‌బ్యాక్ (ఖాళీ స్థలం) వదలాలన్న నిబంధన పేదలకు ఇబ్బందిగా మారింది. చిన్నపాటి స్థలాలలో ఈ నియమం ఆచరించడం కష్టసాధ్యంగా మారింది. దీంతో అనుమతులు లభించడంలేదు. దీంతో అనుమతి లేకుండానే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకే పలువురు మొగ్గు చూపుతున్నారు.

15 నెలల కాలంలో ప్లాన్‌ల వివరాలు

మున్సిపాలిటీ	అందిన దరఖాస్తులు	మంజూరైనవి
కర్నూలు కార్పొరేషన్	1,839	1,384
నంద్యాల	498	422
ఎమ్మిగనూరు	470	407
ఆదోని	262	226

రూ.కోట్లలో పుర ఆదాయానికి గండి..

ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టినప్పటి నుంచి కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలలో ప్లానుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా రూ.కోట్లల్లో పురపాలక ఆదాయానికి గండి పడింది. కర్నూలు నగరపాలిక, మూడు మున్సిపాలిటీలలో 2016 ఏప్రిల్ నుంచి 2017 జూలై వరకు మొత్తం 3069 ప్లానులకు దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 2439 ప్లానులు మంజూరు అయ్యాయి. ప్రతి నెలా 1200 నుంచి 1400 ప్లానులు మంజూరు కావాల్సి ఉండగా గత 15 నెలల కాలంలో నెలకు సగటున 162 ప్లానులు మంజూరు చేశారు.



ఆలోచన విధానం, సునిశిత దృష్టి.. ప్రధానం

పోలిక పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో పదం, దానికి ఒక సంబంధం ఇస్తారు. మరో పదం ఇచ్చి ఆ పదానికి కూడా అలాంటి సంబంధాన్నే తెలపమని అడుగుతారు. ఈ విభాగంలోని ప్రశ్నల్లో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు కూడా ఉంటాయి. అభ్యర్థి ఆలోచన విధానం, విజ్ఞానం, సునిశిత దృష్టి, పరిశీలనాత్మకతను అంచనా వేయడమే ఈ పరీక్ష ముఖ్యోద్దేశం. ఇందులో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి..

1. పదాల పోలిక పరీక్ష
2. వర్ణమాల అక్షరాల పోలిక పరీక్ష
3. సంఖ్యలతో పోలిక పరీక్ష



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మోడల్ - 1

1. చాక్‌పీస్: నల్లబల్ల:: ---- : పలక
ఎ) కలం బి) పెన్సిల్ సి) బలపం డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: నల్లబల్లపై చాక్ పీస్‌తో రాస్తారు. అదేవిధంగా పలకపై బలపంతో రాస్తారు.

2. విటమిన్ ఎ : రేచీకటి :: ----- : రికెట్స్
ఎ) విటమిన్ బి బి) విటమిన్ సి
సి) విటమిన్ డి డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: విటమిన్ ఎ లోపంతో వచ్చే వ్యాధి రేచీకటి. అదేవిధంగా విటమిన్ డి లోపంతో వచ్చే వ్యాధి రికెట్స్

3. పత్రం: క్లోరోఫిల్ :: రక్తం : -----
ఎ) కెరోటిన్ బి) జాంథోఫిల్
సి) హిమోగ్లోబిన్ డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: పత్రాల ఆకులు పచ్చగా ఉండటానికి కారణం క్లోరోఫిల్. అదేవిధంగా రక్తం ఎర్రగా ఉండడానికి కారణం హిమోగ్లోబిన్

4. ధర్మామీటర్: ఉష్ణోగ్రత :: అమ్మీటర్ : -------
ఎ) విద్యుత్ బి) ఉష్ణం సి) తేమ డి) వేగం
సమాధానం : **ఎ**
వివరణ: ఉష్ణోగ్రతను కొలిచే సాధనం ధర్మామీటర్. అలాగే విద్యుత్‌ను కొలిచేది అమ్మీటర్

5. రైతు : పొలం :: శాస్త్రజ్ఞుడు: -------
ఎ) కర్మాగారం బి) పాఠశాల
సి) ప్రయోగశాల డి) రంగస్థలం
సమాధానం: **సి**
వివరణ: రైతు పనిచేసే ప్రదేశం పొలం. అదేవిధంగా శాస్త్రవేత్త పనిచేసే ప్రదేశం ప్రయోగశాల

6. పక్షులు : ఆర్నిథాలజీ::గుండె: ------
ఎ) హెమటాలజీ బి) కార్డియాలజీ
సి) సెమన్‌టిక్స్ డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: పక్షులను గురించి వివరించే శాస్త్రం ఆర్నిథాలజీ. అదేవిధంగా హృదయ స్పందన గురించి వివరించే శాస్త్రం కార్డియాలజీ

7. రైతు : నాగలి :: సైనికుడు: ---------
ఎ) తుపాకి బి) కత్తి సి) సూది డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: నాగలిని ఉపయోగించే వ్యక్తి రైతు. అదేవిధంగా తుపాకిని ఉపయోగించే వ్యక్తి సైనికుడు

8. పాల స్వచ్ఛత: లాక్టోమీటర్ :: భూకంపాలు: ---
ఎ) బారోమీటర్ బి) అనిమోమీటర్
సి) ఆడో మీటర్ డి) సిస్మోగ్రాఫ్
సమాధానం: **డి**
వివరణ: పాల స్వచ్ఛతను కొలిచే పరికరం లాక్టోమీటర్. అలాగే భూకంప తీవ్రతను కొలిచే సాధనం సిస్మోగ్రాఫ్

9. బలం: వాట్ :: విద్యుత్ : --------
ఎ) జౌల్ బి) డిగ్రీ సి) ఆంపియర్ డి) సెకండ్స్
సమాధానం: **సి**
వివరణ: బలానికి ప్రమాణం వాట్ అలాగే విద్యుత్‌కు ప్రమాణం ఆంపియర్

10. ముఖేష్: హాకీ :: చెస్ : -------
ఎ) గగన్ నారంగ్ బి) హరి కృష్ణ
సి) లక్ష్మణ్ డి) ఎవరూకాదు
సమాధానం: **బి**
వివరణ: ముఖేష్ హాకీ క్రీడాకారుడు. అలాగే హరికృష్ణ చెస్ క్రీడాకారుడు

11. కొలంబో : శ్రీలంక :: ------ : ఆఫ్ఘనిస్థాన్
ఎ) ఇస్లామాబాద్ బి) కాబూల్ సి) తింపు డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: శ్రీలంక రాజధాని కొలంబో. అలాగే ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్

12. హస్తినాపురం : న్యూఢిల్లీ :: మద్రాస్ : -----
ఎ) చెన్నై బి) పనాజి సి) కోల్‌కతా డి) ముంబై
సమాధానం: **ఎ**
వివరణ: హస్తినాపురానికి కొత్త పేరు న్యూఢిల్లీ, అలాగే మద్రాస్‌కు కొత్త పేరు చెన్నై

13. భరతనాట్యం: తమిళనాడు :: యక్షగానం: --------
ఎ) కేరళ బి) మహారాష్ట్ర సి) కర్ణాటక డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: తమిళనాడు శాస్త్రీయ నృత్యం భరతనాట్యం. కర్ణాటక శాస్త్రీయ నృత్యం యక్షగానం

14. న్యూజిలాండ్ జాతీయ పక్షి : కివి :: మన జాతీయ పక్షి : ---------
ఎ) నెమలి బి) పావురం సి) చిలుక డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: న్యూజిలాండ్ జాతీయ పక్షి కివి అదేవిధంగా మన జాతీయ పక్షి నెమలి.

15. చార్మినార్: హైదరాబాద్ :: తాజ్‌మహల్:-------
ఎ) న్యూఢిల్లీ బి) ఆగ్రా సి) మీరట్ డి) ఔరంగాబాద్
సమాధానం: **బి**
వివరణ: చార్మినార్ హైదరాబాద్‌లో ఉంది. తాజ్‌మహల్ ఆగ్రాలో ఉంది.

16. ఇండియా : రూపాయి :: జపాన్ : -------
ఎ) డాలర్ బి) ఫ్రాంక్ సి) యన్ డి) దీనార్
సమాధానం: **సి**
వివరణ: ఇండియా కరెన్సీ రూపాయి. జపాన్ కరెన్సీ యన్

17. గ్రహాలు : ఖగోళ శాస్త్రం :: నాణేలు : -----------
ఎ) సిస్మోగ్రాఫ్ బి) పేలియోగ్రఫీ
సి) పాథాలజీ డి) న్యూమిస్‌మాటిక్స్
సమాధానం: **డి**
వివరణ: గ్రహాల గురించి వివరించే శాస్త్రం ఖగోళశాస్త్రం. అలాగే నాణేల గురించి వివరించే శాస్త్రం న్యూమిస్‌మాటిక్స్

18. ఆర్య సమాజం: దయానంద సరస్వతి:: రామకృష్ణ మిషన్: --------
ఎ) అనిబిసెంట్ బి) స్వామి వివేకానంద
సి) నివేదిత డి) ఎవరూకాదు
సమాధానం: **బి**
వివరణ: ఆర్య సమాజ స్థాపకుడు దయానంద సరస్వతి. అదేవిధంగా రామకృష్ణ మిషన్ స్థాపకుడు స్వామి వివేకానంద

19. స్వామి వివేకానంద: నరేంద్రదత్:: దయానంద సరస్వతి: -------
ఎ) గధాధరుడు బి) మూల శంకర్
సి) రామచందర్ డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: స్వామి వివేకానంద అసలు పేరు నరేంద్ర దత్. దయానంద సరస్వతి అసలు పేరు మూల్ శంకర్

20. మెగస్తనీస్: ఇండికా:: పాణిని: -----------
ఎ) అష్టాధ్యాయి బి) హర్ష చరిత్ర
సి) చరక సంహిత డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: మెగస్తనీస్ రచించిన గ్రంథం ఇండికా, అదేవిధంగా పాణిని రచించిన గ్రంథం అష్టాధ్యాయి.

21. పాస్కల్: ఒత్తిడి:: ఆంపియర్: -------
ఎ) విద్యుత్ బి) బలం సి) శక్తి డి) స్వచ్ఛత
సమాధానం: **ఎ**
వివరణ: పాస్కల్ అనేది ఒత్తిడికి ప్రమాణం. అలాగే ఆంపియర్ అనేది విద్యుత్‌కు ప్రమాణం

22. కన్నడం: కర్ణాటక:: మరాఠీ: -------
ఎ) మధ్యప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) గుజరాత్ డి) రాజస్థాన్

23. హాంకాంగ్: చైనా:: వాటికన్: --------
ఎ) నార్వే బి) డెన్మార్క్
సి) నెదర్‌లాండ్ డి) రోమ్
సమాధానం: **డి**
వివరణ: చైనాలోని ఒక నగరం హాంకాంగ్. అలాగే రోమ్‌లోని నగరం వాటికన్ సిటీ

24. ఇన్సులిన్: హార్మోన్::ట్రిప్సిన్: -------
ఎ) ఎంజైమ్ బి) విటమిన్ సి) హార్మోన్ డి) గ్రంధి
సమాధానం: **ఎ**
వివరణ: ఇన్సులిన్ అనేది హార్మోన్. అలాగే ట్రిప్సిన్ అనేది ఒక ఎంజైమ్

25. వినడం: చెముడు:: మాట్లాడడం: --------
ఎ) నిశ్శబ్దం బి) మూగ సి) శాంతి డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: వినలేకపోవడం చెముడు అలాగే మాట్లాడలేకపోవడం మూగ

26. భాక్రానంగల్: సట్లెజ్:: హీరాకుడ్ : -------
ఎ) గోదావరి బి) కృష్ణ సి) కావేరి డి) మహానది
సమాధానం: **డి**
వివరణ: భాక్రానంగల్ డ్యామ్ సట్లెజ్ నదిపై ఉంది అలాగే హీరాకుడ్ డ్యామ్ మహానదిపై ఉంది.

27. హరిత విప్లవం: మొక్కలు:: నీలి విప్లవం: ------
ఎ) చేపలు బి) పాలు సి) నూనె గింజలు డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: మొక్కల అధికోత్పత్తికి చేపట్టిన కార్యక్రమం హరిత విప్లవం. అలాగే చేపల అధిక దిగుబడికి చేపట్టిన కార్యక్రమం నీలి విప్లవం

28. తూర్పు: వాయవ్యం:: నైరుతి: ----
ఎ) ఈశాన్యం బి) తూర్పు సి) ఆగ్నేయం డి) ఉత్తరం
సమాధానం: **బి**
వివరణ: తూర్పునకు 135 డిగ్రీల అపసవ్యదిశ వాయవ్యం. నైరుతికి 135 డిగ్రీల అపసవ్య దిశ తూర్పు

29. సత్యజిత్ రే: సినిమా:: పికాసో: ------
ఎ) రచయిత బి) నాటక కర్త
సి) చిత్రకారుడు డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: సినిమా రంగానికి చెందిన ప్రముఖుడు సత్యజిత్ రే. అలాగే సుప్రసిద్ధ చిత్రకారుడు పికాసో

30. రెస్టారెంట్: మెను:: లైబ్రరీ: -----
ఎ) చదువు బి) పుస్తకాలు సి) విద్య డి) క్యాటలాగ్
సమాధానం: **డి**
వివరణ: మెను అనేది ఐటెమ్స్ లిస్ట్. కేటలాగ్ అనేది బుక్స్ లిస్ట్

31. ఓనం: కేరళ:: బిహు: ------
ఎ) కర్ణాటక బి) మిజోరాం సి) అసోం డి) ఒడిశా
సమాధానం: **సి**
వివరణ: కేరళ ప్రజలు చేసుకొనే పండుగ ఓనం. అసోం ప్రజలు చేసుకొనే పండుగ బిహు

32. ప్రమాదం: అజాగ్రత:: వ్యాధులు: -------
ఎ) అపరిశుభ్రత బి) వైద్యుడు
సి) మందులు డి) వైద్యం సమాధానం: **ఎ**
వివరణ: అజాగ్రత్తతో ప్రమాదం లభిస్తుంది. అలాగే అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలుతాయి.

33. శిల్పం: రూపం:: పాట ------
ఎ) సంగీతం బి) గానం సి) చెప్పలేం డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: శిల్పానికి మంచి రూపం ఉండాలి. అలాగే పాటకు మంచి గానం ఉండాలి.

అడ్మిషన్స్

ఐఎన్ఎటి 2017

పుణెలోని ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐయుసిఏఏ), నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రో ఫిజిక్స్ (ఎన్‌సిఆర్ఏ) సంస్థల్లో పిహెచ్‌డి చేసే వారికి ఉద్దేశించిన రీసెర్చ్ స్కాలర్‌షిప్‌నకు ప్రకటన విడుదలైంది.
విభాగాలు: ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, ఫిజిక్స్
అర్హత: ఆగస్టు నాటికి 55 శాతం మార్కులతో (బిఎస్సీ/ ఎమ్మెస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ)(ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్/ ఆస్ట్రానమీ/ అప్లయిడ్ మేథమెటిక్స్) లేదా బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ పూర్తి.
ఎంపిక: ఐయుసిఏఏ - ఎన్‌సిఆర్ఏ అడ్మిషన్ టెస్ట్(ఐఎన్ఎటి 2017), ఇంటర్వ్యూ ద్వారా
పరీక్ష కేంద్రం: ఐయుసిఏఏ, పుణె
ఇంటర్వ్యూ: డిసెంబరు 7, 8
వేదిక: ఎన్‌సిఆర్ఏ - టిఐఎఫ్ఆర్, పుణె
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15, 2017
వెబ్‌సైట్: http://inat.ncra.tifr.res.in/inat

పుణె పాలిటెక్నిక్

పుణెలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ - **అడ్వాన్స్‌డ్ డిప్లొమా(ఆటోమోటివ్ మెకట్రానిక్స్)** ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ స్కిల్ బేస్డ్ జాబ్ ఓరియంటెడ్ కోర్సును **'మెర్సిడెజ్ - బెంజ్'** సహకారంతో నిర్వహిస్తున్నారు.
కోర్సు వ్యవధి: ఏడాది
అర్హత: డిప్లొమా/ డిగ్రీ (ఇంజనీరింగ్)
ఎంపిక: ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా
ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఆగస్టు 18
పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.
వెబ్‌సైట్: www.gppuneamc.org

ఎయిమ్స్

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- పిహెచ్‌డి ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన **'ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్'**కు దరఖాస్తులు కోరుతోంది.
ఎగ్జామినేషన్ తేదీ: సెప్టెంబరు 8
పరీక్ష కేంద్రం: ఢిల్లీ/ ఎన్‌సిఆర్
ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 3, 2017
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 17, 2017
వెబ్‌సైట్: www.aiimsexams.org

డిఎస్‌సి

ద ఢిల్లీ స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్(డిఎస్‌సి)- పీజీ(కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. మ్యాట్/ క్యాట్ అర్హత పొంది ఉండాలి. లేదా డిఎస్‌సి ఇంటర్నల్ అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొంది ఉండాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 7, 2017
వెబ్‌సైట్: www.dsc.edu.in/

డిఐఎంహెచ్

చెన్నైలోని డైరెక్టరేట్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ అండ్ హోమియోపతి (డిఐఎంహెచ్)- బిఎస్ఎంఎస్/ బిఏఎంఎస్/ బిఎన్‌వైఎస్/ బియుఎంఎస్/ బిహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: హయ్యర్ సెకండరీ
క్యాంపస్‌లు: తిరునల్వేలి. చెన్నై, మధురై, కన్యాకుమారి **దరఖాస్తు ఫీజు:** రూ.500
అప్లికేషన్ డౌన్‌లోడింగ్‌కు చివరి తేదీ: ఆగస్టు 30, 2017
హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31, 2017
చిరునామా: The Secretary, Selection Committee, Directorate of Indian Medicine and Homoeopathy, Arignar Anna Govt.Hospital of Indian Medicine Campus, Arumbakkam, Chennai-600106
వెబ్‌సైట్: www.tnhealth.org

'ద లైఫ్ డివైన్' గ్రంథ రచయిత ఎవరు?

హోంరూల్ ఉద్యమం

1. భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉంటూ స్వయంపాలన సాగించుకొనే స్థితిని సాధించే లక్ష్యంతో ప్రారంభమైన ఉద్యమం?
ఎ) సహాయనిరాకరణ ఉద్యమం
బి) హోంరూల్ ఉద్యమం
సి) క్విట్ ఇండియా ఉద్యమం డి) ఉప్పుసత్యాగ్రహం
2. హోంరూల్ లీగ్‌ను 1916 ఏప్రిల్‌లో స్థాపించింది?
ఎ) బాలగంగాధర్ తిలక్ బి) సుబ్రమణ్య అయ్యర్
సి) సి.పి.రామస్వామి అయ్యర్ డి) పి.కె.తెలాంగ్
3. హోంరూల్ అనే పదాన్ని ఏ ఉద్యమం నుంచి స్వీకరించారు?
ఎ) గ్రీక్ ఉద్యమం బి) లాటిన్ ఉద్యమం
సి) ఐరిష్ ఉద్యమం డి) గ్రీన్‌పీస్ ఉద్యమం
4. 1916 సెప్టెంబరులో హోంరూల్ లీగ్‌ను స్థాపించింది?
ఎ) మోతీలాల్ నెహ్రూ బి) అనిబిసెంట్
సి) పి.కె.తెలాంగ్ డి) ఎస్.సుబ్రమణ్య అయ్యర్
5. 1897లో హోంరూల్ లీగ్ అనే పదాన్ని మొట్టమొదట ఉపయోగించింది?
ఎ) శ్యాంజీ కృష్ణవర్మ బి) శ్రీకృష్ణ కార్పడే
సి) నరసింహచింతామన్ కేల్కర్
డి) మోతీలాల్ నెహ్రూ
6. 'న్యూ ఇండియా' పత్రికను స్థాపించింది?
ఎ) శ్యాంజీ కృష్ణవర్మ బి) బి.పి.వాడియా
సి) జె.ఎస్.అరుండేల్ డి) అనిబిసెంట్
7. 'ఇండియన్ ఉమెన్స్ అసోసియేషన్' అనే సంస్థను స్థాపించింది?
ఎ) మహమ్మద్ అలీ జిన్నా
బి) అంబికా చరణ్ మజుందర్
సి) అనిబిసెంట్ డి) సురేంద్రనాథ్ బెనర్జీ
8. 1885లో Fabian societyలో చేరి Fabian Essays అనే పత్రికలో సోషలిజం మీద వ్యాసాలు రాసింది?
ఎ) అనిబిసెంట్ బి) భగవాన్‌దాస్
సి) బి.పి.వాడియా డి) జె.ఎస్.అరుండేల్
9. అనిబిసెంట్ దివ్యజ్ఞాన సమాజంలో ఎప్పుడు చేరారు?
ఎ) 1885 బి) 1889 సి) 1895 డి) 1899
10. బెనారస్‌లో 'కేంద్రీయ హిందూ కళాశాల'ను స్థాపించింది?
ఎ) గాంధీ బి) రాస్‌బిహారి ఘోష్
సి) అనిబిసెంట్ డి) బాలగంగాధర్ తిలక్
11. 'భగవద్గీత'ను అనిబిసెంట్ ఎవరి సహకారంతో ఆంగ్లంలోకి అనువదించారు?
ఎ) రాస్‌బిహారి ఘోష్ బి) బి.పి.వాడియా
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) డాక్టర్ భగవాన్ దాస్
12. భారతీయులు పాశ్చాత్య సంప్రదాయాల పట్ల ఆకర్షితులు కావడాన్ని వ్యతిరేకించింది?
ఎ) సాండర్స్ బి) అనిబిసెంట్
సి) చెమ్స్‌ఫర్డ్ డి) మాంటేగ్
13. 1907లో కల్నల్ ఆల్కాట్ మరణం తరవాత దివ్యజ్ఞాన సమాజ బాధ్యతలు చేపట్టింది?
ఎ) అనిబిసెంట్ బి) బాలగంగాధర్ తిలక్
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) జె.ఎస్.అరుండేల్
14. 'ద లైఫ్ డివైన్' అనే గ్రంథాన్ని రచించింది?
ఎ) అరవింద్‌ఘోష్ బి) తిలక్
సి) లాలాలజపతిరాయ్ డి) బిపిన్ చంద్రపాల్
15. 1895-1907 మధ్య బెనారస్ కేంద్రంగా హిందూ మతం గురించి ఉపన్యాసాలు చేసింది?
ఎ) పి.కె.తెలాంగ్ బి) ఎస్.సుబ్రమణ్య అయ్యర్
సి) సి.పి.రామస్వామి అయ్యర్ డి) అనిబిసెంట్
16. 1916 లక్నో సమావేశంలో అతివాదులు తిరిగి కాంగ్రెస్ చేరడంలో కీలక పాత్ర పోషించింది?
ఎ) అనిబిసెంట్ బి) సురేంద్రనాథ్ బెనర్జీ
సి) రాస్‌బిహారి ఘోష్
డి) బాలకృష్ణ శివరాం మోహన్‌జీ
17. 'Englands difficulty is Indian opportunity' అనే నినాదాన్ని ఇచ్చింది?
ఎ) చాంబర్లీన్ బి) అనిబిసెంట్
సి) బి.పి.వాడియా డి) మహమ్మద్ అలీ జిన్నా
18. కాంగ్రెస్, ముస్లిం లీగ్ మధ్య 1916లో లక్నో ఒడంబడిక జరగడంలో కీలక పాత్ర పోషించింది?
ఎ) సి.పి.రామస్వామి అయ్యర్
బి) పి.కె.తెలాంగ్
సి) అనిబిసెంట్ డి) బి.పి.వాడియా
19. 'న్యూ ఇండియా' డైలీ ఎప్పుడు ధరావతును కోల్పోయింది?
ఎ) 1914 బి) 1912 సి) 1915 డి) 1916
20. హోంరూల్ ఉద్యమానికి ప్రతిస్పందిస్తూ ఆగస్టు ప్రకటన చేసింది?
ఎ) చాంబర్లీన్ బి) మాంటేగ్
సి) హార్డింజ్ డి) పాల్ రిచర్డ్
21. ఏ సంవత్సరంలో అనిబిసెంట్ రాజకీయ రంగప్రవేశం చేస్తూ భారతదేశానికి హోంరూల్ ఇవ్వాలని కోరారు?
ఎ) 1911 బి) 1912 సి) 1913 డి) 1914
22. 1917లో ఏ ఐఎన్‌సి సమావేశానికి అనిబిసెంట్ నాయకత్వం వహించారు?
ఎ) కలకత్తా బి) బొంబాయి సి) మద్రాసు డి) గౌహతి
23. ఐఎన్‌సికి అధ్యక్షత వహించిన తొలి మహిళ?
ఎ) దుర్గాభాయి దేశ్‌ముఖ్ బి) విజయలక్ష్మి పండిట్
సి) నిర్మలాదేశ్ పాండే డి) అనిబిసెంట్



కె. చెంచుకుమార్
సీనియర్ ఫ్యాకల్టీ

పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ



బాలగంగాధర్ తిలక్



అనిబిసెంట్

24. 'బాయ్ స్కౌట్ అసోసియేషన్' అనే సంస్థను స్థాపించింది?
ఎ) మహాత్మాగాంధీ బి) అనిబిసెంట్
సి) మోతీలాల్ నెహ్రూ
డి) వినాయక దామోదర్ సావర్కర్
25. మద్రాసులోని అడయార్‌లో అనిబిసెంట్ స్థాపించిన జాతీయ విశ్వవిద్యాలయానికి చాన్సలర్‌గా వ్యవహరించింది?
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) శ్యాంజీ కృష్ణవర్మ
సి) విజయలక్ష్మి పండిట్ డి) బి.పి.వాడియా
26. 1916 మేలో చిత్తూరు జిల్లాలోని మదనపల్లిలో 'థియోసాఫికల్ కళాశాల'ను స్థాపించింది?
ఎ) జె.ఎం.చటర్జీ బి) చాంబర్లీన్
సి) అనిబిసెంట్ డి) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య
27. అనిబిసెంట్ ముఖ్య శిష్యుడు?
ఎ) కొండా వెంకటప్పయ్య
బి) పర్వతనేని వీరయ్య చౌదరి
సి) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య డి) జిడ్డు కృష్ణమూర్తి
28. 'At the feet of master' గ్రంథ రచయిత?
ఎ) జిడ్డు కృష్ణమూర్తి బి) నీలకంఠ బ్రహ్మచారి
సి) అనిబిసెంట్ డి) విజయలక్ష్మి పండిట్
29. బ్రిటిష్ సారథ్యం కింద ఉంచుతూనే భారతీయులకు క్రమానుగతంగా స్వయం పరిపాలన ఇస్తామని ప్రకటన చేసిన భారత రాజ్య కార్యదర్శి?
ఎ) మింటో బి) మాంటేగ్ సి) మార్లే డి) హార్డింజ్
30. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌లో ముఖ్యపాత్ర పోషించింది?
ఎ) గణేష్ శ్రీకృష్ణ కార్పడే
బి) నరసింహ చింతామన్ కేల్కర్
సి) బాలకృష్ణ శివరాం మోహన్‌జీ డి) పైవారందరూ
31. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు అధ్యక్షుడిగా పని చేసింది?
ఎ) చాంబర్లీన్ బి) మార్లే
సి) జోసెఫ్ బాప్టిస్టా డి) పి.కె.తెలాంగ్
32. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు కార్యదర్శి?
ఎ) పాల్ రిచర్ట్ బి) కేల్కర్
సి) మీరా రిచర్డ్ డి) ఎస్.పి.సిన్హా
33. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ ఉద్యమం ఏయే ప్రాంతాలకు పరిమితం అయింది?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) కర్ణాటక డి) బి, సి
34. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరించింది?
ఎ) సర్ ఎస్.సుబ్రమణ్య అయ్యర్
బి) కేల్కర్ సి) జోసెఫ్ బాప్టిస్టా
డి) బాలగంగాధర్ తిలక్
35. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరించింది?
ఎ) జోసెఫ్ బాప్టిస్టా బి) సి.పి.రామస్వామి అయ్యర్
సి) పి.కె.తెలాంగ్ డి) బి, సి
36. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ ఉద్యమం ఏయే ప్రాంతాలకు విస్తరించింది?
ఎ) దక్షిణ భారతదేశం బి) బీహార్, బెంగాల్
సి) యునైటెడ్ ప్రావిన్స్, సింధు డి) పైవన్నీ
37. అనిబిసెంట్ కృషి ఫలితంగా ఏ ఐఎన్‌సి సమావేశంలో బాలగంగాధర్ తిలక్ కాంగ్రెస్‌లో చేరారు?
ఎ) కలకత్తా బి) బొంబాయి సి) లక్నో డి) పూనా
38. 1916లో జరిగిన లక్నో కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షత వహించింది?
ఎ) రాస్‌బిహారి ఘోష్
బి) అంబికా చరణ్ మజుందర్
సి) అరుండేల్ డి) వాడియా
39. భారతదేశానికి స్వపరిపాలన ఇవ్వాలని ఏ ఐఎన్‌సి సమావేశం తీర్మానించింది?
ఎ) లక్నో బి) భోపాల్ సి) అమృత్‌సర్ డి) లాహోర్
40. కాంగ్రెస్, ముస్లింలీగ్ మధ్య రాజ్యాంగ సంస్కరణల విషయమై కుదిరిన ఒడంబడిక ఎప్పుడు జరిగింది?
ఎ) 1915 బి) 1916 సి) 1917 డి) 1918
41. Common Schemeను రూపొందించడంలో ముఖ్యపాత్ర వహించింది?
ఎ) మహాత్మాగాంధీ బి) బాలగంగాధర్ తిలక్
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) మోతీలాల్ నెహ్రూ
42. 1916 డిసెంబర్‌లో ఏ ప్రాంతంలో సమావేశమై కాంగ్రెస్, ముస్లింలీగ్‌లు ఒక సామన్య ప్రణాళిక కోసం చెరొక కమిటీని నియమించాయి?
ఎ) మద్రాస్ బి) తిరువనంతపురం
సి) లక్నో డి) బెంగళూరు
43. హోంరూల్ ఉద్యమ కాలం?
ఎ) 1916-18 బి) 1920-22 సి) 1930-32 డి) 1940-42
44. భారతదేశ వైశ్రాయిగా 1916లో నియమితులైనది?
ఎ) మార్లే బి) లార్డ్ చెమ్స్‌ఫర్డ్
సి) మింటో డి) లార్డ్ కర్జన్
45. శాడ్లర్ కమిషన్‌ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1914 బి) 1915 సి) 1916 డి) 1917
46. 'వందేమాతరం' అనే పత్రికను నడిపిన అతివాద నాయకుడు?
ఎ) మహాత్మాగాంధీ బి) అరవింద్ ఘోష్
సి) తిలక్ డి) లాలాలజపతి రాయ్
47. మితవాద రాజకీయాలను Policy of prayer, petition and protestగా అభివర్ణించింది?
ఎ) తిలక్ బి) లాలాలజపతిరాయ్
సి) అరవింద్ ఘోష్ డి) బిపిన్ చంద్రపాల్
48. 'సావిత్రి' అనే గ్రంథం రచించింది?
ఎ) మదన్ మోహన్ మాలవ్యా
బి) లాలాలజపతిరాయ్
సి) బాలగంగాధర్ తిలక్ డి) అరవింద్ ఘోష్
49. అరవింద్ ఘోష్ జన్మస్థలం?
ఎ) గౌహతి బి) కలకత్తా
సి) భువనేశ్వర్ డి) మద్రాసు

సమాధానాలు

1) బి	8) ఎ	15) డి	24) బి	33) డి	42) సి
2) ఎ	9) బి	16) ఎ	25) ఎ	34) ఎ	43) ఎ
3) సి	10) సి	17) బి	26) సి	35) డి	44) బి
4) బి	11) డి	18) సి	27) డి	36) డి	45) సి
5) ఎ	12) బి	19) డి	28) ఎ	37) సి	46) బి
6) డి	13) ఎ	20) బి	29) బి	38) బి	47) సి
7) సి	14) ఎ	21) సి	30) డి	39) ఎ	48) డి
		22) ఎ	31) సి	40) బి	49) బి
		23) డి	32) బి	41) డి	

JOBS ఉద్యోగాలు

నీతి ఆయోగ్

నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఆయోగ్ (నీతి ఆయోగ్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టులు - ఖాళీలు: అడ్వైజర్/ సీనియర్ అడ్వైజర్ 7, జాయింట్ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, డిప్యూటీ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ 28, రీసెర్చ్ ఆఫీసర్(ఫ్లెక్సీ పూల్) 28, ఎకనామిక్ ఆఫీసర్ (ఫ్లెక్సీ పూల్)28, ఎకనామిక్ ఆఫీసర్ 44
అర్హత: పోస్టును అనుసరించి పీజీ/ ఎంబీబీఎస్
వయసు: 26 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.niti.gov.in

సఫ్దర్‌జంగ్ హాస్పిటల్

ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ హాస్పిటల్- జూనియర్ రెసిడెంట్ (నాన్ పీజీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 58
కాంట్రాక్ట్ వ్యవధి: ఏడాది
అర్హత: ఎంబీబీఎస్ డిగ్రీ ఉత్తీర్ణత + ఢిల్లీ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు పొంది ఉండాలి. అభ్యర్థులు 2015 జూలై 1 తరవాతనే ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష, కౌన్సెలింగ్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.500 (ఒబిసిలకు రూ.250 కాగా ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు మినహాయింపు వర్తిస్తుంది).
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును నిర్దేశిత చిరునామాకు పంపాలి
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10, 2017
చిరునామా: The Medical Superintendent, Safdarjung Hospital & VMMC, New Delhi- 110029
వెబ్‌సైట్: www.vmmc.sjh.nic.in/

ఇండియన్ ఆర్మీ

ఇండియన్ ఆర్మీ కింది పోస్టుల భర్తీకోసం విడివిడిగా దరఖాస్తులు కోరుతోంది.
లా గ్రాడ్యుయేట్స్
ఖాళీలు: 14 (పురుషులకు 10, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు)
అర్హత: 55 శాతం మార్కులతో లా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు మూడేళ్ల అనుభవం ఉండాలి. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/ స్టేట్‌లో రిజిస్ట్రేషన్‌కు అర్హత పొంది ఉండాలి.
వయసు: 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23, 2017
ఎన్‌సిసి స్పెషల్ ఎంట్రీ (43 కోర్స్)
ఖాళీలు: 54 (పురుషులకు 50, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు)
అర్హత: ఎన్‌సిసి సర్టిఫికెట్‌తోపాటు 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. బ్యాటిల్ క్యాజువాలిటీస్/ ఆర్మీ పర్సనల్ పిల్లలకైతే ఎన్‌సిసి సర్టిఫికెట్ అవసరం లేదు.
వయసు: 19 నుంచి 25 ఏళ్లు
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23, 2017
కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ **ఖాళీలు:** 142
ట్రేడ్స్ వారీ ఖాళీలు: మెటీరియల్ అసిస్టెంట్ 6, ఎల్‌డిసి 1, ఫార్మసిస్ట్ 1, టెలీ ఆపరేటర్ 1, ఫైర్‌మన్ 36, ట్రేడ్స్‌మన్(మేట్) 94, ఎంటిఎస్ 1, దోబి 1, టైలర్ 1
అర్హత: పోస్టును అనుసరించి బిఇ/ బిటెక్/ డిఫార్మసీ/ డిప్లొమా / ఇంటర్/ 10వ తరగతి
వయసు: పోస్టును అనుసరించి 18 నుంచి 27 ఏళ్లు
ఎంపిక: ఫిజికల్ అండ్యూరెన్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, రాత పరీక్ష ఆధారంగా.
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును స్పీడ్ / రిజిస్టర్డ్/ ఆర్డినరీ పోస్టుద్వారా నిర్దేశిత చిరునామాకు పంపాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16, 2017
చిరునామా: Commandant 21 Field Ammunition Depot - 909721
వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in

అహోబిలేశుడిని దర్శించుకున్న ప్రముఖులు

ఆళ్లగడ్డ: అహోబిల లక్ష్మీనరసింహస్వామిని గుంటూరు జిల్లా రామచంద్రాపురం ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, కాటన్ బోర్డు మాజీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి(వాసు) మంగళవారం దర్శించుకున్నారు. వీరిని వేద పండితులు సాదరంగా ఆహ్వానించారు. అలాగే వారు ఎగువ, దిగువ అహోబిల లక్ష్మీనారసింహస్వామి వార్లను దర్శించుకొని విశేష పూజలు నిర్వహించారు.

నామినేషన్‌కు తరలిరండి

● **మార్కెట్ కమిటీ చైర్మన్ బీవీ రామిరెడ్డి**

ఆళ్లగడ్డ: నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థిగా భూమా బ్రహ్మానంద రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేస్తారని, ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆళ్లగడ్డ మార్కెట్ కమిటీ చైర్మన్ బీవీ రామిరెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ముందుగా దివంగత నేతలు భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డి, దివంగత భూమా వీరశేఖరరెడ్డిల ఘాట్‌లకు వెళ్లి వారి ఆశీర్వాదాలు తీసుకొని, అనంతరం నంద్యాలలో భూమా బ్రహ్మానందరెడ్డి నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారని తెలిపారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

రుద్రవరం: మండలంలోని లింగమయ్యస్వామి దేవాలయం సమీపంలో పంట పొలాల్లో మంగళవారం పేకాట స్థావరాలపై ఎస్ఐ హనుమంతయ్య ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడిలో అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన గొల్ల రాజు, కోవెలకుంట్ల మండలం వెలగటూరు మండలానికి చెందిన నారబోయిన బాలమద్ది, నరసాపురం గ్రామానికి చెందిన ఎర్రగుడిదిన్నె కేశాలు, ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామానికి చెందిన కంచర్ల వెంకటసుబ్బయ్య, బాచేపల్లెకు చెందిన దార రాముడు, ముల్లా మాబాషాలను అరెస్టు చేసినట్లు ఎస్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,075 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఇద్దరు మహిళలపై కేసు

ఉయ్యాలవాడ: మండలంలోని కాకరవాడ గ్రామానికి చెందిన దుబ్బ శినావతమ్మ, నాగిరెడ్డి శేషమ్మ అనే ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. అదే గ్రామానికి చెందిన మక్కెర రుణుకాదేవి అనే మహిళ తనపై దాడి చేశారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇల్లు నిర్మించుకుంటున్నామని, అయితే స్థలం విషయంలో అనవసరంగా ఘర్షణకు దిగి దాడి తనపై చేశారని ఆమె ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అయితే అడ్డుకోబోయిన తమ కూలీలపై కూడా ఆ మహిళలు రాళ్లతో దాడి చేసినట్లు ఫిర్యాదు చేశారని తెలిపారు.

బినామీ పేర్లు తొలగించాలని వినతి

ఉయ్యాలవాడ: ఎన్టీఆర్ గృహ నిర్మాణాల కింద ఇంజేడు గ్రామానికి మంజూరైన 21 గృహాల్లో బినామీ పేర్లు ఉన్నాయని, వాటిని తొలగించాలని గ్రామ ఉప సర్పంచ్ విశ్వనాథ్‌రెడ్డి, గ్రామస్థులు మంగళవారం గృహ నిర్మాణశాఖ డీఈ సుబ్బారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గ్రామానికి కేటాయించిన 21 గృహాల్లో బినామిలు, ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ముగ్గురు వ్యక్తులకు గృహాలు మంజూరయ్యాని డీఈకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాజకీయ నాయకుల అండదండలతో ఒకే వర్గానికి చెందిన వారికి గృహాలు మంజూరయ్యాయని వారు ఆరోపించారు. అనర్హులను తొలగించి పేదలకు గృహాలు మంజూరు చేయాలని కోరారు. డీఈ సుబ్బారెడ్డి మాట్లాడుతూ గృహాల కేటాయింపుల్లో తమ ప్రమేయం లేదని, గ్రామాల్లో ఉన్న జన్మభూమి కమిటీల ఆధారంగానే గృహాలు మంజూరు చేశామని తెలిపారు. మంజూరైన గృహాల్లో అనర్హులు, బినామిలు ఉన్నట్లైతే అలాంటి వాటిని గుర్తించి తొలగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రతాపరెడ్డి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

'పంట నష్టపరిహారానికి దరఖాస్తు చేసుకోండి'

దొర్నిపాడు: రైతులు 2015-16 సంవత్సరానికి గాను పంట నష్ట పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి కల్యాణ్‌కుమార్ సూచించారు. పరిహారం అందని రైతులు తమ బాండు, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ నెంబర్ అందజేస్తే వారి అకౌంట్‌లో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది:

భాగ్యనగరం, కొండాపురం గ్రామాల్లో సర్పంచ్ జహరాబీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో కల్యాణ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు స్ప్రింక్లర్ల ద్వారా తమ పొలాల్లో పంటలకు నీరు పెట్టుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.51 కోట్లతో టీజీపీ లైనింగ్, రోడ్డు పనులు: డీఈ

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు, భైరవగుండాల సమీపంలో దెబ్బతిన్న టీజీపీ లైనింగ్ పనులు చేపట్టినట్లు డీఈ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలుగుగంగ ప్రధాన కాలువ 85 కి.మీ. నుంచి 94 కి.మీ. మధ్య దెబ్బతిన్న లైనింగ్ మరమ్మతుల కోసం రూ.25 లక్షలు నిధులు మంజూరయ్యాయని, ఆ నిధులతో లైనింగ్ పనులు చేస్తున్నామని తెలిపారు. 6 పనులు కాలువ వెంట చేస్తున్నామని అన్నారు. కాలువ సైడు గోడలు దెబ్బతినటంతో వాటికి సిమెంట్‌తో మరమ్మతులు చేసి సైడ్‌వాల్ నిర్మిస్తున్నామని తెలిపారు. చిన్నవంగలి నుంచి రేకుల బ్రిడ్జి వరకు 5.50 కి.మీ. వరకు రూ.90 లక్షలతో మెటల్‌రోడ్డు, చింతల చెరువు నుంచి భైరవగుండాల వరకు 3.50 కి.మీ. వరకు రోడ్డు వేయడానికి రూ.36 లక్షలు నిధులు మంజూరయ్యాయని డీఈ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఆయిల్ చోరీ

చాగలమర్రి: మండలంలోని పెద్దబోదనం కాశీరెడ్డినాయన ఆశ్రమ సమీపంలో పొలాల్లో ఏర్పాటు చేసిన రెండు ట్రాన్స్‌ఫార్మర్ల ఆయిల్ మంగళవారం చోరీకి గురైనట్లు విద్యుత్ ఏఈ మద్దిలేటి తెలిపారు. నరసింహుడు, ఇమాంవలి పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల పైకప్పు పగలగొట్టి లోపల ఉన్న రూ.30 వేలు విలువ చేసే ఆయిల్ చోరీకి గురైందని, పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు.

'బడి బయట పిల్లలను బడిలో చేర్పించండి'

రుద్రవరం: బడి బయట పిల్లలు బడిలో చేర్పించి వారి బంగారు భవిషత్తుకు బాట వేయాలని క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ రహంతుల్లా పిలుపునిచ్చారు. సుగాలి తండాకు చెందిన అశోక్‌నాయక్, హరినగరానికి చెందిన సుబ్బమ్మను మంగళవారం హరినగరం పాఠశాలలో 3వ తరగతిలో చేర్పించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సమస్యల పరిష్కారానికి కృషి

సద్గుణబాయి, ఎంపీడీవో



శిరివెళ్ల: మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎంపీడీవో సద్గుణబాయి తెలిపారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. పల్లెపిలుపు కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ శాఖల పనితీరును పర్యవేక్షించామని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆమె చెప్పిన మరిన్ని వివరాలు..

ప్ర: పల్లెపిలుపు ద్వారా ఎన్ని అర్జీలు వచ్చాయి?

జ: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి 24 అర్జీలు రాగా, వ్యక్తిగతంగా 64 మంది అర్జీలు ఇచ్చారు.

ప్ర: రుబెల్లా వ్యాక్సిన్‌పై అవగాహన కల్పిస్తున్నారా?

జ: కల్పిస్తున్నాం.

ప్ర: కార్పొరేషన్ రుణాలకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

జ: బీసీ, ముస్లిం మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలను పొందేందుకు 2,150 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ప్ర: పంచాయతీ కార్యదర్శుల కొరత ఉందా?

జ: మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు గాను 8 మంది కార్యదర్శులు పని చేస్తున్నారు.

ప్ర: సాక్షరభారత్ కేంద్రాల నిర్వహణ ఎలా ఉంది?

జ: ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలిస్తున్నాం.

ప్ర: మరుగుదొడ్ల నిర్మాణంపై అవగాహన కల్పిస్తున్నారా?

జ: వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకునేందుకు ప్రోత్సహిస్తున్నాం.

ప్ర: పింఛన్ల పంపిణీ సక్రమంగా జరుగుతోందా?

జ: సక్రమంగా పంపిణీ చేస్తున్నాం.

ప్ర: అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు చేస్తున్నారా?

జ: చేస్తున్నాం. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు.

మన పట్టణంలో..

సినిమాలు

ప్రతాప్:	గౌతమ్‌నంద
భవాని:	ఫిదా
శ్రీరామ మినీ:	వైశాఖం
ఏవీ:	వాసుకి
రామలక్ష్మి:	బహుబలి-2

మార్కెట్ ధరలు

కూరగాయలు	కిలో(రూ.లలో)
టమోట	50
వంకాయలు	30
బంగాళాదుంప	25
మట్టికాయలు	40
బీన్స్	50
కాకరకాయలు	40
క్యాలిఫ్లవర్	30
బెండకాయలు	30
క్యారెట్	30
క్యాబేజీ	40
ముల్లంగి	30
బీరకాయలు	40
దొండకాయలు	30
బీట్రూట్	40
పచ్చిమిర్చి	60
ఉల్లిగడ్డలు	20
చిక్కుడు కాయలు	40
అల్లం	80

రూపనగుడిలో ఉచిత కంటి వైద్య శిబిరం

ఉయ్యాలవాడ: మండలంలోని రూపనగుడి గ్రామంలో 145 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించామని శాంతిరామ్ మెడికల్ వైద్యశాల వైద్యుడు విక్రమ్ తెలిపారు. స్థానిక పాఠశాల వద్ద మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 మందికి కంటి శుక్లలోపం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వీరికి ఉచితంగా నంద్యాల శాంతిరామ్ వైద్యశాలలో కంటి ఆపరేషన్లు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యుడు సురేష్, పీఎంవో ప్రభావతి, క్యాంపు ఆర్గనైజర్లు హరి, సుబ్రహ్మణ్యం, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రింటర్, ఇన్వర్టర్ అందజేత

శిరివెళ్ల: మండలంలోని యర్రగుంట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులను కల్పించేందుకు ఉపాధ్యాయులు తమ వంతు చేయూతనందించారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులంతా కలిసి రూ.26 వేలు విలువ చేసే ప్రింటర్, విద్యుత్ ఇన్వర్టర్, బ్యాటరీలను ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్‌రెడ్డికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థుల ప్రయోజనార్థం ఉపాధ్యాయులు వస్తువులను వితరణగా అందజేయటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం రఘురామిరెడ్డి, పీడీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, క్రిష్టారెడ్డి, సీతారామ, సరోజ, నాగమణి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రింటర్, ఇన్వర్టర్‌ను అందజేస్తున్న ఉపాధ్యాయులు

డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ

ఆళ్లగడ్డ: నంద్యాల ఉప ఎన్నిక దృష్ట్యా ఆళ్లగడ్డ పోలీసు సబ్ డివిజన్‌లో ఎస్పీ గోపినాథ్‌జెట్టి వివరాలు ఆరా తీశారు. మంగళవారం రాత్రి డీఎస్పీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నంద్యాల ఉప ఎన్నిక దృష్ట్యా ఆళ్లగడ్డలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ చక్రవర్తిని ఆదేశించారు. సబ్‌డివిజన్‌లో శాంతిభద్రతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన సూచించారు.

ఎమ్మార్ వ్యాక్సిన్‌తో వ్యాధులు దూరం

● తప్పనిసరిగా వేయించాలి ● టీకాలు వేసిన వైద్యులు, సిబ్బంది



రుద్రవరంలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్యురాలు



దొర్నిపాడులో..



యర్రగుంట్లలో విద్యార్థికి వ్యాక్సిన్ వైద్యాధికారి ప్రసన్నలక్ష్మి



ఉయ్యాలవాడలో..



ఉయ్యాలవాడలో టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ఆళ్లగడ్డ: వ్యాధుల నివారణకు ఎమ్మార్ వ్యాక్సిన్ వరమని వైద్యురాలు సుజాత అన్నారు. పట్టణంలోని కేపీజీ పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది ఎమ్మార్‌వ్యాక్సిన్ వేశారు. ఈ వ్యాక్సిన్ వేయించటం వల్ల రుబెల్లా, తట్టు వంటి వ్యాధులు దూరమవుతాయన్నారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లోనివైద్య సిబ్బంది పిల్లల సంఖ్యను గుర్తించి వారికి వ్యాక్సిన్ వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జనార్దన్ పాల్గొన్నారు.

శిరివెళ్లలో..

ఎమ్మార్ వ్యాక్సిన్‌తో రుబెల్లా, తట్టు వ్యాధులు సోకకుండా నివారించుకోవచ్చని యర్రగుంట్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ప్రసన్నలక్ష్మి అన్నారు. యర్రగుంట్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం వ్యాక్సిన్‌ను వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సద్దాంహుసేన్, స్వామి వివేకానంద చారిటబుల్‌ట్రస్ట్ ప్రతినిధి కృష్ణారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం రవీంద్రనాథ్‌రెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం రఘురామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడులో..

ఒక టీకాతో రెండు వ్యాధులను నివారించుకోవచ్చని వైద్యాధికారి రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పిల్లలకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. ఈనెల 13 వరకు టీకాలను వేయనున్నట్లు తెలిపారు. దొర్నిపాడు గ్రామంలోని కోటాలోని రెగ్యులర్, ఎస్సీ కాలనీలోని స్పెషల్ పాఠశాల, అంగన్‌వాడీ 1, 4 కేంద్రాల్లోని చిన్నారులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎంఈవో మనోహర్ రెడ్డి, సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, ఓబులేసు, ప్రధానోపాధ్యాయుడు జోసఫ్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడలో..

ఎమ్మార్ వ్యాక్సిన్‌తో వ్యాధులు మిజిల్స్, రుబెల్లా వ్యాధులు దూరమవుతాయని వైద్యాధికారి భారతి అన్నారు. ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. మాయలూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యాక్సిన్ వేశామని వైద్యుడు బాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేష్‌కుమార్, ఈవోపీఆర్డీ పాపారాయుడు, ఎంఈవో రఘురామిరెడ్డి, ప్రిన్సిపాల్ దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరంలో..

మండలంలోని పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ఎమ్మార్ వ్యాక్సిన్ వేసినట్లు వైద్యురాలు తులసీరాణి తెలిపారు.

టీకాలు వద్దేవద్దు:

రుద్రవరం గ్రామంలోని సాయిజ్యోతి ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు వ్యాక్సిన్ వేయటానికి వెళ్లిన వైద్య సిబ్బందిని వ్యాక్సిన్ వేయవద్దని పాఠశాల నిర్వాహకుడు చెప్పారు. దీంతో వైద్యశాఖ అధికారులు ఎంఈవో హుసేన్ సాహెబ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈవో పాఠశాలకు చేరుకొని విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్ టీకాలు వేయించేలా చర్యలు తీసుకున్నారు.

చాగలమర్రిలో..

మండల కేంద్రంలోని సంతమార్కెట్ పాఠశాలలో ఎమ్మార్‌వ్యాక్సిన్ కార్యక్రమాన్ని మంగళవారం ఎంఈవో అనూరాధ, వైద్యుడు మల్లికార్జున్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాక్సిన్ వేశారు. వారు మాట్లాడుతూ చిన్నారులకు తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమాదేవి, సూపర్‌వైజర్లు రామలింగారెడ్డి, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

‘తల్లిపాలు అమృతం లాంటివి’

దొర్నిపాడు: తల్లిపాలు పసిపిల్లలకు అమృతంలాంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాలమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని దొర్నిపాడు 2, 3, 5 సెంటర్ల నందు సూపర్‌వైజర్ సాలమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు అందించాలని సూచించారు. ఆరు నెలల వరకు చిన్నారులకు తల్లిపాలు తాపించటం వల్ల తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. వారోత్సవాలను ఈనెల 7 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీదేవి, వెంకటసుబ్బమ్మ, మంజుల, ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు

ఆళ్లగడ్డలో..

పుట్టిన పిల్లలకు గంటలోపు ముర్రుపాలు తాపించాలని పట్టణంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ బాల తిమ్మమ్మ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం వారి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘45.5 మి.మీ. వర్షపాతం’

ఉయ్యాలవాడ: మండలంలోని పలు గ్రామాల్లో 45.5 మి.మీ. వర్షపాతం నమోదైందని తహసీల్దార్ మోజస్ ప్రసన్ తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పత్తి, మినుము, కంది తదితర పంటల సాగు చేసిన రైతులు హర్షం వ్యక్తం చేశారు.

‘3,850 మందికి భూసార పత్రాలు’

చాగలమర్రి: మండలంలోని 3,850 మంది రైతులకు చంద్రన్న భూసార పరీక్ష పత్రాలను పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి చెన్నయ్య తెలిపారు. ఏఈవోలు ఇంటింటికి వెళ్లి రైతులకు ఈ పత్రాలను అందజేస్తున్నారని అన్నారు. చాగలమర్రిలో 358 మంది రైతులకు పంపిణీ చేశామని తెలిపారు. ఈ పత్రాలు ఉన్న రైతులకు ఉచితంగా భూసార రసాయనాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు నరసింహ, శైలజ పాల్గొన్నారు. చింతలచెరువు గ్రామంలో రైతు పుల్లారెడ్డి సాగు చేసిన కందిపంటను ఏఈవో నరసింహారావు, ఎంపీవోలు సుప్రజ, శైలజ పరిశీలించారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు



చాగలమర్రిలో చౌడేశ్వరీదేవికి పూజలు



రుద్రవరంలో జెండాలతో గ్రామోత్సవం

రుద్రవరం: మండలంలోని డి.కొట్టాల గ్రామంలో మంగళవారం వర్షం కోసం గ్రామస్థులు గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామ సమీపంలోని చెరువు గట్టుకు చేరుకొని గంగమ్మకు మహిళలు బోనాలు సమర్పించారు. గంగమ్మ విగ్రహానికి జలాభిషేకం చేశారు.

హుసేనయ్యస్వామికి పూజలు

వర్షం కురిపించాలని నల్లమల అడవిలో వెలసిన గుమ్మకొండ హుసేనయ్యస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రవరం గ్రామస్థులు జెండాలను ట్రాక్టర్‌పై గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటింటి వద్ద జెండాలకు ఫాతెహాలు చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

శిరివెళ్లలో..

మండలంలోని జీనెపల్లె గ్రామంలో గ్రామస్థులు వర్షం కోసం మారెమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పొలిమేర వద్ద నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు సకాలంలో పుష్కలంగా కురిసి పంటలు పండాలని కోరారు.



జీనెపల్లి పొలిమేర గ్రామస్థుల పూజలు

చాగలమర్రిలో..

మండల కేంద్రంలోని చిన్నమకానం వీధిలో వెలసిన చౌడేశ్వరీదేవికి వర్షం కోసం మహిళలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వరుణదేవుడు కరుణించి వర్షం కురవాలంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

వైద్యశాలకు మంచం విరాళం

శిరివెళ్ల: యర్రగుంట్లలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల ప్రయోజనార్థం దాతలు కృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, సుకుమార్ ఇనుప మంచాన్ని వైద్యాధికారి ప్రసన్నలక్ష్మికి మంగళవారం అందజేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు ప్రసవం సమయంలో సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా యర్రగుంట్ల ఆరోగ్య కేంద్రంలోని ప్రసవాలను చేస్తున్నట్లు ఆమె తెలిపారు.



దాతలు అందజేసిన మంచం

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 2, 5



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో ప్రోత్సాహకరం. ఉన్నత విద్యా విషయాలు, సమావేశాలు, చర్చల్లో సత్ఫలితాలు సాధిస్తారు. ప్రయాణాలు, వ్యాహారచనలకు అనుకూలం.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగవుతుంది. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. ఇంటి అవసరాలకు సకాలంలో డబ్బు చేతికి అందుతుంది. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.



మిథునరాశి:(మే21-జూన్21): శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. బంధుమిత్రులతో సమావేశాలు ఫలిస్తాయి. ప్రియతముల నుంచి కీలక సమాచారం అందుకుంటారు. సమావేశాల్లో, బృందకార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు.



కర్కాటకరాశి:(జూన్22-జూలై23): విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో సహోద్యోగులు సహకరిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. క్యాటరింగ్, రిటైల్ రంగం, హోటల్, వైద్య రంగాల వారికి ప్రోత్సాహ



సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): పెట్టుబడులు, పొదుపు పథకాలు లాభిస్తాయి. విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. సృజనాత్మక రంగాల వారికి ప్రోత్సాహకరం. చిన్నారుల విషయంలో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం. బదిలీలు, మార్పులకు సంబంధించి ముఖ్య సమాచారం అందుకుంటారు. సంస్మరణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సాంత్వన కలిగిస్తాయి.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో అదనపు ఆదాయం అందుకుంటారు. పెట్టుబడులు, పొదుపు పథకాల విషయంలో పెద్దల నుంచి మంచి సలహాలు లభిస్తాయి.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): అంచనాలు ఫలించడంతో మనసు ఉల్లాసంగా ఉంటుంది. కొత్త పనులు ప్రారంభిస్తాయి. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల కోసం నిధుల సేకరణకు ప్రయత్నిస్తారు. ప్రయాణాలు, సమావేశాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు. సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు. పెట్టుబడులు ప్రోత్సాహకరం. బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. భాగస్వామి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది.



మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి. ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

మాతృభూమికి కళార్చన ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

నంద్యాల (కల్చరల్): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో నంద్యాల లయన్స్‌క్లబ్, రోటరీ క్లబ్, సేవా ప్రగతి లయన్స్ క్లబ్, ఐఎంఏ నంద్యాల కేబుల్ టీవీ సంయుక్త నిర్వహణలో మంగళవారం వివేకానంద ఆడిటోరియంలో మాతృభూమికి కళార్చన-రాయలసీమ స్థాయి విద్యార్థి సాంస్కృతిక ఉత్సవాలు కళారాధన అధ్యక్షుడు డాక్టర్ మధుసూదన్‌రావు ప్రారంభించారు. నంద్యాల కళారాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేష్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు హరినాథ్, లయన్స్ క్లబ్ సేవా ప్రగతి అధ్యక్షుడు శ్రీకాంత్, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్, లయన్స్ క్లబ్ కోశాధికారి సందీప్, కార్యనిర్వాహక కార్య దర్శులు శ్రీకాంత్, రవిప్రకాష్, ప్రసాద్, రంగనాథ్, నాగేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ బాలల్లో దేశభక్తి భావాలు పెంపొందించడానికి, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను ప్రోత్సహించడానికి ఈ ఉత్సవాలు ఉపయోగపడతాయన్నారు. మొదటి రోజు దేశ భక్తి ప్రబోధిత లఘుచిత్రాల విశ్లేషణ, చిత్రపట విశ్లేషణలో భాగంగా చిత్ర పటాన్ని చూసి విశ్లేషణ వ్యాసాలు రాశారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఎంఆర్ గోవిందరెడ్డి పోటీలను సందర్శించి నిర్వాహకులను అభినందించారు.

రాఘవుడి హుండీ ఆదాయం రూ. 1.14 కోట్లు



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

మంత్రాలయం: మంత్రాలయం రాఘవేంద్రస్వామి హుండీలో జూలై నెలకు రూ. 1.14కోట్ల ఆదాయం వచ్చిందని మఠం మేనేజరు శ్రీనివాసరావు తెలిపారు. రూ. 1,14,83,429 నగదు, 36 గ్రాముల బంగారం, 360 గ్రాముల వెండి, 2016 విదేశీ డాలర్లు, కానుకలను భక్తులు హుండీలో వే శారని చెప్పారు. హుండీ లెక్కింపులో మఠం సిబ్బంది దత్తు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అంబేద్కర్ రీజనల్ సెంటర్‌లో సీబీసీఎస్ అమలు

కర్నూలు(రూరల్): సిల్వర్ జూబ్లీ కళాశాలలోని అంబేద్కర్ రీజనల్ సెంటర్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో నూతనంగా సీబీసీఎస్(చాయిస్ బేస్‌డ్ క్రెడిట్ సిస్టం) సిలబస్ ప్రవేశ పెడుతున్నట్లు కేంద్ర సహాయ సంచాలకుడు డాక్టర్ ఎం.అజంతకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశానికి ఏపీ ఆన్‌లైన్‌లో ఈనెల 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సెమిస్టర్ విధానం కూడా ఈ సంవత్సరం నుంచి అమలవుతుందని పేర్కొన్నారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ ధరలు

సరుకు	వచ్చినది(క్వింటాళ్లు)	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
వేరుశనగ	71	2998	5140
వాము	586	3020	9342
ఉల్లి	398	420	2130
కందులు	36	3319	3723

ఆదోని వ్యవసాయ మార్కెట్ ధరలు

సరుకు	వచ్చినది(క్వింటాళ్లు)	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
పత్తి	1252	3131	5759
వేరుశనగ	19	3810	4629
ఆముదం	5	3833	3850

ఎంఆర్ వ్యాక్సిన్ పిల్లలందరికీ వేయించాలి

టీకా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్



వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ సత్యనారాయణ, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ నరసింహులు

కర్నూలు(హాస్పిటల్): తట్టు, మీజిల్స్ వ్యాధుల నివారణకు పిల్లల తల్లిదండ్రులంతా వ్యాక్సిన్ తప్పక వేయించాలని కలెక్టర్ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎ.క్యాంప్ లోని ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 10.35 లక్షల మంది పిల్లలకు వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. గతంలో ప్రైవేటు క్లినిక్‌లలో ఈ వ్యాక్సిన్ వేసేవారని, ప్రస్తుతం ప్రభుత్వమే ఉచితంగా వేయాలని నిర్ణయం తీసుకుందని చెప్పారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వై. నరసింహులు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కమ్యూనిటీ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వ్యాక్సిన్ వేస్తారని చెప్పారు. ఇంతకుముందు వేయించినా కూడా మళ్లీ వేయించాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, నోడల్ ఆఫీసర్ శ్రీదేవి, కర్నూలు ఆర్డీవో హుసేన్‌సాహెబ్, పీవోడీటీటీ సరస్వతి, డీఈవో తాహేరా సుల్తానా, డీఎంవో దేవీద్‌రాజు పాల్గొన్నారు.

1.10 లక్షల మంది పిల్లలకు టీకాలు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో 1,10, 528 మంది పిల్లలకు మొదటిరోజు వ్యాక్సిన్ వేసినట్లు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. జిల్లాలో మొత్తం 10,54,332 లక్షల మంది పిల్లలు ఉన్నారని ఆయన చెప్పారు.

కొనసాగుతున్న ఉపాధ్యాయ బదిలీల కౌన్సెలింగ్



డీఈవోకు ఆప్షన్ పత్రాన్ని అందజేస్తున్న స్పెషల్ టీచర్

కర్నూలు(ఎడ్యుకేషన్): ఉపాధ్యాయులకు గత కొన్ని రోజులుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. మంగళవారం ఎస్‌జీటీలకు 1501 నుంచి 2500 వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇం దులో 32 మంది స్పెషలిస్ట్ ఉపాధ్యాయులు బదిలీ ఆప్షన్లు ఇచ్చుకున్నారు. బుధవారం 2501 నుంచి 3506 వరకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని డీఈవో తాహేరా సుల్తా నా కోరారు.

ఎన్నికల కోడ్

బదిలీ అయిన ఉపాధ్యాయులు తాము ఎంచుకున్న పాఠశాలకు వెళ్లేందుకు ఎన్నికల కోడ్ అడ్డు వచ్చింది. నంద్యాల నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో కర్నూలు జిల్లా మినహా మిగతా జిల్లాల్లో బదిలీ అయిన ఉపాధ్యాయులు విధుల్లో చేరాలని విద్యా కమిషనర్ సంధ్యారాణి నుంచి ఆదేశాలు అందాయి.

కర్నూలు సినిమాగైడ్

ఆనంద్ సినీ కాంప్లెక్స్: గౌతమ్‌నంద, ఫిదా, ముబారకన్, మున్నా మైకెల్, బాహుబలి-2, డీజే దువ్వాడ జగన్నాథం, **శ్రీరామ:** దండుపాళెం 2 **రాజ్:** గౌతమ్‌నంద, **వెంకటేష్ కాంప్లెక్స్:** శమంతకమణి, నిన్నుకోరి, పటేల్ సర్, **భరత్ కాంప్లెక్స్:** ముబారకన్, మున్నామైకెల్, వాసుకి **విక్టరీ:** వైరస్

సూక్తి

లక్ష్య సాధనలో ఎన్నిసార్లు ఓడినా సరే.. మరోసారి ప్రయత్నించు.


© EPA

వావ్.. చార్లెస్ వంతెన



స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వతాల్లో పచ్చదనం పరుచుకున్న అందాలతో, ప్రకృతి శోభతో అలరారే రెండు కొండ ప్రాంత గ్రామాలే.. జెర్మట్, గ్రెచెన్. వాటి మధ్యలో లోతైన గ్రాబెంగూఫర్ లోయ. గ్రెచెన్ నుంచి జెర్మట్‌కు చేరుకోవాలంటే ఆ లోయతో పాటు, చిన్న చిన్న కొండలూ ఎక్కి దిగాల్సిందే. మొత్తంగా మూడు గంటల సమయం పడుతుంది. అక్కడి ప్రజలకు ఇప్పుడు ఆ సమస్య తీరిపోయింది. కేవలం పది నిముషాల్లోనే ఇరు గ్రామాలకు చకచకా వెళ్లిపోవచ్చు. ఎలానో తెలుసా? ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెన అక్కడ ప్రారంభించారు.

ఆల్ప్‌పర్వతాల్లోని రెండు కొండల మధ్య ఓ పొడవాటి వంతెన నిర్మించారు. దాని పేరు "చార్లెస్ కువోనెన్'. గాలికి ఊగుతూ, తూగుతూ ఉండే ఆ వంతెనను చూస్తుంటే.. కొందరికి కొండల మధ్య వెండి ఊయల్లా తోస్తుంది. ఇంకొందరికి నడిచే రోలర్ కోస్టర్‌లా కనిపిస్తుంది. ఇది సస్పెన్షన్ మోడల్ బ్రిడ్జి. వంతెనపై నడుస్తుంటే కాస్త ఊగుతూ ఉంటుంది.

జూలై 29న ప్రారంభమైన ఈ వంతేన ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనగా రికార్డుల్లోకి ఎక్కింది. దీని పొడవు 494 మీటర్లు.

ఈ వంతెన భూ ఉపరితలానికి 85 మీటర్ల ఎత్తులో ఉంది.

ఇప్పటివరకు జర్మనీలోని 'టైటాన్-ఆర్‌టీ' వంతెనను అతి పొడవైనదిగా పేర్కొనేవారు.

ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనల్లో రష్యాలోని 'స్కైపార్క్ బ్రిడ్జ్' మూడో స్థానంలో ఉంది. 2016 సోచి ఒలింపిక్స్ సందర్భంగా దీన్ని నిర్మించారు.

ఎత్తయిన ప్రదేశాలను చూసి భయపడేవారు, 'చార్లెస్ కువోనెన్' వంతెన దాటాలంటే కళ్లు మూసుకోవాల్సిందేనని జెర్మట్ ట్రావెల్ బోర్డు ప్రతినిధి అంటున్నారు.

రోడ్డు మార్గంలో వంతెన కట్టాలంటేనే ఓ నెల రోజుల సమయం పడుతుంది. కానీ రెండు కొండల మధ్యలో నిర్మించిన ఈ బ్రిడ్జిని కేవలం 10 వారాల్లోనే పూర్తి చేయడం విశేషం.

నవ్వుల్ నవ్వుల్

రాహుల్ : కుట్టేముందు దోమలు ఎందుకు శబ్దం చేస్తాయి?

రోహిత్ : దాడి చేయబోతున్నాను అని వర్తమానం ఇవ్వడం యుద్ధనీతిలో భాగం.

దారి కనుక్కోండి




చుక్కలు కలపండి




చెప్ప గలరా?

జాలిలో ఉన్నా కానీ గాలిలో లేను
బిరుదులో ఉన్నా కానీ అరుదులో లేను
లిపిలో ఉన్నా కానీ తాపిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

రంగులు వేయండి



బొమ్మ గీయండి



టంగ్ ట్విస్టర్స్

1. I would if I could, and if I couldn't, how could I?You couldn't, unless you could, could you?
2. The crow flew over the river with a lump of raw liver.
3. National Sheepshire Sheep Association

ఒకే అక్షరం


1. TOTAL	మొ	
2. BUD	మొ	
3. PLANT	మొ	

ఔనా!



వందలో డెబ్బై శాతం మంది 'హైపనిక్ జెర్క్' ఎదుర్కొన్నవారే. ఇదేదో కొత్త వ్యాధి అని అనుకుంటున్నారా? అదేం కాదు. మాంచి నిద్రలో ఉన్నప్పుడు ఎక్కడ నుంచో కింద పడుతున్నట్లు అనిపించి చటుక్కున మెలకువ వస్తుంది. అదే 'హైపనిక్ జెర్క్'.

మీకుతెలుసా?



మీకు చెట్లతో కూడిన అరణ్యాలే తెలుసు.. మరి శిలలతో ఉన్న అడవి తెలుసా? చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో ఉన్న పొడవైన శిలల సముదాయాన్నే 'స్టోన్ ఫారెస్ట్' అని పిలుస్తారు.

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. ఐత్యంకమ ▸ ....
2. సందనపా ▸ ....
3. పిగూడుట్ట ▸ ....

- పత్తిపాక అంకిత, కోరుట్ల

జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. IRAN ▸ ....
2. IDWE ▸ ....
3. DMBU ▸ ....

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

జవాబులు

ఒకే అక్షరం : 1. మొత్తం 2. మొగ్గ 3. మొక్క
చెప్పగలరా? : జాబిలి
జంతర్‌మంతర్ : 1. ఐకమత్యం 2. సంపాదన 3. పిట్టగూడు
జంబ్లింగ్ వర్డ్స్ : 1.RAIN 2.WIDE 3.DUMB

అయ్యో.. ఒకటో తారీఖు!

- తొలిరోజు వ్యతిరేక ఫలితాలు
- సాంకేతిక ఇబ్బందులు
- అధికారుల నిర్లక్ష్యాలు
- నిరాశ పరిచిన పథకాల అమలు

ఆగస్టు ఒకటో తారీఖు. పెరిగిన రిజిస్ట్రేషన్ చార్జీలు అమలయ్యే రోజు. మధ్యాహ్న భోజనం రుచికరంగా మారాల్సిన రోజు. నగదు తీసుకుని రేషన్ బియ్యం ఇవ్వాల్సిన రోజు. సరుకుల రవాణాకు ఆన్‌లైన్ వే బిల్లులు తీసుకోవాల్సిన రోజు. ఇవన్నీ ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించింది. కానీ తొలిరోజే నీరుగార్చారు. నిరాశపరిచారు. ఆ వివరాలు..

భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్లు

కర్నూలు(కార్పొరేషన్): పెంచిన రిజిస్ట్రేషన్ ఫీజులు అమలులోకి రావడంతో జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు మంగళవారం వెలవెలబోయాయి. ఫీజుల పెంపుకారణంగా భూములు, భవనాలు, అపార్టుమెంట్ లాంటి స్థిరాస్తులు రిజిస్ట్రేషన్‌కు చాలామంది ముందుకు రాలేదు. దీంతో అధికారులు పిచ్చాపాటి మాట్లాడుకుంటూ కాలం గడిపారు. జిల్లా వ్యాప్తంగా ఆయకం రిజిస్ట్రేషన్లు, రద్దు దస్తావేజులు లాంటి చిన్నా చితకా రిజిస్ట్రేషన్‌లు మాత్రమే జరిగినట్లు జిల్లా కేంద్రానికి సమాచారం అందింది. స్థిరాస్తి విలువలు 10 నుంచి 25 శాతం మేర పెంచుతున్నట్లు 10 రోజుల క్రితం ప్రకటనలు వెలువడటంతో సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు కిక్కిరిసిపోయాయి. క్రయ విక్రయదారులు ఎగబడి పాత ఫీజులతో ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీంతో వారం రోజులు ఊపిరి సలుపనంత పనిచేసిన సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బంది మంగళవారం రద్దీలేక సేదదీరారు. కొన్ని సబ్‌రిజిస్ట్రారు కార్యాలయాల్లో సోమవారం రిజిస్ట్రేషన్ చేయించుకోలేని ఒకరిద్దరు మాత్రం మంగళవారం రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు సమాచారం. కర్నూలు సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో సోమవారం ఒక్కరోజే 120 రిజిస్ట్రేషన్లు జరిగాయి. మంగళవారం 10 మాత్రమే జరిగాయి. కల్లూరు సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో సోమవారం భారీగా 260, మంగళవారం 9 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు అధికారులు తెలిపారు. సాధారణ రోజుల్లో కర్నూలు, కల్లూరు సబ్‌రిజిస్ట్రారు కార్యాలయాల్లో రోజుకు 50 నుంచి 60 రిజిస్ట్రేషన్లు జరిగేవని, ఫీజుల పెంపు కారణంగా రిజిస్ట్రేషన్లు భారీగా తగ్గాయని సబ్ రిజిస్ట్రార్లు మహబూబ్‌బాషా, రమణరావు తెలిపారు.



వెలవెలబోతున్న జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

సర్వర్ మొరాయించింది..

● తొలిరోజు అందని బియ్యం

కర్నూలు(కలెక్టరేట్): చౌకదుకాణాల్లో నగదు రహితం తప్పనిసరి కాదని, నగదు చెల్లించి కూడా సరుకులు తీసుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ఊరట చెందిన కార్డుదారులు మంగళవారం ఉదయాన్నే బియ్యం తీసుకునేందుకు చౌక దుకాణాలు చేరుకున్నారు. అయితే సర్వర్ మొరాయించడంతో జిల్లాలో తొలిరోజు రెండుశాతానికి లోపే పంపిణీ జరిగింది. ఈ పోస్ మిషన్ సర్వర్‌లో వర్షన్ మారడంతో ఇబ్బంది తలెత్తింది. దీంతో నగదుతో బియ్యం తీసుకోవాలని వచ్చిన కార్డుదారులు వెనుదిరిగారు. జిల్లాలో 2423 చౌక దుకాణాలు ఉండగా 1117 దుఖాణాలు మాత్రమే తెరుచుకున్నాయి. మొదటి రోజు 1.76 శాతం మాత్రమే బియ్యం పంపిణీ చేశారు. ఈ పోస్‌మిషన్లు మొరాయిస్తున్న విషయాన్ని డీలర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మిషన్లను తీసుకువచ్చి అప్‌డేట్ చేయించుకోవాలని అధికారులు సూచించారు. దీంతో డీలర్లు ఎన్‌ఐసీ అధికారుల వద్దకు క్యూకట్టారు. సర్వర్ 4.5 వర్షన్ నుంచి 4.6కు మారుస్తున్నారు. మొదటి రోజంతా సర్వర్ వర్షన్ మార్పిడి ప్రక్రియ జరిగింది.

మిషన్ పనిచేయలేదు..

నా బ్యాంకు ఖాతా పని చేయడం లేదు. దీంతో ఐదు నెలలుగా 10వ తేదీ తర్వాత బియ్యం తీసుకునేదాన్ని. ఇంట్లో నలుగురం ఉంటే ఇద్దరికి మాత్రమే బియ్యం ఇస్తున్నారు. ఈ నెల నుంచి ఒకటో తేదీనే నగదు తీసుకుని బియ్యం ఇస్తారంటే వచ్చాం. అయితే మిషన్ రిపేరు వచ్చిందని డీలర్ వెళ్లారు. ఎదురు చూస్తున్నాం.

- మహబూబ్ బీ, బుధవారపేట

వర్షన్ మారుస్తున్నాం..

ఈ నెల నుంచి నగదురహిత విధానం తప్పనిసరి కాదు. ఒకటో తేదీ నుంచే నగదుతోనే బియ్యం పంపిణీ చేస్తున్నాం. సర్వర్ వేగంగా పని చేయడానికి ఎన్‌ఐసీ అధికారులు వర్షన్స్ మారుస్తుంటారు. ప్రస్తుతం ఉన్న 4.5 నుంచి 4.6కు మార్పిడి జరుగుతోంది. మొదటి రోజు 60శాతం మంది డీలర్లు వర్షన్ మార్చుకున్నారు. 2వ తేదీ నుంచి ప్రజాపంపిణీ వేగవంతం అవుతుంది. కార్డుదారులు ఆందోళన చెందాల్సిన పని లేదు.

- వై.సుబ్రహ్మణ్యం, డీఎస్‌వో, కర్నూలు

పాత భోజనమే..

● మధ్యాహ్న భోజనంలో మెనూ మారలేదు



ఆత్మకూరు/ఆలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ ఆగస్టు 1 నుంచి మారాల్సి ఉంది. కానీ చాలా పాఠశాలల్లో పాత మెనూనే పాటించారు. మధ్యాహ్న భోజన పథకంలో ఒక్కో విద్యార్థికి చెల్లించే సొమ్ము ప్రభుత్వం పెంచింది. వారానికి రెండు గుడ్ల స్థానంలో మూడు ఇవ్వాల్సి ఉంది. ఒకో వారం ఒకో రంగు గడ్లు ఇవ్వడం ద్వారా పక్కదారి పట్టకుండా చూడాల్సి ఉంది. జూలై 1 నుంచే ప్రారంభించాల్సి ఉండగా అనేక పాఠశాలల్లో సక్రమంగా జరగలేదు. దీంతో ఆగస్టు 1వ తేదీ నుంచి తప్పనిసరిగా అమలుచేయాలని విద్యాశాఖ ఆదేశించింది. కానీ తొలిరోజు ఆ పరిస్థితి కనిపించలేదు. ఆత్మకూరు జిల్లా పరిషత్ బాలికలల పాఠశాలలో మంగళవారం పాత మెనూ ప్రకారమే ఆహారం తయారు చేశారు. అన్నం, కూరగాయలతో తయారైన పదార్థాల బదులుగా అన్నం, పప్పుచారు వడ్డించారు. సోమ, బుధ, శుక్ర వారాల్లో గుడ్లను అందించాలి. బుధవారం పసుపు రంగుముద్రతో కూడిన గుడ్లను సరఫరా చేయాలి. కానీ మంగళవారం సాయంత్రం వరకు అనేక పాఠశాలలకు గుడ్లు చేరలేదు. ఆలూరు పట్టణంలోని మెయిన్ స్కూల్, మోడల్ స్కూల్‌కు గుడ్లు అందలేదు.

బుధవారానికి సరఫరా చేస్తాం ..



మండలంలో పలు పాఠశాలలకు మంగళవారం పసుపు రంగు ముద్ర ఉన్న గుడ్లను పంపిణీ చేశాం. బుధవారంలోగా అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తాం. ఇకనుంచి వారంలో మూడు సార్లు గుడ్లు ఇవ్వడంతో పాటు మారిన మెనూను సక్రమంగా అమలు చేస్తాం.

- జానకీరామ్, ఎంఈవో, ఆత్మకూరు

జిల్లాకు గుడ్లు చేరుతున్నాయి

ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఎండీఎం ముద్రగల ఐదు రకాల గుడ్లు సరఫరా కావాల్సి ఉంది. కొన్ని మండలాల్లో సరఫరా అయ్యాయి. ప్రభుత్వం నుంచి సరఫరా కావడంలో జాప్యం జరిగింది. జిల్లా అంతటా పూర్తి స్థాయిలో ఈ నెల 8 నుంచి కొత్త మెనూ అమలయ్యేలా చూస్తాం.

- ప్రదీప్, డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్

వే బిల్లులకు షాక్

● రూ.50 వేల సరుకు రవాణాకు నిబంధన ●అమలులోకి తెచ్చిన కేంద్రం

డోన్: రూ.50 వేల విలువదాటిన సరుకు రవాణాకు వే బిల్లులు తీసుకోవాలన్న నిబంధన మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. అయితే ఆన్‌లైన్‌లో వే బిల్లులు తీసుకునేందుకు జిల్లాలో ఇబ్బందులు ఎదురయ్యాయి. డోన్ ప్రాంతంలోని పలువురు వ్యాపారులు ఆన్‌లైన్‌లో వేబిల్లుల కోసం ప్రయత్నించారు. కానీ అందుబాటులోకి రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక జీరో వ్యాపారాన్ని అడ్డుకునేందుకు ఆన్‌లైన్ వే బిల్లుల పద్ధతి ప్రవేశపెట్టారు. ఇదివరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో సరుకు రవాణాకు వేబిల్లులు తీసుకునేవారు. జీఎస్‌టీని అమలు చేసిన కేంద్రం కొత్త నిబంధనలను తీసుకువచ్చింది. ఆగస్టు 1 నుంచి ఈ విధానాన్ని అమలు చేయాలని కేంద్రం ఆదేశించింది. అయితే తొలిరోజు ఆన్‌లైన్ కష్టాలు ఎదురయ్యాయి.

పండిట్లు, పీఈటీలకు
ప్రమోషన్లు ఇవ్వండి

ఆలూరు: పండిట్లు, పీఈటీ అప్‌గ్రేడ్ పోస్టులకు తూర్పుగోదావరి జిల్లా మినహా అన్ని జిల్లాల్లో వెంటనే ప్రమోషన్లు ఇచ్చి తదుపరి బదిలీల రీకౌన్సెలింగ్ చేపట్టాలని మంగళవారం రాత్రి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి ఆర్‌సీ నెం.247ను ఆర్‌జేడీ, డీఈవోలకు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు 144 తేదీ 2-8-2016 ప్రకారం నుంచి అప్‌గ్రేడ్ అయిన 1,450 మంది పండిట్లు, 1200 పీఈటీ పోస్టులకు కొన్ని జిల్లాల్లో ఇప్పటికే పదోన్నతి కల్పించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు, న్యాయపరమైన ఆటంకాలు రావడంతో కొన్ని జిల్లాల్లో ఈ అప్‌గ్రేడ్ పోస్టులకు పదోన్నతి కల్పించలేదు. అప్‌గ్రేడ్ ప్రమో షన్లు ఇవ్వకుండా బదిలీలు జరగడంతో పం డిట్లు, పీఈటీ ఉపాధ్యాయులను భారీ సంఖ్యలో డీఈవో ఆధీనంలో ఉంచారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల వినతి మేరకు పాఠశాల విద్యాశాఖ స్పందించి అప్‌గ్రేడ్ పోస్టులకు వెంటనే పదోన్నతి ఇవ్వాలని నిర్ణ యించింది. జిల్లాలో రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యాక మిగిలిన పీఈటీలకు డీఈవో పరిధిలో పోస్టింగ్‌లు ఇవ్వలేదు. ఈ సమస్యను రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయ సంఘాలు అధి కారుల దృష్టికి తీసుకెళ్లాయి. బదిలీల్లో ఈ అంశం వివిధ జిల్లాల్లో గందరగోళంగా మారింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు వల్ల జిల్లాలో 110 మంది పీఈటీలకు, 34 మంది హిందీ పండిట్లకు తెలుగు పండిట్లకు 102 మందికి పదోన్నతులు రానున్నాయి. ఇందులో పీఈటీలకు ఇదివరలోనే 74 మందికి ప దోన్నతి కల్పించాలి. మిగతా 36 మంది పీ ఈటీలకు పీడీలుగా పదోన్నతి కల్పించాల్సి ఉంది. లాంగ్వేజ్ పండిట్లలో ఇప్పటి వరకు గ్రేడ్2గా ఉన్న వీరిని గ్రేడ్1 పండిట్లుగా గుర్తించి ఈ నెల 5వ తేదీలోగా రీ కౌన్సిలింగ్ జరపాలని డీఈవోలను ఆదేశించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామశేషయ్య, ఎస్టీయూ జిల్లా సహ అధ్యక్షుడు మల్లేష్, ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

బదిలీల రీ కౌన్సెలింగ్‌కు పాఠశాల విద్యాశాఖ తాజా ఆదేశాలు



ఆంధ్రజ్యోతి ఆదోని టౌన్
4
కర్నూలు । బుధవారం 2 ఆగస్టు 2017
ఆదోని | ఆలూరు | హొళగుంద | ఆస్పరి | హాలహర్వి | చిప్పగిరి

'బ్యాంక్ ఖాతాలకు పంట నష్టపరిహారం జమ చేయండి'

ఆస్పరి: పంట నష్టపరిహారాన్ని బ్యాంక్ ఖాతాలకు జమ చేయాలని మండలంలోని బనవనూరు గ్రామ రైతులు వ్యవసాయ అధికారులను కోరారు. మంగళవారం వ్యవసాయ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నాయకుడు సీతారామరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100 మంది రైతులు తమ ఖాతాలు తప్పుగా ఉన్నాయని, సరిచేసి బిల్లు పెట్టేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి మునెమ్మ, ఎస్‌ఐ వెంకటమరణను కోరారు. ఖాతాల తప్పులను సవరించి అర్హులైన రైతులకే పరిహారం అందేలా బిల్లు పెడతామని ఏవో హామీ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

భూ సమస్యలను

పరిష్కరిస్తాం

తహసీల్దార్ సూర్యనారాయణప్రసాద్



ఆలూరు రూరల్: పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తామని ఆలూరు తహసీల్దార్ సూర్యనారాయణప్రసాద్ అన్నారు.

ప్ర: మీ ఇంటికి - మీ భూమి కార్యక్రమానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

జ: 258 దరఖాస్తులు వచ్చాయి. అందులో 1బీ అడంగల్ మార్పులు, సర్వే నెంబర్ల సరవణకు అధికంగా దరఖాస్తులు వచ్చాయి.

ప్ర: మండలంలో రేషన్ కార్డులు ఎన్ని ఉన్నాయి?

జ: మండలంలో 32 రేషన్ దుకాణాలు, రేషన్ కార్డులు 13,420కి పైగాఉన్నాయి.

ప్ర: లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా అందిస్తున్నారా?

జ: లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందిస్తున్నాం.

ప్ర: మీ సేవా ద్వారా వచ్చే దరఖాస్తులను పరిశీలిస్తున్నారా?

జ: మీసేవా ద్వారా వచ్చే దరఖాస్తులను 15 రోజుల్లోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

నిరాశే

ఎండుతున్న పంటలు

ఆందోళనలో అన్నదాతలు

ఆలూరు రూరల్: పంటలు సాగుచేసుకున్న రైతులకు ఈ ఏడాది ఖరీఫ్‌లో నిరాశే మిగిలింది. విత్తనం వేసిన తర్వాత వర్షాలు కురవకపోవడంతో పంటలన్నీ ఎండిపోతున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి సాగు చేసిన పత్తి, వేరుశనగ పంటలు వర్షాలు సకాలంలో కురవకపోవడంతో వాడిపోతున్నాయి. మరోవైపు ఎండలు పెరగడంతో ఎండుముఖం పట్టాయి. దిక్కుతోచని రైతులు, వ్యవసాయ కూలీలు బతుకు తెరువు కోసం గుంటూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు వలస పోతున్నారు. మండలంలో 1500 హెక్టార్లలో పత్తి, 1650 హెక్టార్లలో వేరుశనగ పంటలు సాగు చేశారు. గత రెండు నెలల నుంచి వర్షాలు కురవకపోవడంతో పంటలు వాడిపోతున్నాయి. ఉన్న బోర్లలో నీరు లేక అడుగంటిపోయాయి. వర్షాలు కురవకపోతే తమకు అప్పులే గతి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.




ఎండిపోయిన పత్తి పంటను చూపుతున్న రైతు బలరాముడు



హొళేబీడులో ఎండిపోయిన పత్తి పంట

పొలానికి వెళ్లలేకపోతున్నాం



ఐదెకరాల్లో పత్తి పంట సాగు చేశా. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంట ఎండిపోతుంది. దీంతో పొలానికి వెళ్లలేకపోతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

- సోమప్ప, తుంబళబీడు

వర్షాలు రాకపోతే ఇబ్బందే



పదెకరాల్లో పత్తి పంట వేశా. మరో వారం రోజుల్లో వర్షాలు కురవకపోతే ఇబ్బందులే. ఎకరాకు రూ.10 వేలకు పైగా ఖర్చు పెట్టాను. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి.

- షర్మాస్‌వలి, పెద్దహోతూరు

'గ్యాస్‌పై సబ్సిడీ కొనసాగించాలి'

ఆదోని టౌన్: వంట గ్యాస్ సిలిండర్‌పై ఇస్తున్న సబ్సిడీని కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నీలకంఠప్ప అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉజ్వల యోజన పథకం కింద పేద మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్‌లను అందించిన ప్రభుత్వం సిలిండర్‌పై సబ్సిడీని ఎత్తివేసి ధరను పెంచి కోట్లాది పేద కుటుంబాలపై అదనపు భారం వేయడం సమంజసంకాదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్న అచ్ఛేదిన్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. నోట్ల రద్దు, జీఎస్టీతో సామాన్యులకు, చిరువ్యాపారులకు అనేక కష్టాలు కలిగించిన కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం మహిళల నడ్డి విరచడానికి సిద్ధం అవుతుందని, ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

'ఉద్యానవన పంటలకు ప్రభుత్వం చేయూత'

ఆదోని(అగ్రికల్చర్): ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం చేయూతనందిస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సోమసుందరం, ఉద్యానవన శాఖ అధికారి సాయిస్వేత అన్నారు. మంగళవారం ఢానాపురం గ్రామంలో ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 మంది సభ్యులుగా ఏర్పడిన గ్రూపులకు రూ.50వేల వరకు ఒక్కొక్కరికి రుణాన్ని అందిస్తుందన్నారు. రైతులు పండించిన పంటలకు దళారుల జోక్యం లేకుండా తామే మార్కెటింగ్ సౌలభ్యాన్ని కల్పిస్తామన్నారు. పంటల సాగుకు 75శాతం వరకు రాయితీ కల్పిస్తున్నామని తెలిపారు. పంటల్లో వచ్చే చీడపీడలు, విత్తనశుద్ధి, పంటల మార్పిడి, జిగురు అట్టలు, లింగాకర్షన బుట్టలు, వేప నూనె ప్రాముఖ్యతపై శాస్త్రవేత్త సోమసుందరం రైతులకు వివరించారు.

కాగితరహిత పాలనపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న మున్సిపల్ ఉద్యోగులు

ఆదోని టౌన్: రాబోయే రోజులలో కాగితరహిత పాలన కొనసాగించడానికి ఉద్యోగులందరూ సిద్ధం కావాలని మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో మున్సిపల్ ఉద్యోగుల సిబ్బందికి కాగితరహిత పాలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ఐదు విభాగాలలో 96మంది ఉద్యోగులు పని చేస్తున్నారని, అన్ని విభాగాలకు చెందిన 264 ఫైల్స్ ఉన్నాయని, ప్రతి నెల 50 ఫైళ్ల చొప్పున కంప్యూటరీకరించాలని సూచించారు. ఐదు నెలల్లో అన్ని ఫైళ్లను కంప్యూటరీకరణ పూర్తి చేసి ఆన్‌లైన్‌లోనే పాలన కొనసాగించాల్సి ఉంటుందన్నారు. అందుకు గాను అదనంగా 32 కంప్యూటర్లను తెప్పించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. సదస్సులో మున్సిపల్ మేనేజర్ యువరాజ్, డీఈలు వెంకటరమణ, సత్యనారాయణ, రామమూర్తి, రెవెన్యూ ఆఫీసర్ దీలార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'తాగునీటి సమస్యను పరిష్కరించాలి'



ఎంపీడీవోకు నీటి సమస్య గురించి వివరిస్తున్న మహిళలు

ఆస్పరి: ఆస్పరిలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ మంగళవారం 5, 6వ వార్డుల మహిళలు ఎంపీడీవో కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేశారు. ఖాళీ బిందెలను చేతపట్టుకొని కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎంపీడీవో సలీం బాషాకు నీటి సమస్య తీవ్రతను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గతంలోనే పైపులైన్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని, ఆయా పనులను అడ్డగించడంతో పనులు చేయించలేకపోయామని అన్నారు. నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన కార్యక్రమాన్ని విరమించారు.

రేపు మున్సిపల్ ఉపాధ్యాయుల ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న ఫ్యాప్టో నాయకులు

ఆదోని(అగ్రికల్చర్): దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి గురువారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నట్లు ఫ్యాప్టో నాయకులు నాగరాజు, ప్రహ్లాద, సునీల్‌రాజ్‌కుమార్, రమేష్‌నాయుడు, మల్లికార్జున, పార్థసారధి, లక్ష్మన్న తెలిపారు. మంగళవారం నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో వారు మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ రూల్స్ సవరణ చేయాలని ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులంతా సెలవు పెట్టి మున్సిపల్ కార్యాలయం ముందు తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. స్పందించకపోతే 17న గుంటూరు మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రసాద్, వెంకటరమణ, సుధాకర్, రామయ్య, శ్రీరామ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు విద్యార్థి ఎంపిక

ఆలూరు: జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఆలూరు ప్రగతి జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థి మధు ఎంపికైనట్లు కరస్పాండెంట్ గురునాథ్, హెచ్‌ఎం శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. కర్నూలులో గత నెల 27, 28, 29వ తేదీల్లో అండర్-18 స్థాయి పోటీల్లో ఆంధ్ర జట్టు నుంచి ఆడి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది, పీఈటీ ప్రసాద్‌ను అభినందించారు.



సర్టిఫికెట్లను చూపుతున్న విద్యార్థి మధు

'అర్హులందరికీ పింఛన్లు'



పింఛన్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు శ్రీనివాసాచారి

ఆదోని టౌన్: అర్హులైన వారందరికీ పింఛన్లను పంపిణీ చేస్తామని మండగిరి టీడీపీ నాయకుడు శ్రీనివాసాచారి అన్నారు. మంగళవారం ఆయన మండగిరి ప్రాంతానికి చెందిన 220 మందికి వివిధ పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతికి చెందిన అన్ని సామాజిక వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు ప్రకటించి అమలు చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందని అన్నారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం జీప్లస్3 గృహాలను పూర్తిచేసి సంక్రాంతి పండుగ కానుకగా లబ్ధిదారులకు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో మండగిరి కౌన్సిలర్ మల్లీశ్వరి, బసవరాజు, డిష్ రవి, వెంకటేశులు, డిష్ ఈరన్న పాల్గొన్నారు.

ఉపాధి పనులతో వలసల నివారణ: ఎంపీడీవో

ఆలూరు: ఉపాధి హామీ పథకం ద్వారా వలసలను నివారించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీవో విజయభాస్కర్ అన్నారు. మంగళవారం కమ్మరచేడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలు వేతనాలు అందడం లేదని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి ఉపాధి పనుల సందేహాలు, ఫిర్యాదులను స్వీకరించారు. గ్రామంలో ఉండి ఉపాధి పనులు చేసుకోవాలని, ఎవరూ బతుకుతెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు. ఆయన వెంట ఏపీవో చక్రవర్తి ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న నాగరాజుచారి

ఆదోని(అగ్రికల్చర్): మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు దాత నాగరాజుచారి స్టడీ మెటీరియల్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజుచారి మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అబ్దుల్ కలాం వంటి వారిని ఆదర్శంగా తీసుకొని చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హనుమంతు, ఉపాధ్యాయులు మోహన్‌రావు, సిద్దప్ప, నాగరాజు, రాజ, సతీష్ పాల్గొన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు: సీఐ


గతంలో బెల్టు షాపులు నిర్వహించిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ దైవప్రసాద్

ఆదోని: గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని తాలుకా సీఐ దైవప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక తాలుకా పోలీస్ స్టేషన్‌లో గతంలో బెల్టు షాపులు నిర్వహించిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అంతేగాక గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని, అలా పాల్పడినట్లు తెలిస్తే తన సెల్ ఫోన్‌కు సమాచారం అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

'హరికిషన్‌సింగ్ సూర్జిత్ అడుగుజాడల్లో నడుద్దాం'



హరికిషన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని(అగ్రికల్చర్): విప్లవ యోధుడు, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన డా.హరికిషన్‌సింగ్ సూర్జిత్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, జిల్లా నాయకుడు వెంకటేష్ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య భవన్‌లో డా.హరికిషన్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంజాబ్ కమ్యూనిస్టు పార్టీలో నిర్మాణాత్మక పాత్ర పోషించి ప్రజలపక్షాన పోరాడిన మహనీయుడు సూర్జిత్ అని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ, అఖిలభారత్ కిసాన్ సభలకు జాతీయ నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారన్నారు. ఆయన ఆశయాలను నెరవేరుద్దామన్నారు. కార్యక్రమంలో పీఎస్ గోపాల్, ముక్కన్న, వీరేష్, ఉచ్చీరప్ప, తిప్పన్న, నాగరాజు పాల్గొన్నారు.

'మద్యం దుకాణాన్ని తొలగించకపోతే ఉద్యమిస్తాం'


రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

ఆదోని(అగ్రికల్చర్): నిబంధనలకు విరుద్ధంగా ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించకపోతే ఉద్యమిస్తామని సెయింట్‌జోసఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు, మండగిరి ప్రాంత మహిళలు హెచ్చరించారు. మంగళవారం కొత్తబస్టాండ్ రహదారిలోని సుంకులమ్మవ్వ దేవాలయం వద్ద ఉన్న మద్యం దుకాణాన్ని వ్యతిరేకిస్తూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. విద్యార్థులు, కాలనీ మహిళలు ఉదయం మద్యం దుకాణాన్ని ప్రారంభించడంతో వెంటనే అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. దుకాణంలోకి వెళ్లి సీసాలను పగలగొట్టే ప్రయత్నం చేశారు. నిర్వాహకులు అప్రమత్తమై వెంటనే దుకాణాన్ని బంద్ చేశారు. అక్కడే బైఠాయించి గంట పాటు రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. టూటౌన్ సీఐ శివశంకర్, ఎస్‌ఐ రంగ, సిబ్బంది అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల ఉదయం, రాత్రి వేళల్లో విద్యార్థినులు వెళ్లలేరని ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. సీఐ శివశంకర్ ఎక్సైజ్ అధికారులతో మాట్లాడి ఎత్తివేస్తారు దుకు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో మండగిరి కౌన్సిలర్ మల్లేశ్వరి, శ్రీనివాసాచారి, బసవరాజు, ఈరన్న, వెంకటేష్, విమలమ్మ, శారద, పార్వతి, ఉమ, సెయింట్ జోసఫ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఆర్ వాక్సిన్ వేయించుకోవాలి

ప్రభుత్వ వైద్యాధికారి రఘురామిరెడ్డి


ఆస్పరిలో విద్యార్థికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారి రఘురామిరెడ్డి

ఆస్పరి: 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు విద్యార్థులకు తట్టు, రూబెల్లా నివారణకు వాక్సిన్ వేయించుకోవాలని మండల ప్రభుత్వ వైద్యాధికారి రఘురామిరెడ్డి కోరారు. మంగళవారం ఆస్పరిలోని జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ఎంఆర్ వాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆగస్టు 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 20వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఇది వరకు టీకా వేయించుకున్నా ఇప్పుడు తప్పనిసరిగా వేయించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. సుమారు 600 మంది విద్యార్థులకు ఎంఆర్ వాక్సిన్ వేశారు. అనంతరం ఎంపీడీవో సలీం బాషా, ఎంఈవో లక్ష్మణరావు మాట్లాడుతూ సురక్షితమైన వాక్సిన్ రెండు వ్యాధులను నివారిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, సరస్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి, ఏపీ మహిళా సమతా సొసైటీ ప్రతినిధి జెస్సీగ్లోరి, అంగన్‌వాడీ టీచర్లు లత, బేగం తదితరులు పాల్గొన్నారు.

'రూబెల్లా వ్యాధి నివారణకు వాక్సిన్'

ఆలూరు: ప్రభుత్వం తట్టు, రూబెల్లా వ్యాధి నివారణకు వాక్సిన్‌ను 9 నెలల పిల్లల నుంచి 15 సంవత్సరాల వయస్సు వారికి వేస్తుందని, ప్రతి ఒక్కరూ తప్పకుండా ఆరోగ్య కేంద్రాల్లో టీకాలను వేయించుకోవాలని ఎంపీడీవో విజయభాస్కర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మూసానపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు తట్టు, రూబెల్లా నివారణకు వాక్సిన్‌ను వేశారు.

సినిమా గైడ్

ఆదోని

సత్యం	: ఫిదా
శివం	: దండుపాళెం
రాజ్	: వైశాకం
రాజశ్రీ	: మున్నామైఖల్(హింది)
ద్వారక	: ఫిదా
ద్వారకశ్రీ	: మరతకమణి
మిని ద్వారక	: డీజే దువ్వాడ జగన్నాథం
సాయిబాబా	: నిన్నుకోరి
ప్రభాకర్	: బాహుబలి-2

ఆదోని రైతు బజార్‌లో కూరగాయల ధరలు (కిలో)

టమోటా రూ.46, వంకాయలు రూ.40, బెండకాయ రూ.26, పచ్చిమిరప రూ.38, కాకరకాయ రూ.25, బీరకాయలు రూ.26, క్యాలీఫ్లవర్ రూ.34, క్యాబేజీ రూ.16, క్యారెట్ రూ.55, దొండకాయ రూ.36, ఆలుగడ్డలు రూ.16, ఉల్లిగడ్డలు రూ.20, చౌళేకాయలు రూ.28, దోసకాయ రూ.20, సొరకాయ రూ.10, బీట్‌రూట్ రూ.28, బీన్స్ రూ.40, చిక్కుడుకాయలు రూ.34, ముల్లంగి రూ.24, నేతబీరకాయ రూ.16, దొండ మిరపకాయ రూ.56, అనపకాయ రూ.50, అల్లం రూ.28, గన్నిగడ్డ రూ.24లు పలికాయి.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

ఆలూరు: సివిల్‌సప్లై శాఖలో పని చేసే హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం జ్యోతిబసు కార్యాలయంలో హమాలీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకూ హమాలీలకు పనులు తగ్గిపోతున్నాయని, ఇప్పటికే చక్కెర, గోధుమలతో పాటు నిత్యావసర వస్తువులు స్టోర్లకు సరఫరా కావడం లేదన్నారు. ఉపాధి కోల్పోయి ఇప్పటికే ఇబ్బంది పడుతుంటే బియ్యాన్ని నగదు బదిలీ పథకాన్ని మారుస్తామని ప్రభుత్వం ప్రకటన చేయడం తగదన్నారు. 5న ఆదోనిలో జరిగే హమాలీ కార్మికుల సదస్సుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చంద్రుడు, మండల అధ్యక్షుడు శేఖర్, హమాలీ సంఘం నాయకుడు నాగరాజు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసిన వారు ఈ సెల్ నెంబర్లను సంప్రదించగలరు
ఏసీఓ. 9985482838 ఎస్.ఆర్. 9985434414

'బ్యాంక్ ఖాతాలకు పంట నష్టపరిహారం జమ చేయండి'

ఆస్పరి: పంట నష్టపరిహారాన్ని బ్యాంక్ ఖాతాలకు జమ చేయాలని మండలంలోని బనవనూరు గ్రామ రైతులు వ్యవసాయ అధికారులను కోరారు. మంగళవారం వ్యవసాయ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నాయకుడు సీతారామరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100 మంది రైతులు తమ ఖాతాలు తప్పుగా ఉన్నాయని, సరిచేసి బిల్లు పెట్టేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి మునెమ్మ, ఎస్ఐ వెంకటరమణను కోరారు. ఖాతాల తప్పులను సవరించి అర్హులైన రైతులకే పరిహారం అందేలా బిల్లు పెడతామని ఏవో హామీ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

భూ సమస్యలను
పరిష్కరిస్తాం

తహసీల్దార్ సూర్యనారాయణప్రసాద్



ఆలూరు రూరల్: పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తామని ఆలూరు తహసీల్దార్ సూర్యనారాయణప్రసాద్ అన్నారు.

ప్ర: మీ ఇంటికి - మీ భూమి కార్యక్రమానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

జ: 258 దరఖాస్తులు వచ్చాయి. అందులో 1బీ అడంగల్ మార్పులు, సర్వే నెంబర్ల సరవణకు అధికంగా దరఖాస్తులు వచ్చాయి.

ప్ర: మండలంలో రేషన్ కార్డులు ఎన్ని ఉన్నాయి?

జ: మండలంలో 32 రేషన్ దుకాణాలు, రేషన్ కార్డులు 13,420కి పైగాఉన్నాయి.

ప్ర: లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా అందిస్తున్నారా?

జ: లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందిస్తున్నాం.

ప్ర: మీ సేవా ద్వారా వచ్చే దరఖాస్తులను పరిశీలిస్తున్నారా?

జ: మీసేవా ద్వారా వచ్చే దరఖాస్తులను 15 రోజుల్లోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

నిరాశే

ఎండుతున్న పంటలు
ఆందోళనలో అన్నదాతలు

ఆలూరు రూరల్: పంటలు సాగుచేసుకున్న రైతులకు ఈ ఏడాది ఖరీఫ్‌లో నిరాశే మిగిలింది. విత్తనం వేసిన తర్వాత వర్షాలు కురవకపోవడంతో పంటలన్నీ ఎండిపోతున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి సాగు చేసిన పత్తి, వేరుశనగ పంటలు వర్షాలు సకాలంలో కురవకపోవడంతో వాడిపోతున్నాయి. మరోవైపు ఎండలు పెరగడంతో ఎండుముఖం పట్టాయి. దిక్కుతోచని రైతులు, వ్యవసాయ కూలీలు బతుకు తెరువు కోసం గుంటూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు వలస పోతున్నారు. మండలంలో 1500 హెక్టార్లలో పత్తి, 1650 హెక్టార్లలో వేరుశనగ పంటలు సాగు చేశారు. గత రెండు నెలల నుంచి వర్షాలు కురవకపోవడంతో పంటలు వాడిపోతున్నాయి. ఉన్న బోర్లలో నీరు లేక అడుగంటిపోయాయి. వర్షాలు కురవకపోతే తమకు అప్పులే గతి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.




ఎండిపోయిన పత్తి పంటను చూపుతున్న రైతు బలరాముడు



హాలేబీడులో ఎండిపోయిన పత్తి పంట

పొలానికి వెళ్లలేకపోతున్నాం



ఐదెకరాల్లో పత్తి పంట సాగు చేశా. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంట ఎండిపోతుంది. దీంతో పొలానికి వెళ్లలేకపోతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

- సోమప్ప, తుంబళబీడు

వర్షాలు రాకపోతే ఇబ్బందే



పదెకరాల్లో పత్తి పంట వేశా. మరో వారం రోజుల్లో వర్షాలు కురవకపోతే ఇబ్బందులే. ఎకరాకు రూ.10 వేలకు పైగా ఖర్చు పెట్టాను. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి.

- షర్మాస్‌వలి, పెద్దహోతూరు

'గ్యాస్‌పై సబ్సిడీ కొనసాగించాలి'

ఆదోని టౌన్: వంట గ్యాస్ సిలిండర్‌పై ఇస్తున్న సబ్సిడీని కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నీలకంఠప్ప అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉజ్వల యోజన పథకం కింద పేద మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్‌లను అందించిన ప్రభుత్వం సిలిండర్‌పై సబ్సిడీని ఎత్తివేసి ధరను పెంచి కోట్లాది పేద కుటుంబాలపై అదనపు భారం వేయడం సమంజసం కాదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్న అచ్చేదిన్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. నోట్ల రద్దు, జీఎస్టీతో సామాన్యులకు, చిరువ్యాపారులకు అనేక కష్టాలు కలిగించిన కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం మహిళల నడ్డి విరవడానికి సిద్ధం అవుతుందని, ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

'ఉద్యానవన పంటలకు ప్రభుత్వం చేయూత'

ఆదోని(అగ్రికల్చర్): ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం చేయూతనందిస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సోమసుందరం, ఉద్యానవన శాఖ అధికారి సాయిస్వేత అన్నారు. మంగళవారం ఢానాపురం గ్రామంలో ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 మంది సభ్యులుగా ఏర్పడిన గ్రూపులకు రూ.50వేల వరకు ఒక్కొక్కరికి రుణాన్ని అందిస్తుందన్నారు. రైతులు పండించిన పంటలకు దళారుల జోక్యం లేకుండా తామే మార్కెటింగ్ సౌలభ్యాన్ని కల్పిస్తామన్నారు. పంటల సాగుకు 75శాతం వరకు రాయితీ కల్పిస్తున్నామని తెలిపారు. పంటల్లో వచ్చే చీడపీడలు, విత్తనశుద్ధి, పంటల మార్పిడి, జిగురు అట్టలు, లింగాకర్షణ బుట్టలు, వేపనూనె ప్రాముఖ్యతపై శాస్త్రవేత్త సోమసుందరం రైతులకు వివరించారు.

కాగితరహిత పాలనపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న మున్సిపల్ ఉద్యోగులు

ఆదోని టౌన్: రాబోయే రోజులలో కాగితరహిత పాలన కొనసాగించడానికి ఉద్యోగులందరూ సిద్ధం కావాలని మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో మున్సిపల్ ఉద్యోగుల సిబ్బందికి కాగితరహిత పాలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ఐదు విభాగాలలో 96మంది ఉద్యోగులు పని చేస్తున్నారని, అన్ని విభాగాలకు చెందిన 264 ఫైల్స్ ఉన్నాయని, ప్రతి నెల 50 ఫైళ్ల చొప్పున కంప్యూటరీకరించాలని సూచించారు. ఐదు నెలల్లో అన్ని ఫైళ్లను కంప్యూటరీకరణ పూర్తి చేసి ఆన్‌లైన్‌లోనే పాలన కొనసాగించాల్సి ఉంటుందన్నారు. అందుకు గాను అదనంగా 32 కంప్యూటర్లను తెప్పించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. సదస్సులో మున్సిపల్ మేనేజర్ యువరాజ్, డీఈలు వెంకటరమణ, సత్యనారాయణ, రామమూర్తి, రెవెన్యూ ఆఫీసర్ దీలార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ ఉపాధ్యాయుల ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న ఫ్యాప్టో నాయకులు

ఆదోని(అగ్రికల్చర్): దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి గురువారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నట్లు ఫ్యాప్టో నాయకులు నాగరాజు, ప్రహ్లద, సునీల్‌రాజ్‌కుమార్, రమేష్‌నాయుడు, మల్లికార్జున, పార్థసారథి, లక్ష్మన్న తెలిపారు. మంగళవారం నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో వారు మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ రూల్స్ సవరణ చేయాలని ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులంతా సెలవు పెట్టి మున్సిపల్ కార్యాలయం ముందు తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. స్పందించకపోతే 17న గుంటూరు మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రసాద్, వెంకటరమణ, సుధాకర్, రామయ్య, శ్రీరామ్ పాల్గొన్నారు.

'అర్హులందరికీ పింఛన్లు'



పింఛన్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు శ్రీనివాసాచారి

ఆదోని టౌన్: అర్హులైన వారందరికీ పింఛన్లను పంపిణీ చేస్తామని మండగిరి టీడీపీ నాయకుడు శ్రీనివాసాచారి అన్నారు. మంగళవారం ఆయన మండగిరి ప్రాంతానికి చెందిన 220 మందికి వివిధ పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతికి చెందిన అన్ని సామాజిక వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు ప్రకటించి అమలు చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందని అన్నారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం జీప్లస్3 గృహాలను పూర్తిచేసి సంక్రాంతి పండుగ కానుకగా లబ్ధిదారులకు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో మండగిరి కౌన్సిలర్ మల్లీశ్వరి, బసవరాజు, డిష్ రవి, వెంకటేశులు, డిష్ ఈరన్న పాల్గొన్నారు.

'తాగునీటి సమస్యను పరిష్కరించాలి'



ఎంపీడీవోకు నీటి సమస్య గురించి వివరిస్తున్న మహిళలు

ఆస్పరి: ఆస్పరిలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ మంగళవారం 5, 6వ వార్డుల మహిళలు ఎంపీడీవో కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేశారు. ఖాళీ బిందెలను చేతపట్టుకొని కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎంపీడీవో సలీంబాషాకు నీటి సమస్య తీవ్రతను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గతంలోనే పైపులైన్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని, ఆయా పనులను అడ్డగించడంతో పనులు చేయించలేకపోయామని అన్నారు. నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన కార్యక్రమాన్ని విరమించారు.

జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు విద్యార్థి ఎంపిక

ఆలూరు: జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఆలూరు ప్రగతి జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థి మధు ఎంపికైనట్లు కరస్పాండెంట్ గురునాథ్, హెచ్ఎం శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. కర్నూలులో గత నెల 27, 28, 29వ తేదీల్లో అండర్-18 స్థాయి పోటీల్లో ఆంధ్ర జట్టు నుంచి ఆడి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది, పీఈటీ ప్రసాద్‌ను అభినందించారు.



సర్టిఫికెట్లను చూపుతున్న విద్యార్థి మధు

శ్రీశైలంలో నేటి పూజలు

స్వామివారి ఆలయం: బుధవారం ఉదయం 3 గంటలకు మంగళవాయిద్యాలు, 3.15 గంటలకు సుప్రభాతసేవ, 3.30 గంటలకు గోపూజ, కాలపూజ, 4గంటలకు మహామంగళహారతి, 4.30 గంటల నుంచి స్వామివారి దర్శనాలు ఉంటాయి.

అమ్మవారి ఆలయం: ఉదయం 4.40 గంటలకు మహామంగళహారతి, 5 గంటల నుంచి అమ్మవారి దర్శనాలు జరుగుతాయి. రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో వెండి పల్లకీసేవ నిర్వహిస్తారు.

- శ్రీశైలం

శ్రీశైలంలో కొండచిలువ పట్టివేత



కొండచిలువను పట్టుకున్న అటవీ సిబ్బంది

శ్రీశైలం: శ్రీశైలక్షేత్ర పరిధిలోని బీరప్ప సదన్ పరిసరాల్లో సు మారు 12 అడుగుల కొండచిలువను స్థానికులు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో అటవీ సిబ్బంది అక్కడికి చేరుకుని పాములు పట్టే యువకులు రమేష్, నాగరాజు సాయంతో కొండచిలువను పట్టుకుని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. తదుపరి ఎఫ్ఆర్‌వో జయరాం, ఎఫ్ఎస్‌వో తిలక్, ఎఫ్‌బీవో, ప్రొటెక్షన్ వాచర్లు కొండచిలువను అరణ్యలోతట్టు ప్రాంతానికి తీసుకెళ్లి వదిలేశారు. శ్రీశైలక్షేత్ర శివారు ప్రాంతాల్లో కొండచిలువల సంచారం అధికంగా ఉంటోంది. దీంతో ప్రజల్లో భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

'పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి'



ప్రతిజ్ఞ చేస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, తదితరులు

శ్రీశైలంప్రాజెక్టు: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శర్వాణి అన్నారు. ఆగస్టు 1 నుంచి 15 వరకు స్వచ్ఛ భారత్ పక్షం లో భాగంగా మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛ భారత్‌లో పాల్గొనాలన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పాల్‌దయాకర్, ఉస్మాన్‌సాహెబ్, కరీముల్లా, హుసేనయ్య పాల్గొన్నారు.

కేజీ రోడ్డుపై మినీ లారీ బోల్తా



బోల్తాపడిన మినీ లారీ

ఆత్మకూరు: నల్లమలలోని కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారిపై చీనిపండ్ల లోడుతో వస్తున్న ఓ మినీలారీ మంగళవారం మధ్యాహ్నం బోల్తాపడింది. దోర్నాల నుంచి ఆత్మకూరు వైపునకు ఏపీ7టీయూ నెంబర్ గల మినీలారీ చీని పండ్ల లోడుతో వస్తోంది. అయితే బైర్లూటి సమీపంలోని భారీ మలుపు వద్ద వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. వాహనంలోని చీని పండ్లని రోడ్డుపై పడిపోయాయి. దీంతో కొంతమేరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడలకు విద్యార్థి ఎంపిక

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అబ్దుల్‌వాజిద్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సక్రూనాయక్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు నెల్లూరులో జరిగే అండర్-14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థిని హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు సిద్ధయ్య, పీఈటీ ప్రభాకర్, సంఘ సేవకుడు అల్తాఫ్‌హుసేన్ అభినందించారు.

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు

ఆత్మకూరు: పట్టణంలోని పలు రహదారులపై మున్సిపాలిటీ అధికారులు ముమ్మరంగా విస్తరణ పనులు చేయిస్తున్నారు. పట్టణంలోని సీసీ రహదారులకు ఇరువైపుల మట్టిపేరుకుపోవడం, ఆక్రమలతో వర్షపునీరు రహదారులపైనే నిలుస్తోంది. దీంతో పట్టణ ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉండటంతో మున్సిపాలిటీ అధికారులు రోడ్డును విస్తరించే పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపుల ఉండే మట్టిని తొలగించారు.

జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వెంకటేశ్వర్లు

పాములపాడు: పాములపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వీ.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. మంగళవారం ఆయన కళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. కర్నూలు టౌన్ మోడల్ కళాశాలలో సివిక్స్ అధ్యాపకుడిగా పని చేస్తున్న వెంకటేశ్వర్లును కడప ఆర్జేడీ పాములపాడు జూనియర్ కళాశాలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిన్సిపాల్ నియామకంతో జూనియర్ కళాశాల నిర్వహణ గాడిలో పడనుందని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బదిలీపై ఇద్దరు అధికారుల రాక

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీకి ఇద్దరు అధికారులు బదిలీపై వచ్చినట్లు కమిషనర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో మేనేజర్‌గా పనిచేస్తున్న రంగస్వామి అనంతపురం జిల్లా ధర్మవరం మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లగా ఈయన స్థానంలో హిందూపురం మున్సిపాలిటీ నుంచి కొం డన్న బదిలీపై వచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఆత్మకూరు టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న మోహన్‌రావు పదవీ విరమణ పొందడంతో ఈయన స్థానంలో డోన్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న రామకృష్ణ టీపీఎస్‌గా నియమితులైనట్లు వెల్లడించారు.

స్వచ్ఛభారత్‌పై సెమినార్

వెలుగోడు: పట్టణ శివార్లలోని జూనియర్ కళాశాలలో స్వచ్ఛభారత్ కార్యాచరణ ప్రణాళికపై ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు సెమినార్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. మంగళవారం జాతీయ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరికీ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ప్రాంగణాన్ని, గ్రామాన్ని, దేశాన్ని స్వచ్ఛంగా, శుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చే శారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ వెంకటరమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు 405 దరఖాస్తులు : తహసీల్దార్



మాట్లాడుతున్న తహసీల్దార్ నాగేంద్ర

పాములపాడు: మండలంలో ఓటరు నమోదుకు 405 దరఖాస్తు లు వచ్చినట్లు తహసీల్దార్ నాగేంద్రరావు తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జూలై 31వ తేదీ వరకు ఓటరు నమోదు కోసం 405 మంది దరఖాస్తు చేసుకోగా అం దులో పురుషులు 198 మంది, మహిళలు 207 మంది ఉన్నట్లు వివరించా రు. ఫారమ్-8లో ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులకు ఎలాంటి దరఖాస్తులు రాలేదని తెలిపారు. ఎన్నికల కోడ్ వున్న నేపథ్యంలో ఓటరు నమోదుకు ఈ నెలలో దరఖాస్తులు స్వీకరించరని వెల్లడించారు.

అభిషేకాల్లో ఇలాగేనా?

సిబ్బంది ప్రవర్తనపై భక్తుల అసంతృప్తి

మల్లన్న ఆలయంలో వాగ్వాదం

శ్రీశైలం: శ్రీశైల క్షేత్రంలో దేవస్థానం అమలు చేస్తున్న సామూహిక అభిషేకాల నిర్వహరణ తీరుపై భక్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన 16మంది భక్తులు సోమవారం సాయంత్రం స్వామివారి సామూహిక ఆర్జితాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది ప్రవర్తన తీరుపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సిబ్బందికి సదరు భక్తులకు వాగ్వాదం జరిగింది. ఆర్జితాభిషేకాల నిర్వహణ తీరు, సిబ్బంది ప్రవర్తన సరిగా లేవని భక్తులు మంగళవారం ఉదయం దేవస్థానం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దేవస్థానం నిర్ణయించిన రెండురకాల ఆర్జిత అభిషేకాలు సామాన్య భక్తులకు అందుబాటులో లేవని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.5వేలతో గర్భాలయ ఆర్జితాభిషేకం, రూ.1500 మండపపూజా అభిషేకం చేయవచ్చు. అయితే ఈ టిక్కెట్లపై దంపతులకు మాత్రమే అనుమతి ఉంటుంది. అయితే దంపతులు కాని భక్తులు రూ.1500 టిక్కెట్ కొని అభిషేకం చేయదల్చుకుంటే దేవస్థానం సిబ్బంది అనుమతించడం లేదు. దీంతో తరచూ భక్తులు అసంతృప్తికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం సాయంత్రం దేవస్థానం సిబ్బందికి, హైదరాబాద్ భక్తులకు వాగ్వాదం జరిగింది. ఆర్జితాభిషేకాల పద్ధతిలో మార్పులు తేవాలని భక్తులు కోరుతున్నారు.

ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్



టీకా వేస్తున్న వైద్యాధికారి సోమశేఖర్

శ్రీశైలం: శ్రీశైలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు. శ్రీశైలం ఉన్నతపాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్‌వో లక్ష్మానాయక్ ప్రారంభించారు. శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు సోమశేఖర్, ఇంతియాజ్, వైద్యసిబ్బంది పాల్గొని హైస్కూల్, ఎంపీపీ పాఠశాలకు చెందిన 615మంది 9-15ఏళ్లలోపు విద్యార్థులకు టీకాలు వేశారు. మండలంలోని మొత్తం 10వేలమంది పిల్లలు ఉన్నట్లుగా వైద్యాధికారులు చెబుతున్నారు. వీరిలో 6వేల మంది ఆయా పాఠశాలల విద్యార్థులు కాగా మరో 4వేల మంది బడిబయట పిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రంగయ్య, ఎ.ఎన్.ఎం.లు, ఆశావర్కర్లు, 108సిబ్బంది, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో 19 టీఎంసీల నీటి నిల్వ

శ్రీశైలంప్రాజెక్టు: శ్రీశైల జలాశయ నీటి నిల్వలు మంగళవారం సాయంత్రం 6గంటలకు 19.5903 టీఎంసీలుగా డ్యాం నీటిమట్టం 777.90 అడుగులుగా నమోదయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 34 డిగ్రీలు, కనిష్ఠంగా 24 డిగ్రీలుగా నమోదయ్యాయి. గడిచిన 24గంటల వ్యవధిలో పట్టణంలో 6.40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

తల్లిపాల వారోత్సవ ర్యాలీ

శ్రీశైలం: శ్రీశైలంలో మంగళవారం విద్యార్థులు తల్లిపాల వారోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 1వ తేదీ నుంచి 10వ తేదీ దాకా కొనసాగే వారోత్సవాల్లో కార్యకర్తలు తల్లిపాల ప్రా ముఖ్యం, పిల్లల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అం గన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎస్సీ కార్పొరేషన్ విలీనం దుర్మార్గం'

శ్రీశైలంప్రాజెక్టు: డీఆర్‌డీఏలో ఎస్సీ కార్పొరేషన్ విలీనం చేస్తున్న ప్రయత్నాలు దుర్మార్గమని ఏపీ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కిరణ్‌రాజ్ అన్నారు. సున్నిపెంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ సంస్థను, బ్యాక్‌లాగ్ పోస్టులను రద్దు చేయాలని చూస్తే ఊరుకోమని అన్నారు. దళితులకు రాజ్యాంగం కొన్ని ప్రత్యేక హక్కులను కల్పించిందని అందులో భాగంగానే ఎస్సీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ సమావేశంలో ప్రసన్నకుమార్, క్రాంతి, యోహాను, చిన్నబాబు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్, వీఆర్వోపై కేసు నమోదు

పాములపాడు: వేంపెంట గ్రామానికి చెందిన నెత్తికొప్పుల చంద్రబాబు పేరు మీద ఉన్న పొలం రికార్డులను తారుమారు చేసిన సంఘటనలో మండల సర్వేయర్ అన్వర్ బాషా (ప్రస్తుతం వీఆర్‌లో ఉన్నారు), గ్రామ వీఆర్వో సుగుణాకర్‌లపై ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకరరెడ్డి మంగళవారం తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులై వుండి తప్పుడు రికార్డులను సృష్టించి, వాటిని తారుమారు చేశారన్న విషయంపై కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

'వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

పాములపాడు: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ ఫెడరేషన్ తాలుకా అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం పాములపాడులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విజయనగరం, శ్రీకాకుళం, ఉభయగోదావరి జిల్లాలు తదితర ప్రాంతాల్లో ఎస్టీలుగా ఉన్న వాల్మీకులు రాయలసీమలో బీసీలుగా కొనసాగుతున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో వాల్మీకులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఈనెల 6న డోన్‌లో జరిగే బీటీ నాయుడు సన్మాన సభకు వాల్మీకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు సోములు, తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, లింగన్న పాల్గొన్నారు.

కౌలు రుణ అర్హత కార్డులు సరే..

బ్యాంకు రుణాలేవీ?


రుణఅర్హత కార్డును చూపుతున్న రైతు

కొత్తపల్లి: వ్యవసాయంపై మక్కువతో కొంత పొలం కౌలుకు తీసుకుని పంటలు సాగుచేసుకుని తమ కుటుంబాలు పోషించుకునే రైతన్నకు కష్టకాలం వచ్చింది. ప్రభుత్వం కౌలు రైతులను అన్నివిధాలుగా ఆదుకుని వారికి బ్యాంకుల్లో వడ్డీలేని రుణాలను అందజేయాలని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదు. కొత్తపల్లి మండలంలోని కౌలు రైతులకు బ్యాంకుల్లో రుణాలు ఇస్తారనే ఆశతో 215 మంది కౌలు రైతులు స్థానిక రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే భూమి వున్న సొంత రైతులు పొలాలు కౌలుకు ఇచ్చారు కాని కౌలుకు ఇచ్చినట్లు రాతపూర్వకంగా రాసి ఇవ్వకపోవడంతో కౌలు రైతులకు నిరాశే మిగిలింది. మండలంలో 215 మంది కౌలు రైతులకు గానూ.. కేవలం 74 మందికి స్థానిక రెవెన్యూ అధికారులు రుణ అర్హత కార్డులను పంపిణీ చేశారు. అయితే రెవెన్యూ అధికారులు

ఆందోళనలో కౌలు రైతులు

కౌలు రైతులకు రుణాలను ఇచ్చి ఆదుకోవాలని బ్యాంకర్లను కోరినప్పటికీ నేటికి ఒక్కరికి కూడా రుణాలు ఇచ్చిన దాఖలాల్లేవు.

ఇప్పటికే కొత్తపల్లి మండలంలో వందల హెక్టార్లలో కౌలు రైతులు మొక్కజొన్న, కంది, జొన్న, పొద్దుతిరుగుడు, వేరుశనగ తదితర పంటలను సాగుచేశారు. అయితే వర్షాభావం వలన చాలా మంది కౌలు రైతులు సాగుచేసిన పంటలను దున్నివేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కౌలు రుణ అర్హత కార్డులు జారీ చేసిన రైతులకు బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలను పంపిణీ చేయాలని కోరుతున్నారు.

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి



ప్రభుత్వం బ్యాంకులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేసి కౌలు రైతులకు బ్యాంకులు రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. రైతుల పట్ల చిన్నచూపు చూడకుండా తక్షణమే రుణాలు అందించాలి.

- సుబ్బారెడ్డి, గువ్వలకుంట్ల రైతు

'బ్యాంకర్లు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్ సత్యం

ఆత్మకూరు: బ్యాంకర్లు నిర్దేశించిన లక్ష్యాలను తప్పక పూర్తి చేయాలని లీడ్‌బ్యాంక్ మేనేజర్ సత్యం, నాబార్డు డీడీఎం నగేష్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆత్మకూరు, పాములపాడు, కొత్తపల్లి, వెలుగోడు మండలాల్లోని ఆయా బ్యాంకుల మేనేజర్లు, ఫీల్డ్‌ఆఫీసర్లుతో పాటు వెలుగు, మెప్మా సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల ద్వారా అందిచనున్న సబ్సిడీ రుణాలలో భాగంగా బ్యాంకులు రుణాలు అందించాలని కోరారు. ఆయా బ్యాంకులకు కేటాయించిన యూనిట్లను అర్హులైన లబ్దిదారులందరికీ పంపిణీ చేయాలని అన్నారు. వెలుగు, మెప్మా సిబ్బంది కూడా పొదుపు రుణాలు సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లు అంజాద్, సుశేశ్వరరావు, బీసీ కార్పొరేషన్ ఏఈవో సుబ్రహ్మణ్యం, ఆత్మకూరు, వెలుగోడు ఎంపీడీవోలు శశికళ, శివనాగప్రసాద్, ఆయా బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

'ఒకే టీకాతో రెండు వ్యాధుల నివారణ'


ఆత్మకూరు, వెలుగోడులలో చిన్నారులకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: ఒకే టీకాతో రెండు వ్యాధులు నివారించవచ్చునని వైద్యాధికారులు మోతిలాల్‌నాయక్, కృష్ణమూర్తి, ఎంఈవో జానకీరామ్ అన్నారు. మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని చిన్నారులకు వైద్యసిబ్బంది ఎంఆర్ వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9 నెలల నుంచి 15ఏళ్లలోపు పిల్లలకు మీజిల్స్(తట్టు), రుబెల్లా వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. వీటిని నివారించేందుకు పిల్లలకు ముందస్తుగా వ్యాక్సిన్లను వేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమతి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో.. ఎంఆర్ వ్యాక్సిన్‌ను చిన్నారులకు తప్పనిసరిగా వేయించాలని ఎంపీడీవో కమలాకర్, ఎంఈవో శ్రీరాములు అన్నారు. మంగళవారం వారు కొత్తపల్లి హెల్త్ సెంటర్‌లో ఎంఆర్ వ్యాక్సిన్లు వేస్తున్న కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతోందని అన్నారు. కొత్తపల్లి పీహెచ్‌సీ పరిధిలో 774 మందికి, గోకవరం పీహెచ్‌సీ పరిధిలో 427 మందికి ఎంఆర్ వ్యాక్సిన్లు వేసినట్లు వైద్యాధికారి దీప్తి, సీహెచ్‌వో బాలకృష్ణ పేర్కొన్నారు. అలాగే దుద్యాల జడ్పీహైస్కూల్‌లో పీహెచ్‌ఎన్ మణిమంజుల, హెల్త్ సిబ్బంది వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో సీఎస్ఐ డేకేర్ సంస్థ అధ్యక్షుడు సుధాకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాములపాడులో.. మండలంలో మంగళవారం 581 మందికి ఎంఆర్ వ్యాక్సిన్‌ను అందించినట్లు వైద్యాధికారి నాగలక్ష్మీదేవి తెలిపారు. పాములపాడులో జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో, కస్తుర్బాగాంధీ విద్యాలయంలో ఎంఆర్ వ్యాక్సిన్ విద్యార్థులకు వేయించినట్లు పేర్కొన్నారు. వైద్యాధికారి నాగలక్ష్మీదేవి, ఎంఈవో బాలాజీనాయక్ మాట్లాడుతూ మొదటి రోజు 687మందికి గానూ.. 581 మందికి ఎంఆర్ వ్యాక్సిన్ వేసినట్లు వివరించారు. గురువారం ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గురప్ప పాల్గొన్నారు.

వెలుగోడులో.. ఎంఆర్ వ్యాక్సిన్‌ను చిన్నారులకు తప్పనిసరిగా వేయించాలని వైద్యులు హిమబిందు, గోపాల్‌నాయక్, ఎంఈవో బ్రహ్మంనాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆయా పాఠశాలల్లో 1655 మంది చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్లు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వోలు శ్రీనివాసులు, నరసింహులు, సిబ్బంది మద్దయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్ధాపురంలో పెద్దపులి సంచారం

భయాందోళనలో గ్రామస్థులు


సిద్ధాపురం శివార్లలో పెద్దపులి అడుగులు, ఆందోళనలో మహిళలు

ఆత్మకూరురూరల్: నల్లమల అటవీ సమీప గ్రామమైన సిద్ధాపురం శివార్లలో సోమవారం రాత్రి పెద్దపులి సంచరించడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ పక్కనే ఉన్న రామారావు అనే రైతు పొలంలో పెద్దపులి సంచరించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. సోమవారం అర్ధరాత్రి పెద్దపులి గ్రామ శివారు పొలాల్లోకి రావడంతో కుక్కలు గట్టిగా కేకలు వేయడంతో పులిసంచారం ఉన్నట్లు గ్రామస్థులు అనుమానించారు. మంగళవారం ఉదయం పొలాల్లోకి వెళ్లి పరిశీలించగా పెద్దపులి సంచరించినట్లు అడుగు జాడలు కనిపించడంతో అటవీశాఖ అధికారులకు గ్రామస్థులు సమాచారం అందించారు. ఈ మేరకు బైర్లూటి రేంజర్ శంకరయ్యతో పాటు అటవీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పాదముద్రికలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి: ఏవో


మాట్లాడుతున్న ఏవో హేమలత

ఆత్మకూరురూరల్: పంటల సాగులో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని వ్యవసాయాధికారి హేమలత అన్నారు. మంగళవారం మండలంలోని ఇందిరేశ్వరం, కృష్ణాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువుల వాడకాన్ని చేపట్టాలని సూచించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ-క్రాప్ నమోదులో భాగంగా పంటల వివరాలను రైతులు నమోదు చేయించుకోవాలని చెప్పారు. అలాగే పైపులు, రెయిన్‌గన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా మొక్కజొన్న, కంది పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఈవో ప్రవల్లిక పాల్గొన్నారు.

'ఆర్డీటీ ఆధ్వర్యంలో చెంచులకు గృహనిర్మాణాలు'


గూడెంలో కొలతలు వేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామ పంచాయతీలోని ఎర్రకుంట గూడెం చెంచులకు ఆర్డీటీ సంస్థ సహకారంతో గృహాలు నిర్మించి ఇవ్వనున్నట్లు ఐటీడీఏ జిల్లా కో-ఆర్డినేటర్ జీపీ.లింగన్న తెలిపారు. మంగళవారం ఆయన ఎర్రకుంట గూడెంలో అటవీశాఖకు చెందిన 2.54ఎకరాల్లో 37 చెంచు కుటుంబాలకు ఒక్కొక్కరికి 5సెంట్ల చొప్పున గృహ నిర్మాణాల కోసం సర్వేయర్ ఆనందరావుతో కొలతలు వేయించారు. అనంతరం లింగన్న మాట్లాడుతూ 2006 అటవీ హక్కుల ప్రకారం గిరిజనులు నివాసం కోసం ఈ భూమి కేటాయించినట్లు చెప్పారు. ఈ గూడేన్ని మోడల్ కాలనీగా తీర్చిదిద్ది రోడ్డు, తాగునీరు, విద్యుత్, దేవాలయం, కమ్యూనిటీ భవనం తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. ఐటీడీఏ సర్వేయర్ రాజు, గిరిజన సంఘం నాయకుడు నరసింహానాయక్ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి దిన పత్రిక కావలసిన వారు
ఈ సెల్ నెంబర్లను సంప్రదించగలరు.
ఎస్.ఆర్. 9985437703, ఏజెంటు 9912414625

కొలిమిగుండ్ల జడ్పీ పాఠశాల నుంచి 13 మంది ఉపాధ్యాయుల బదిలీ

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల జడ్పీ పాఠశాల నుంచి ఏకంగా 13 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఉపాధ్యాయుడు ప్రభాకర్ పెట్నికోటకు, ఉపాధ్యాయిని సుజాత పేరుసోములకు, అంకిరెడ్డిపల్లె జడ్పీహెచ్ పాఠశాలకు జయసుధ, లక్ష్మీనారాయణ, కొండప్ప బదిలీ అయ్యారు. రుద్రవరం నుంచి హుస్సేనయ్య, కనకాద్రిపల్లెకు రఘురాముడు, అవుకు మండలం కునుకుంట్లకు నాగార్జున, హెచ్ ఖైరవాడికి దుర్గామలేశ్వరి, అవుకుకు రాజేశ్వరి, పెరవలికి రంగస్వామి, పేరుసోములకు రమణయ్య, బాబయ్య బదిలీ అయ్యారు.

కరుణించని వరుణుడు

●ఎండిపోతున్న పంటలు ● ఆందోళనలో రైతులు



ఎండిపోతున్న మినుము పంట



ఎండిపోయిన కొర్ర పంట

బనగానపల్లె: ఈ సంవత్సరంలో వర్షాలు బాగా కురుస్తాయని రైతులు ఆశలు పెట్టుకున్నారు. విత్తనం వేశాక వాన చినుకు రాలకపోవడంతో పంట మొక్కలు వాడుదశకు చేరుకున్నాయి. పోయినేడాది కరవుతో అల్లాడిన రైతులకు ఈ సంవత్సరం అదే అనుభవం ఎదురుకానుంది.

మండలంలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు :

మండలంలో కంది పంట 785 హెక్టార్లు, మినుము 354, కొర్ర 276, పెసర 14, పత్తి 260, ఆముదం 87, మొక్కజొన్న 130, మిరప 30, వేరుశనగ 60, ప్రొద్దుతిరుగుడు 8, ఇతర పంటలు 121 హెక్టార్లలో సాగు చేశారు. వర్షాలు కురవకపోవడంతో వీటిల్లో కొర్ర పంట పూర్తిగా ఎండిపోయింది. మినుము, కందులు ఎండుదశకు చేరుకున్నాయి. వాస్తవానికి ఖరీఫ్‌లో 9,836 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేయాల్సి ఉండగా కేవలం 2,185 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు.

ఎండిపోతున్న పంటలు

జూన్ రెండో వారంలో 65 ఎంఎంల వర్షపాతం, జూలై లో 107 ఎంఎం వర్షపాతం కురవాల్సి ఉండగా కేవలం 15.8 ఎంఎం మాత్రమే నమోదు అయింది. దీంతో పంటలు ఎండు దశకు చేరుకున్నాయి. వారం రోజుల్లో వర్షం కురవకపోతే రైతులు నష్టాలను చవిచూస్తారు.

పంటలు ఎండిపోతున్నాయి



ఖరీఫ్‌లో వేసిన పంటలు ఎండిపోతున్నాయి. 2 ఎకరాల్లో పత్తి, 2 ఎకరాల్లో మినుము సాగు చేశా. మినుము పంట ఎండిపోయింది. గత పదేళ్లుగా వర్షాలు సరిగా కురవక కరవు కాటకాలతో అల్లాడుతున్నాం. దద్దనాల ప్రాజెక్టుకు నీరు రాకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. వర్షాలు కురవకపోతే వలస వెళ్లాల్సిందే.

- బత్తుల చిన్న సుబ్బారెడ్డి, మీరాపురం రైతు

అప్పుల ఊబిలో కూరుకుపోయాం



6 ఎకరాలు మినుము, 3 ఎకరాల్లో కంది సాగు చేశాను. పంటలు ఎండు దశకు చేరుకున్నాయి. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఇప్పటికే వ్యవసాయ ఖర్చులతో అప్పుల ఊబిలో కూరుకుపోయాం.

- శివకృష్ణయాదవ్, ఫతేనగర్

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

బనగానపల్లె రూరల్: మండల పరిధిలోని నందవరంలో బుధవారం నుంచి సీతారామ లక్ష్మణ హనుమత్సమేత రామచంద్రస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు గ్రామ పెద్దలు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని కోదండ రామస్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. సాయంత్రం 5 గంటలకు మృత్యంగ్రహణం, అంకురార్పణ, జలాధివాసం, రాత్రి 8 గంటలకు హారతి, ప్రసాద వితరణ ఉంటాయన్నారు. 3వ తేదీ ప్రాతఃకాల పూజ, మహానారాయణ హోమం, సాయంత్రం ధాన్యాధివాసం నిర్వహిస్తామన్నారు. 4వ తేదీ ఉదయం 8 గంటలకు విగ్రహాల ప్రతిష్ఠ, 9.50 గంటలకు పూర్ణాహుతి, 10.30 గంటలకు సీతారాముల కళ్యాణం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు సీతారాముల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.



ప్రతిష్ఠించనున్న విగ్రహాలు

రాష్ట్ర స్థాయి పోటీలకు నెహ్రూ విద్యార్థులు

బనగానపల్లె: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన నెహ్రూ ఉన్నత పాఠశాల విద్యార్థులను కరస్పాండెంట్ హరినాథ్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కమల్ తేజారెడ్డి అభినందించారు. కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో తమ విద్యార్థులు సాజిద్ హుస్సేన్, గురప్ప రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని, వీరు 3, 4, 5వ తేదీల్లో నెల్లూరు జిల్లా గూడూరులో జరిగే పోటీల్లో పాల్గొం టారని చెప్పారు.



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు కమల్‌తేజారెడ్డి

‘తల్లిపాలు పిల్లల ఆరోగ్యానికి శ్రేయస్కరం’



తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవాణి

అవుకు: తల్లిపాలు పిల్లల ఆరోగ్యానికి శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవాణి పేర్కొన్నారు. మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చెర్లోపల్లెలోని వీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ పిల్లలకు 6 నెలల వరకు తల్లిపాలు తప్పక తాపించాలని, ఆ తర్వాత అనుబంధ ఆహారంతో పాటు రెండు సంవత్సరాల వర కు తల్లిపాలు ఇస్తే ఆరోగ్యంగా ఉంటారన్నా రు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు ఇచ్చే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమామహేశ్వరీ , కంబక్క, ఆయాలు జ్యోతి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బనగానపల్లె మండలంలో..



రామకృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులు

బనగానపల్లె: మండలంలోని రామకృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రం 1 లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులకు కార్యకర్త రాధమ్మ తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. తల్లిపాలతో పిల్లలు శారీరక, మానసికంగా ఎదుగుతారని, బిడ్డ జన్మించిన గంట లోపు ముర్రుపాలు తాపాలని చెప్పారు.

‘సంక్షేమ పథకాలు అర్హులకు వర్తింపచేయాలి’



నూతన కార్యవర్గ సభ్యులు

బేతంచెర్ల: ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను అధికారులు అర్హులకు వర్తింపచేయాలని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కార్యాలయంలో జిల్లా యూత్ అధ్యక్షుడు రేగుమాను చిన్న సుబ్బయ్య ఆధ్వర్యంలో మండల ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సం ఘం యూత్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా రేగుమాను శశిధర్‌రావు, ఉపాధ్యక్షుడిగా నాగేంద్ర, కార్యదర్శిగా మధుబాబు, సహాయ కార్యదర్శిగా హేమంత్, కోశాధికారిగా మధుశేఖర్‌తో పాటు ఏడుగురిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీసంక్షేమ సంఘం కార్యకర్తలు శివ, అంజి, రామచంద్రుడు, సుబ్బారావు పాల్గొన్నారు.

11 మందిపై బైండోవర్ కేసులు

బనగానపల్లె: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది మద్యం, సారా విక్రయిస్తున్న వారికి కౌన్సిలింగ్ నిర్వహించి బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ రాకేష్ మంగళవారం తెలిపారు. భవిష్యత్తులో మళ్లీ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

కోవెలకుంట్ల: స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం టీడీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. బూత్ కమిటీలు ఏర్పాటుచేసి సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. సభ్యత్వం తీసుకున్న వారు ప్రమాదాల్లో మృతి చెందితే రూ.5 లక్షల బీమా వర్తిస్తుంద ని కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు చైర్మన్ నాగేశ్వర రెడ్డి, బనగానపల్లె మార్కెట్‌యార్డు చైర్మన్ నాగరాజుయాదవ్ తెలిపారు. పార్టీకి కార్యకర్తలే మూల స్తంభాలన్నారు. చంద్రన్న బీమా, పింఛన్ల పెంపు, రైతులు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ అంశాలను ప్రజలకు తెలిపే బాధ్యత కార్యకర్తలదేనన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దిలేటి, ఉప అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మురళి, సెక్రటరీ శంకర్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర రైతు ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, మండల యూత్ ప్రెసిడెంట్ అమర్‌నాథ్ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు శేఖర్, ఎస్సీ జిల్లా ఉపఅధ్యక్షుడు రామచంద్ర రావు, రేవనూరు ఏవీ సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, లింగాల నాయుడు పాల్గొన్నారు

అసభ్యంగా ప్రవర్తించినందుకు జైలు, జరిమానా

కోవెలకుంట్ల: సివిల్ జడ్జి బాబు అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి 5 రోజుల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు. మండలంలోని బిజినవేముల గ్రామానికి చెందిన శివుడు కొంత కాలం క్రితం అసభ్యంగా ప్రవర్తించడంతో అతడిపై కేసు నమోదైంది. విచారించిన న్యాయమూర్తి బాబు నేరం రుజువు కావడంతో 5 రోజుల జైలు, రూ.500 జరిమానా విధించారని ఎస్ఐ మంజునాథ్ తెలిపారు. వాహనాల తనిఖీ నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన 17 మంది వాహనదారులకు జరిమానా విధించామని ఎస్ఐ తెలిపారు.

'పిల్లలకు వ్యాక్సిన్ తప్పక వేయించాలి'


యనకండ్ల ప్రాథమిక పాఠశాలలో టీకా వేస్తున్న ఏఎన్ఎం సరస్వతి

బనగానపల్లె రూరల్: 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలందరికీ మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్ తప్పక వేయించాలని ఎంఈవో స్వరూప తల్లిదండ్రులను కోరారు. మంగళవారం మండల పరిధిలోని ఇల్లూరుకొత్తపేట పాఠశాల విద్యార్థులకు ఎంఈవో ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది టీకాలు వేశారు. కార్యక్రమంలో సీఆర్పీ మద్దిలేటి పాల్గొన్నారు. యనకండ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సత్యప్రకాష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది టీకాలు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీదేవి, వేణుగోపాల్, విద్యావలంటీర్ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త సరళ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కోవెలకుంట్లలో..

కోవెలకుంట్ల: పట్టణంలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల, శ్రీ విద్య ఉన్నత పాఠశాల, ఇండియన్ డిజిటల్ స్కూల్ విద్యార్థులు 730 మందికి ఎంఆర్ వ్యాక్సిన్ వేశామని డాక్టర్ బాబు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, సీడీపీవో విజయమ్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీదేవి, సుగుణ, భారతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అవుకులో ..


అవుకులో విద్యార్థికి టీకా వేస్తున్న ఆరోగ్య కార్యకర్త దానమ్మ

అవుకు: మండలంలో 13,302 మంది పిల్లలకు 91 వ్యాక్సినేషన్ కేంద్రాల్లో వ్యాక్సిన్ వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ హేమనళిని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగకుమార్, ఎంఈవో శ్రీధర్‌రావు, ఐకేపీ ఏపీఎం జ్యోతి, ప్రధానోపాధ్యాయుడు నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

కొలిమిగుండ్లలో :

కొలిమిగుండ్ల: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ముక్తార్ పాషా ప్రారంభించారు. మొదటి విడతగా 1081 మందికి టీకాలు వేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు పకీర్అహ్మద్, ఎంపీడీవో శోభారాణి, ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నపుల్లయ్య, సీఆర్పీలు రాజేష్, మద్దిలేటి, కమలమ్మ, ఆరోగ్య కార్యకర్తలు కొండయ్య, రామలక్ష్మి, ధనలక్ష్మి, ఆశా వలంటీర్ బయమ్మ పాల్గొన్నారు.


విద్యార్థికి టీకా వేస్తున్న డాక్టర్ ముక్తార్ పాషా

బేతంచెర్లలో


టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

బేతంచెర్ల: మండలంలోని వివిధ గ్రామాల్లోని 2,648 మంది పిల్లలకు టీకాలు వేశామని ప్రభుత్వ వైద్యాధికారులు, డాక్టర్ శ్రీనివాసులు డాక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. మండలంలో 9 నెలల చిన్నారుల నుంచి 15 సంతవ్సరాల పిల్లలు మొత్తం 18,810 మంది ఉన్నారని తెలిపారు. బేతంచెర్ల పీహెచ్‌సీ పరిధిలో మొదటి రోజు 1775 మంది, రంగాపురం పీహెచ్‌సీ పరిధిలో 873 మంది పిల్లలకు టీకాలు వేశామన్నారు. మొత్తం 130 వైద్య బృందాలను టీకాలు వేయడానికి కేటాయించామని చెప్పారు. కార్యక్రమంలో రంగాపురం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జయేంద్ర రెడ్డి, డాక్టర్ శివాజయంతి, హెల్త్ ఎడ్యుకేటర్ హసాన్‌బేగ్, సీహెచ్‌వో లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సంజామలలో :

సంజామల: మండలంలో మొదటి రోజు 1500 మందిపిల్లలకు టీకాలను వేశామని డాక్టర్లు గోపాల్, వెంకటసుబ్బయ్య తెలిపారు. పేరుసోముల, నొస్సం, ఆకుమళ్ల, సంజామల పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆరోగ్య కార్యకర్తలతో టీకాలు వేయించామన్నారు.


పేరుసోముల పాఠశాలలో టీకా వేస్తున్న డాక్టర్ వెంకటసుబ్బయ్య

'ఉపాధి కూలీల సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చూస్తాం'


ఉపాధి కూలీలను విచారిస్తున్న నానాసాహెబ్

బనగానపల్లె: సాంకేతిక కారణాల వల్ల ఉపాధి కూలీలకు బ్యాంకుల్లో డబ్బు జమ కాకుంటే జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆంధ్రాబ్యాంకు ఫీల్డు ఆఫీసర్ నానా సాహెబ్ తెలిపారు. మండలంలోని యాగంటిపల్లె, ఎర్రగుడి గ్రామాల్లో ఆయన ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. 15 వారాల నుంచి 20 వారాల వరకు ఉపాధి కూలి ఖాతాల్లో జమ కాని కూలీలను విచారించారు. రోజు ఆయా గ్రామాల్లోని ఉపాధి కూలీలను విచారించి వారి ఖాతాల్లో కూలి జమయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నామని నానాసాహెబ్ తెలిపారు.

ఉపాధి కూలీల సమావేశం

ఉపాధి కూలీలకు కూలి డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఏపీవో ప్రతాప్ తెలిపారు. 2న చెర్వుపల్లె, పలుకూరు, 3న రామతీర్థం, బీరవోలు, 4న నందివర్గం, తిమ్మాపురం, 5న నందవరం, వెంకటాపురం, 7న యనకండ్ల, మీరాపురం, 9న పసుపుల, కృష్ణగిరి, 9న పాతపాడు, క్షైవ, 10న టంగుటూరు, అప్పలాపురం, 11న మిట్టపల్లె, బనగానపల్లె, 14న తమ్మడపల్లె, ఇల్లూరుకొత్తపేటలో బ్యాంకర్లు ఉపాధి కూలీలతో సమావేశమవుతారని చెప్పారు బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమకాని కూలీలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

రూ.80వేల విలువ చేసే కటింగ్ మిషన్ చోరీ

బేతంచెర్ల: బేతంచెర్ల-కర్నూలు రహదారిలో అయ్యలచెరువు ప్రాంతంలోని అలీ ఇంజనీరింగ్ వర్క్‌షాపు ముందు ఉంచిన నాపరాళ్ల ఎడ్జ్ కటింగ్ మిషన్‌ను సోమవారం రాత్రి దొంగలు చోరీ చేశారని, దాని విలువ రూ.80 వేలు ఉంటుందని యజమాని దూద్‌పీరా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిషన్‌ను ఉదయాన్నే తీసుకెళ్లానని ఫ్యాక్టరీ యజమాని చెప్పడంతో దాన్ని దుకాణం ముందు ఉంచి వెళ్లానని దూద్‌పీరా చెప్పారు.

'విద్యార్థులందరికీ యూనిఫాం'

కొలిమిగుండ్ల: విద్యార్థులందరికి యూనిఫాంలు పంపిణీ చేస్తామని ఎంఈవో శ్రీధర్‌రావు తెలిపారు. మండల పరిధిలో 8,720 మంది విద్యార్థులకు యూనిఫాంలు మంజూరయ్యాయన్నారు. బాలురు 2040, బాలికలు 2320 మంది పిల్లలకు ఒక్కొక్కరికి 2 జతల చొప్పున అందజేస్తామన్నారు.

లైసెన్స్ లేని ట్రాక్టర్ డ్రైవర్లకు జైలు శిక్ష

బనగానపల్లె: పట్టణానికి చెందిన ఏడుగురు లైసెన్స్ లేని ట్రాక్టరు డ్రైవర్లకు బనగానపల్లె సివిల్ జడ్జి లావణ్య జైలు శిక్ష విధించారు. ఇద్దరికి 10 రోజులు, ఐదుగురికి 7 రోజులు శిక్ష పడింది. లైసెన్స్ లేని డ్రైవర్ల వల్ల కొన్ని ప్రమాదాలు జరుగుతున్నందు వల్ల వారిపై కేసులు నమోదు చేస్తున్నామని ఎస్ఐ రాకేష్ తెలిపారు.

సిద్ధేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణకు విరాళం


ఆలయ ధర్మకర్త కృష్ణారెడ్డికి విరాళం అందచేస్తున్న దాతలు

కోవెలకుంట్ల: పట్టణంలోని సిద్ధేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణకు మంగళవారంపలువురు దాతలు విరాళాలు అందచేశారు. పట్టణానికి చెందిన ముక్కర్ల పుల్లారెడ్డి ఆయన భార్య ఉమాదేవి రూ.10వేలు, కుమ్మరి సత్యనారాయణ రూ.5,016, అప్పపోగు వెంకటపతి రూ.5.016, అజ్ఞాత భక్తుడు రూ.5వేలను ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కృష్ణారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, షరీఫ్, శివుడు, సూరి పాల్గొన్నారు.

'కార్మికులు పోరాటానికి సిద్ధం కావాలి'

బేతంచెర్ల: కార్మిక వ్యవస్థను దెబ్బతీసే విధానాలకు వ్యతిరేకంగా కార్మికులంతా పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం మద్దిలేటి స్వామి క్షేత్రంలో కార్మికులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో వారు మాట్లాడారు. 1992లో అప్పటి ప్రధాని పీవీ దేశంలో నూతన సరళీకరణ ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టారని, అప్పట్నుంచి దేశంలో పెట్టుబడి దారి వ్యవస్థ మరింత బలపడి కార్మిక చట్టాలు నిర్వీర్య మయ్యాయని చెప్పారు. ప్రస్తుతం దేశంలో జీఎస్టీ వల్ల ధనవంతులకు 25 శాతం కడితే మిగతా 75 శాతం ప్రజలపై పరోక్షంగా భారం పడుతుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి మద్దయ్య, మండల కార్యదర్శి వేణుగోపాల్, హమాలీ బాలయ్య, హుస్సేన్, రేగుమాను చిన్నసుబ్బయ్య, వెంకటరమణ, రాజబాబు, ఎల్లయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

'బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం'

డోన్(రూరల్): పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుగుణమ్మ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మ హోటల్ సర్కిల్ ప్రాంతం నుంచి శేగు థియేటర్ మీదుగా పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని చిగురుమానుపేట ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రంగమ్మ ప్రారంభించారు. అంగన్‌వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

డోన్ సినిమాలు

రాజా : గౌతమ్‌నంద
శ్రీరామ : ఫిదా
రాఘవేంద్ర: రాక్షసి
శ్రీనివాస : నిన్నుకోరి

కాటేసిన కరువు

- వర్షాభావంతో దుర్భిక్ష పరిస్థితులు
- ఖరీఫ్ పెట్టుబడి నేలపాలు
- అన్నదాతకు తీరని నష్టం
- డోన్, ప్యాపిలిలో అత్యల్ప వర్షపాతం నమోదు

డోన్: కరువు రక్కసి.. ఖరీఫ్‌ను కాటేసింది. వర్షాభావంతో.. తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. పంట వాడిపోయి.. పెట్టుబడి నేలపాలైంది. అన్నదాతకు తీరని నష్టం మిగిలింది. జూలై మాసంలో అత్యల్ప వర్షపాతం నమోదు కావడంతో.. కరువు ఛాయలు అలుముకున్నాయి. డోన్ మండలంలో 23,500 హెక్టార్లలో వేరుశనగ, కంది, ఆముదం, పత్తి తదితర పంటలను సాగు చేశారు. ప్యాపిలి మండలంలో 20వేల హెక్టార్లకుపైగా వివిధ పంటలను సాగు చేశారు. అయితే వర్షాభావం వలన ఖరీఫ్‌పై రైతులు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి.




ఎండిన కంది పంటను చూసి దిగాలుగా కూర్చున్న రైతు, ఎండిన వేరుశనగ పంట

ఆరంభంలోనే దుర్భిక్షం

ఖరీఫ్ ఆరంభంలో నే.. దుర్భిక్ష పరిస్థితులు తలెత్తాయి. వరుణుడు ముఖం చాటేయడంతో.. ఖరీఫ్ పంటలపై ప్రభావం చూపింది. డోన్ ప్రాంతంలోని రైతులు కేవలం వర్షాధారం మీద ఆధారపడి పంటలను సాగు చేశారు వర్షాలు లేకపోవడంతో పంటలన్నీ వాడిపోయాయి.

పెట్టుబడి నేలపాలు

ఖరీఫ్ ప్రారంభంలో పదును వర్షాలకు రైతులు ఎంతో ఆశతో పంటలను సాగు చేశారు. వేరుశనగ పంట సాగుకు ఎకరాకు రూ.15వేల వరకు ఖర్చు చేశారు. కందికి ఎకరాకు రూ.8వేలు, ఆముదం పంటకు రూ.10 వేల వరకు ఖర్చు చేశారు. ఇలా డోన్, ప్యాపిలి మండలాల్లో రూ.కోట్లు పెట్టుబడులు పెట్టారు. అయితే కరువు పరిస్థితులతో.. వేసిన పంటలు పోయాయి. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు నేలపాలవుతున్నాయి.

అత్యల్ప వర్షపాతం నమోదు

జూలై మాసంలో అత్యల్ప వర్షపాతం నమోదైంది. డోన్ మండలంలో జూలై నెలలో సాధారణ వర్షపాతం 85.70 ఎంఎంకాగా, కేవలం 43.2ఎంఎం మాత్రమే వర్షపాతం నమోదైంది. ప్యాపిలి మండలంలో సాధారణ వర్షపాతం 113.80ఎంఎం కాగా కేవలం 39.7 ఎంఎం వర్షపాతం నమోదైంది.

ఇక ప్రత్యామ్నాయ పంటలే దిక్కు

డోన్, ప్యాపిలి మండలాల్లోని రైతులు ఇక ప్రత్యామ్నాయ పంటలే దిక్కయ్యాయి. జూలై మాసం ముగియడంతో ఇక ప్రధాన పంటలు సాగు చేయడానికి వీలు లేకుండా పోయింది. దీంతో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జొన్న, కొర్ర, సజ్జ తదితర పంటలు సాగు చేసుకునే రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచేలా వ్యవసాయ శాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

బర్రెకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపిన ఏఐవైఎఫ్ నాయకులు

డోన్(రూరల్): డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం బర్రెకు వినతిపత్రం అందజేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి పులిశేఖర్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నా, రనత్‌యాదవ్, బాలక్రిష్ణ, ఈశ్వర్, రాజశేఖర్, హరికాంత్ పాల్గొన్నారు.



బర్రెకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

'డోన్‌ను కరువు మండలంగా ప్రకటించాలి'

డోన్(రూరల్): డోన్ ప్రాంతంలో వర్షాభావం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, డోన్‌ను కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో కర్నూలు ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రంగ నాయుడు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా వర్షాలు పడకపోవడంతో రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు సుంకయ్య, నక్కిశ్రీకాంత్, మోటా రాముడు పాల్గొన్నారు.

హాస్టల్ వసతి కల్పించాలి : ఏఐఎస్ఎఫ్

డోన్(రూరల్): ఆదర్శ పాఠశాలకు అనుబంధంగా హాస్టల్ వసతి కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి శివన్న డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ సమీపంలోని ఆదర్శపాఠశాల ఎదుట విద్యార్థులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శివన్న మాట్లాడుతూ హాస్టల్ భవనం పూర్తయి రెండేళ్లు అవుతున్నా దానిని ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను గురవుతున్నారన్నారు. వెంటనే హాస్టల్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు మహేష్, సుమంత్, కిరణ్, మధు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు ఉద్యమించాలి: ఎస్ఎఫ్ఐ

డోన్(రూరల్): విద్యారంగ పరిరక్షణ కోసం విద్యార్థులు ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నూర్ మహమ్మద్ పిలుపునిచ్చారు. మంగళవారం డోన్ పట్టణంలో ఎస్ఎఫ్ఐ 41వ జిల్లా ప్లీనరీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన బహిరంగ సభనుద్దేశించి నూర్‌మహమ్మద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు గాలికి వదిలేశాయని ధ్వజమెత్తారు. విద్యారంగ వ్యవస్థను కార్పొరేట్ పరం చేయడానికి చూస్తే సహించమని, ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నియోజకవర్గ కార్యదర్శి శివశంకర్, జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, మాజీ ఎస్ఎఫ్ఐ సీనియర్ నాయకులు గౌస్‌దేశాయ్, జిల్లా నాయకులు శివ, రవి, సు రేంద్ర, ప్రకాష్, నాగరాజు, అక్బర్, సురేష్, మధుశంకర్, చిన్నా పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న నూర్‌మహమ్మద్

విద్యార్థికి సన్మానం

డోన్: పట్టణంలోని రోటరీ భవన్‌లో పట్టణానికి చెందిన సురేంద్రనాథ్ అనే విద్యార్థికి సన్మానం కార్యక్రమం జరిగింది. రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శు లు సత్యసేనారెడ్డి, రాజయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించా రు. సురేంద్రనాథ్ ఇటీవల ఛార్టెడ్ అకౌంట్స్ పూర్తి చేసిన సందర్భంగా ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. అనంతరం సురేంద్రనాథ్ పుట్టిన రోజు వేడుకలను కూడా చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ స భ్యులు రాజావిజయ్‌కుమార్, జగన్మోహన్, పి.వి.రంగయ్య, ఎస్.వి. సుబ్బయ్య, ఎస్.ఎండీ రఫి, క్రిష్ణకిషోర్, పుల్లారెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, సంగీతరావు, ధర్మవరం చంద్రశేఖర్‌రెడ్డి, ఓబయ్య, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాల మేరకే భూమి స్వాధీనం

దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

ప్యాపిలి: కోర్టు ఆదేశాల మేరకే భూమి స్వాధీనం చేసుకోనున్నట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆనంద్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఓబులదేవరపల్లి లక్ష్మినరసింహస్వామి ఆలయానికి చెందిన ఇనాం భూమిని నాలుగేళ్ల క్రితం విక్రయించారు. దీంతో గ్రామస్థులు స్వామి భూమి ఆలయానికే చెందాలని కోర్టుకు వెళ్లారు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు భూ మిని స్వాధీనం చేసుకోవడానికి దేవాదాయ శాఖాధికారులు మంగళవారం గ్రామానికి వచ్చారు. అయితే భూమి కొనుగోలు చేసిన రైతు జయరాముడు హైకోర్టుకు వెళ్లి స్టే తీసుకవచ్చారు. ఈ స్టే ఆర్డర్‌ను పరిశీలించి దేవాదాయ శాఖ అధికారులు భూమిని స్వాధీనం చేసుకోకుండా వెనుదిరిగి వెళ్లారు. అంతకుముందు అసిస్టెంట్ కమిషనర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఆలయానికి సంబంధించిన ఇనాం భూమి దాదాపు 13ఎకరాలను ఇనాం దారుడు విక్రయించాడన్నారు. ఈ వివాదం నాలుగేళ్లుగా తారాస్థాయికి చేరిందన్నారు. కోర్టు ఆదేశాల మేరకు తాము భూ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. నెలరోజుల వరకు భూమి స్వాధీనం చేసుకోకుండా కోర్టు స్టే ఇచ్చిందని, వచ్చే నెలలో భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. ఆయన వెంట దేవాదాయ శాఖా ధికారులు సుధాకర్ రెడ్డి, ప్రసాద్, గురురెడ్డి, నాగిరెడ్డి, శోభా ఉన్నారు.

'తట్టు, రుబెల్లాపై అప్రమత్తంగా ఉండాలి'

డోన్: తట్టు, రుబెల్లా వ్యాధులపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణాధికారి క్రిష్ణమోహన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఒనైరో స్కూల్ విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సినేషన్ వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నెలల వయసు నుంచి 15ఏళ్ల వయసు ఉన్న పిల్లలందరికీ ఈ వ్యాక్సిన్‌ను వేయించాలన్నారు. కార్యక్రమంలో ఒనైరో స్కూల్ ప్రిన్సిపాల్ అర్చనచౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసేలా చర్యలు తీసుకుంటామని ఎంఈవో ఇందిరా అన్నారు. మంగళవారం మండలంలోని బోయినపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య సిబ్బందితో వ్యాక్సిన్ వేయించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రిష్ణగిరి: ఎంఆర్ వ్యాక్సిన్‌ను 9 నెలల నుంచి 15ఏళ్ల వయసు ఉన్న పిల్లలందరికీ తప్పకవేయించాలని తహసీల్దార్ రామసుబ్బయ్య, ఎంఈవో రా మ్మోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని కంభాలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో పిల్లలకు మండల వైద్యాధికారి మహేష్ ఆధ్వర్యంలో ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మద్దిలేటి పాల్గొన్నారు.



చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ప్యాపిలి: ఎంఆర్ వ్యాక్సిన్‌తో వ్యాధులు దరిచేరవని ప్యాపిలి, జలదర్గం వైద్యాధికారులు చెన్నకేశవులు, అబ్దుల్‌అమీద్ అన్నారు. మండలంలోని ప్యాపిలి, జలదుర్గం గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఆయా ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేశారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత'

డోన్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని డోన్ ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు శారదేవి, కార్యదర్శి రజని అన్నారు. మంగళవారం పట్టణంలోని అభ్యుదయ మహిళా జూనియర్ కళాశాలకు ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద చెత్త బుట్టలను అందజేశారు. ఈ సందర్భంగా శారదేవి, రజని మాట్లాడారు. క్లబ్ సభ్యురాలు సుజాత, కృష్ణవేణమ్మ, సూర్యకుమారి, విమలమ్మ, ప్రేమావతి, మంజుప్రియ పాల్గొన్నారు.

'డంపింగ్ యార్డు పనులు పూర్తి చేయండి'

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని నక్కలతిప్ప వద్ద ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డు పెండింగ్ పనులను పూర్తి చేయాలని డీపీవో పార్వతి అన్నారు. మంగళవారం ఆమె డంపింగ్ యార్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డంపింగ్ యార్డులో కరెంటు, నీటి వసతిని ఏర్పాటు చేయాలన్నారు. ఆమె వెంట ఈవో ఫకృద్దీన్, గ్రామ నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి దిన పత్రిక కావలసిన వారు
ఈ సెల్ నెంబర్లను సంప్రదించగలరు.
ఎస్.ఆర్. 9985460577,
డోన్‌టౌన్ ఏజెంటు 8522869939, కొండపేట ఏజెంటు 9000690458



నగరంలో నేడు విద్యుత్‌కోత

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలో సాధారణ ఫీడర్ల (విద్యుత్ వైర్లు) స్థానంలో కవర్డ్ కండక్టర్ మార్చుతున్నందు వల్ల బుధవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ తిరుపతిరావు, ఏడీఈ రంగస్వామి మంగళవారం తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కృష్ణానగర్, అబ్బాస్‌నగర్, తారక రామానగర్, రవీంద్రపాఠశాల, మూర్తి టిఫిన్ సెంటర్, ఆదిత్యనగర్, విఠలనగర్, మయూరి రెసిడెన్సీ, న్యూకృష్ణానగర్, సర్వేపల్లి పాఠశాల ప్రాంతాల్లో విద్యుత్ కోత వుంటుందని వారు తెలిపారు.

అపరిశుభ్ర నగర్

● పూడిపోయిన డ్రైన్‌లు ● రోడ్ల పారుతున్న మురుగునీరు
● వెలగని వీధి దీపాలు ● అరుణానగర్‌లో ఇబ్బంది పడుతున్న ప్రజలు

కర్నూలు(కార్పొరేషన్)
నగర పరిధిలోని గుత్తి రహదారిలో ఉన్న అరుణా నగర్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. ఈ కాలనీ ఏర్పడి సుమారు 15 సంవత్సరాలవుతోంది. ఇప్పటికీ కనీస సౌకర్యాల కల్పన గురించి అధికారులు పట్టించుకోలేదు. పలువీధుల్లో సీసీ రోడ్లు లేవు. వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. ప్రధాన మురుగునీటి కాలువ పూడికతో నిండి మూసుకుపోయింది. దీంతో మూడు నెలలుగా మురుగునీరు పిల్లకాలువలా రోడ్లపై పారుతోంది. ఈ మురుగునీరు జాతీయ రహదారి వెంట ఫర్లాంగు దూరం మేర నిలిచి పోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. హైవే పక్కన సర్వీస్ రోడ్డుపై వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిపూట దోమలు విజృంభించడంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయని, పందుల సంచారం అధికమైందని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలోని ఖాళీ ప్లాట్లలో కంప చెట్లు పెరిగి అందులో మురుగు నిల్వ ఉంటోందని, అక్కడి నుంచి పాములు రాత్రి పూట ఇళ్లలోకి వస్తున్నాయని కాలనీ వాసులు తెలిపారు. శివారు కాలనీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా నిధులు ఎక్కడ ఖర్చు చేస్తున్నారో తెలియడం లేదని కాలనీ ప్రజలు విమర్శిస్తున్నారు.

డ్రైన్‌లలో పూడిక తొలగించాలి



కాలనీలోని డ్రైన్‌లు, వ్యర్థాలు, మట్టితో నిండిపోయాయి. దీంతో మురుగు ముందుకు పారడం లేదు. రోడ్లపైకి వస్తోంది. ప్రధాన వీధుల్లో మురుకునీరు నిల్వ ఉండి దుర్గంధం ప్రబలుతోంది. వీధి లైట్లు వెలగడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కుళాయిలకు రెండు రోజులకొకసారి నీరు వస్తోంది.
- నాగేశ్వరరావు (కాలనీవాసి)



సర్వీస్ రోడ్డులో మురుగునీరు



రోడ్డు పక్కన పేరుకుపోయిన బురద

సీసీ రోడ్లు నిర్మించాలి



కాలనీలో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించాలి. అలాగే మురుగు కాలువల్లో పూడిక తొలగించాలి. వీధి లైట్లు వెలగక రాత్రిపూట అంధకారంలో ఇబ్బంది పడుతున్నాం. ఖాళీ స్థలాల్లో కంపచెట్లు, ప్రధాన వీధిలో నిలిచివున్న మురుగునీరు తొలగించాలి.
- హుస్సేన్ బాషా (కాలనీవాసి)

'టీకాతో వ్యాధి నివారణ'

కర్నూలు(రూరల్): తట్టు, రుబెల్లా వ్యాధి ప్రబలకుండా టీకాతో శాశ్వతంగా నివారించ వచ్చని కర్నూలు తాలూకా సీఐ మహేశ్వర రెడ్డి తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ కర్నూలు ఫోర్టు అధ్యక్షుడు డాక్టర్ నాగభూషణం ఆధ్వర్యంలో కర్నూలు మండలం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు డాక్టర్ సతీష్ చేతుల మీదుగా టీకాలు వేయించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టీకాలు గ్రామంలో చిన్న పిల్లలకు ప్రతి తల్లిదండ్రులు వేయించేలా శ్రద్ధ వహించాలన్నారు. డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ నాగరాజు, సుబ్బరాయుడు, మురళీకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం సుజాత పాల్గొన్నారు.

సీ క్యాంప్ రైతు బజార్

మంగళవారం ధరలు (కిలో.. రూ.)

టమోటా	50
వంకాయ	36
బెండ	20
పచ్చిమిర్చి	40-46
కాకర	22
బీర	14
క్యాలీఫ్లవర్	36
క్యారెట్	64
క్యాబేజీ	24
బీన్స్	50
దొండ	28
ఆలు	20
ఉల్లి	12
చౌలేకాయలు	18
సొరకాయ	10
బుడంకాయ	10
దోసకాయ	14
చిక్కుడు	36
బీట్‌రూట్	36
ముల్లంగి	28
సీమవంకాయ	30
మునగ(1)	2
నిమ్మ(1)	2
అల్లం	60
చామ	36
క్యాప్సికం	46
ఎర్రమిర్చి	42

- కర్నూలు(అగ్రికల్చర్)

రేపు ఉపాధ్యాయుల ధర్నా

కర్నూలు(ఎడ్యుకేషన్): మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నట్లు సమాఖ్య నాయకులు సర్వేశ్వరరెడ్డి, రాముడు, కమాల్‌బాషా, ప్రసాద్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుర పాలక పాఠశాలల్లో అన్ని తరగతులకు తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని, ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్‌కు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఉన్న అసంబద్ధ విధానాలు సవరించాలని డిమాండ్ చేశారు. అప్‌గ్రేడేషన్ అయిన పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు.

'వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేయాలి'

రాయలసీమ యూనివర్సిటీలో చేపట్టిన తాత్కాలిక నోటిఫికేషన్ నియామకాలను రద్దు చేయాలన్న హైకోర్టు తీర్పు అమలు చేయని వైస్‌చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌పై కోర్టు ధిక్కారం కేసు నమోదు చేయాలని రాయలసీమ పరిరక్షణ సమితి విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీరాములు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్తవారికి అనుకూలంగా కోర్టులో పిల్ వేసి నిధులను వృథా చేస్తున్నారని అన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

కర్నూలు: తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో దిన్నెదేవరపాడు గ్రామంలో వారం రోజుల కిందట జరిగిన హత్య కేసులో నిందితున్ని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సురేష్ అనే వ్యక్తిని ఆటోతో ఢీ కొట్టి హత్య చేసిన కేసులో నిందితుడు మాదన్నను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

నేడు బస్సుల్లో ఖాళీ సీట్ల వివరాలు

రూటు	ఏ/సీ బస్సుల్లో		నాన్ ఏ/సీ బస్సుల్లో	
	పగలు	రాత్రి	పగలు	రాత్రి
హైదరాబాద్	109	36	250	171
బెంగళూరు	36	35	204	186
చెన్నై	0	59	67	34
విజయవాడ	0	0	261	155

రిజర్వేషన్ కోసం సెల్: 9959225826 (కర్నూలు రూరల్)

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సినవారు
ఈ సెల్ నెంబర్లను సంప్రదించగలరు



కర్నూలు ఏసీవో సెల్: 9985411379
కర్నూలు ఎస్ఆర్ సెల్: 9985460688

ముద్రగడ పాదయాత్రకు అనుమతి ఇవ్వాలి

● బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రంశెట్టి

కర్నూలు(కార్పొరేషన్): కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం గురువారం నుంచి చేపడుతున్న పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రంశెట్టి నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి ఈ మేరకు స్థానిక పాత బస్టాండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట జిల్లా బలిజ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బలిజలను బీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ముద్రగడ పాదయాత్రకు అనుమతి ఇవ్వక పోతే రాష్ట్ర వ్యాప్తంగా కాపుజాతి ఏకమై ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బలిజ సంఘం నగర అధ్యక్షుడు డాక్టర్ విజయశంకర్, నాయకులు చింతారామకృష్ణ, నరసింహారెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన

'సమస్యలు పరిష్కరించండి'

కర్నూలు(కార్పొరేషన్): నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు పులగం మద్దిలేటి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప కోరారు. మంగళవారం ఈ మేరకు డిప్యూటీ కమిషనర్ పాండురంగారావుకు వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2015 జూలైలో రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మె కాలం జీతం బిల్లులు తక్షణం ట్రెజరీ కార్యాలయానికి పంపాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు రామకృష్ణారెడ్డి, కార్మిక నాయకులు తిమోతీ, నాగరాజు, ఎల్లప్ప ఉన్నారు.



డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రకృతి వ్యవసాయం అనుసరించండి: ఏవో



రైతుమిత్ర సభ్యులతో మాట్లాడుతున్న విజయకుమార్

కల్లూరు: రైతులు పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారుడు టి.విజయకుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని తడకనపల్లె, చిన్నటేకూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఏడీఏ రమణారెడ్డి, కల్లూరు ఏవో అనీల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సేంద్రియ విధానం అమలవుతున్న పంట పొలాలను సందర్శించారు. రైతుల వద్దకు చేరుకుని సాగు విధానాలు తెలుసుకున్నారు. అనంతరం రైతుమిత్ర సభ్యులతో సమావేశమై పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయ విధానాలను, మెలకువల పట్ల అవగాహన కల్పించారు.

'జరిమానా ఆర్టీవోలోనే చెల్లిస్తాం'

కర్నూలు(సి.క్యాంప్): ఆటో కార్మికులపై ఆర్టీఏ అధికారులు విధిస్తున్న జరిమానాలు కార్యాలయంలోనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు కృష్ణ, కార్యదర్శి ఈశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జరిమానా సొమ్ము ఆర్‌టీఏ కార్యాలయంలో చలానా రూపంలో జమ చేసుకునేవారని, ఇప్పుడు కోర్టులో కట్టాల్సి వస్తే ప్రత్యేకంగా న్యాయవాదిని నియమించుకోవాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివ పాల్గొన్నారు.

కాగితాలపై.. విస్తరణ

● ఇరుకు దారుల్లో నగరవాసుల నరకయాతన ● నిత్యం ప్రమాదాలు ● నిద్రావస్థలో అధికారులు

కర్నూలు(కార్పొరేషన్): నగరం శరవేగంగా విస్తరిస్తోంది. కానీ నలభై ఏళ్ల క్రితం ఏర్పడిన దారుల్లోనే వెళ్లాల్సిన పరిస్థితి. రోడ్ల విస్తరణ జరగడం లేదు. దశాబ్దాలుగా ఇరుకు రోడ్లతో ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌గా స్థాయి పెరిగి 23 సంవత్సరాలు దాటినా ఆ స్థాయిలో రహదారి వ్యవస్థ మెరుగుపడలేదు. 1994లో 3 లక్షల జనాభా ఉన్నప్పుడు ఉన్న రహదారులే నేటికీ ఉన్నాయి. ప్రస్తుతం నగర జనాభా 6


ఇరుకుగా మారిన వీధులు


వాహనాలు ఎదురొస్తే ఇలా..

లక్షలు దాటింది. అయినా నగరంలో రహదారి సౌకర్యాలు జనాభాకు తగినట్లుగా లేవు.

అరకొర అభివృద్ధి

నగరంలో రోడ్ల విస్తరణకు 2014లోనే ప్రణాళికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. ఇప్పటి వరకు రాజ్‌విహార్ కూడలి నుంచి విశ్వేశ్వరయ్య సర్కిల్ వరకు 120 అడుగుల రహదారి విస్తరణ పూర్తయ్యింది.

● విశ్వేశ్వరయ్య కూడలి నుంచి సీ క్యాంప్ వరకు రోడ్ల విస్తరణ జరగలేదు. అయితే సీ క్యాంప్ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు, అలాగే విశ్వేశ్వరయ్య సర్కిల్ నుంచి బిర్లాగేటు వరకు పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

● సుంకేసుల రోడ్డు విస్తరణ పనులు 2 సంవత్సరాల నుంచి మొదలుకాకపోగా ఐదు రోడ్ల కూడలి నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్ల విస్తరణ అసంపూర్తిగా ఉంది.

● వైద్య కళాశాల సమీపంలో కొన్ని దుఖానాలు తొలగించలేదు. వీరికి సీ క్యాంప్ రైతు బజారు వద్ద ప్రత్యామ్నాయ దుకాణాలు నిర్మిస్తున్నారు. అవి పూర్తయితే తప్ప రహదారి విస్తరించే అవకాశం లేదు.

● కల్లూరు దర్వాజా నుంచి వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వరకు రోడ్ల విస్తరణలో ఆస్తులు కోల్పోయిన వారికి రూ.78 లక్షలు పరిహారం అందించారు.

ప్రతిపాదనల దశలోనే ఆగిపోయిన పనులు: రహదారుల విస్తరణకు ప్రణాళికలు రూపొందించినా అవి ప్రతిపాదనల దిశలోనే ఆగిపోయాయి. ప్రధానంగా పాతబస్తీలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇక్కడి రోడ్లు అభివృద్ధి చేయాలని పలుమార్లు ప్రతిపాదనలు వచ్చినా కార్యరూపం దాల్చలేదు.

● కాంగ్రెస్ కార్యాలయ కూడలి నుంచి నెహ్రూ రోడ్డు మీదుగా చౌక్‌బజారు వరకు ఉన్న 30 అడుగుల రోడ్లను 60 అడుగులకు పెంచాలని చేయాలని ప్రతిపాదించారు.

● పాతబస్టాండ్ నుంచి కింగ్ మార్కెట్ వరకు 25 అడుగుల రహదారిని 60 అడుగులకు పెంచాల్సి ఉంది.

● కిడ్స్‌వరల్డ్ నుంచి పూలబజార్, లాల్‌మసీదు, మండి బజార్ మీదుగా 40 అడుగుల రోడ్లను 60 అడుగులుగా విస్తరించాల్సి ఉంది. ఈ రహదారులన్నీ వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలకు అత్యంత కీలకమైనవి. ఇవి నిత్యం ఎంత రద్దీగా ఉంటాయి. వీటిని విస్తరించాలి.

● కల్లూరు దర్వాజ నుంచి బుధవారపేట నూతన వంతెన మీదుగా కలెక్టరేట్ వరకు 25 అడుగుల రహదారిని 60 అడుగులుగా విస్తరించాలని ప్రతిపాదన ఉంది. పని పూర్తయితే చాలా ప్రాంతలకు దూరం తగ్గుతుంది. రాజ్‌విహార్ కూడలి ట్రాఫిక్ రద్దీ కూడా తగ్గుతుంది.

● ఉస్మానియా కళాశాల నుంచి కిడ్స్ వరల్డ్ వరకు 25 అడుగుల రహదారి 40 అడుగులుగా విస్తరించాల్సి ఉంది.

రోడ్ల విస్తరణ చేపట్టాలి



పాతబస్తీలో నా చిన్నప్పటి నుంచి అవే రహదారులు ఉన్నాయి. జనాభా విపరీతంగా పెరిగింది. వాహనాలు ఎక్కువయ్యాయి. ఇరుకు రహదారుల్లో రాకపోకలకు చాలా ఇబ్బంది కలుగుతోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్ల విస్తరణ చేపట్టాలి.

- ఎం.ప్రసాద్, పాతబస్తీ

నూతన రహదారులు అవసరం..

నగరంలో ట్రాఫిక్ సమస్యలు అధికమయ్యాయి. ఇరుకు దారుల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రద్దీ నియంత్రణకు నూతన రహదారులు ఏర్పాటు చేయాలి. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలి. విస్తరణకు అధికారులు, నాయకులు వెంటనే చర్యలు చేపట్టాలి.

- ఎస్.శివానంద్, నగరవాసి

40 సంవత్సరాల నాటి రోడ్లే..

మాస్టర్‌ప్లాన్ 1976లో భాగంగా నగరంలో దారులు ఏర్పాటు చేశారు. ప్రతి 20 ఏళ్లకోసారి మాస్టర్ ప్లాన్‌ను సమీక్షించాలి. కానీ 40 సంవత్సరాలు దాటినా విస్తరణ ఊసేలేదు. ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు, అధికారుల ఆలోచనలకు అనుగుణంగా ఎవరికి తోచిన విధంగా వారు, ఎక్కడపడితే అక్కడ విస్తరణ పనులు చేపడుతున్నారు. గతంలో నిపుణుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి నగరంలో అత్యంత రద్దీ, ప్రజా రవాణా అధికంగా ఉండే రహదారులను విస్తరించాలని సూచించింది. వీటిని పకడ్బందీగా అమలు చేస్తే దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయని పేర్కొంది. ఈ సూచనలను కాగితాలకే పరిమితం చేశారు.





నిత్యం ఇలా ప్రమాదాలు.. ట్రాఫిక్ జామ్‌లు..

రైతులను ఆదుకునే అవకాశమిది: ఏడీ

కర్నూలు(అగ్రికల్చర్): కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు అవకాశం వచ్చిందని భావించి పనిచేయాలని వ్యవసాయశాఖ యంత్రాంగానికి అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ పిలుపునిచ్చారు. భూ సంరక్షణ శాఖ పీడీగా పనిచేస్తున్న గణపతి మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏడీ హాజరయ్యారు. రిటైర్ అయిన డీడీ గణపతిని పలువురు అధికారులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జేడీ నాగవేలు, ఏడీఏలు రామునాయక్ వెంకటేశ్వరరెడ్డి, ఎంఏవోలు అశోక్‌కుమార్‌రెడ్డి, రవి ప్రకాశ్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్పస్ ఫండ్ చెక్కుల అందజేత

కర్నూలు: గుండెపోటుతో మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు కార్పస్ ఫండ్ చెక్కులను ఎస్పీ గోపినాథ్ జెట్టీ అందించారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో కార్పస్ ఫండ్ కింద వచ్చి రూ.40 వేల చెక్కులను మహబూబ్ ఉన్నీసా, హుస్సేన్‌బీకి మంగళవారం అందిం చారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కుమారిదేవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ

నారాయణ స్కూల్‌లో న్యూట్రిషన్ డే

కర్నూలు(ఎడ్యుకేషన్): గాయత్రి ఎస్టేట్‌లోని నారాయణ పాఠశాలలో మంగళవారం ఈ-కిడ్స్ విద్యార్థులు న్యూట్రిషన్ డే నిర్వహించారు. పోషకాహారం గురించి ఛాయా చిత్రాలు, బొమ్మల ద్వారా ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. వివిధ రకాల కూరగాయలు, ఫలాల చిత్రాలను చిన్నారులు ప్రదర్శించారు. ఆహారం తీసుకోకుండా చిన్నారులు మారం చేస్తారని, వారికి పౌష్టికాహారం పట్ల ఆసక్తి కలిగించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు పాఠశాల ఈడీ కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలగకు పోషకాహారం చాలా అవసరమని ప్రిన్సిపాల్ నాగమల్లిక అన్నారు. కార్యక్రమంలో డీన్ రమేష్ రెడ్డి, ఏజీఎం శ్రీకాంత్ రెడ్డి, ప్రోగ్రాం ఇన్‌చార్జి పెట్రీషియా, వైస్ ప్రిన్సిపాల్ శిరీష తదితరులు పాల్గొన్నారు.


న్యూట్రిషన్ డేలో పాల్గొన్న చిన్నారులు, ఉపాధ్యాయులు

సూర్జిత్ ఆశయాలు సాధిద్దాం: సీపీఎం

కర్నూలు(సీ.క్యాంప్): హరికిషన్ సింగ్ సూర్జిత్ ఆశయాలను సాధించాలని సీపీఎం నగర కార్యదర్శి గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని పాతబస్తీలో సూర్జిత్ భవన్‌లో ఆయన 9వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ కాంగ్రెసేతర ప్రభుత్వాలు కేంద్రంలో ఏర్పడటానికి కీలక సూత్రధారి సూర్జిత్ అన్నారు. జాతీయోద్యమంలో బ్రిటీష్ జెండా దింపి జాతీయ జెండా ఎగురవేసిన వీరుడని సూర్జిత్‌సింగ్ ధైర్య సాహసాలను కొనియాడారన్నారు. సీపీఎం నాయకులు షరీఫ్, రాజగోపాల్, అబ్దుల్లా, పార్వతమ్మ పాల్గొన్నారు.

బార్ ఏర్పాటు వద్దని సంతకాల సేకరణ

కల్లూరు: నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ వద్ద బార్‌షాపును ఏర్పాటు చేయవద్దని ఐద్వా, సీఐటీయూ నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐద్వా డివిజన్ కార్యదర్శి ప్రమీలమ్మ మాట్లాడుతూ దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, ఐద్వా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో బార్ ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. సీతమ్మ, శకుంతల, ఆటో యూనియన్ నాయకులు మాలిక్, శ్రీరాములు పాల్గొన్నారు.


ఐద్వా ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

'మచ్చలేని నేత చౌదరి'


కేక్‌కట్ చేస్తున్న నవీన్‌చౌదరి, సుమన్‌చౌదరి తదితరులు

కర్నూలు(కార్పొరేషన్): రాజకీయాల్లో మచ్చలేనినేత రాంభూపాల్ చౌదరి అని తెలుగు యువత రాష్ట్ర నాయకులు జంపాల మధుసూదన్‌రావు, టీడీపీ జిల్లా కార్యదర్శి ఆర్.సుశీలమ్మ అన్నారు. భూపాల్ కాంప్లెక్స్‌లో టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంభూపాల్‌చౌదరి 76వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. చౌదరి తనయులు నవీన్‌చౌదరి, సుమన్‌చౌదరి కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం రాంభూపాల్‌చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో దరూరి జేమ్స్, బాణాల రాజు, హరినాథ్‌గౌడ్, షఫీవుల్లా, దాసు పాల్గొన్నారు.



శివరామక్రిష్ణ నగర్‌లో సమస్యల తిష్ఠ

- అధ్వానంగా మారిన రహదారులు
- డ్రైనేజీ వ్యవస్థ లేక అవస్థలు
- పందులు స్వైర విహారం



రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

కల్లూరు: నగరంలోని శివరామ కృష్ణానగర్, న్యూ శ్రీనివాస నగర్‌లో సమస్యలు తిష్ట వేశాయి. 33వ వార్డులో ప్రధాన రహదారులు లేక కాలనీ వాసులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారు 20 సంవత్సరాలకు పైబడి కాలనీలు ఏర్పాటైనా నేటికి అభివృద్ధికి నోచుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. 33వ వార్డులోని గురుబ్రహ్మనగర్ వరకు డ్రైనేజీలు ఏర్పాటు చేసి అసంపూర్తిగా వదిలివేశారు. దీంతో డ్రైనేజీనీరు వచ్చి శివరామక్రిష్ణ నగర్, న్యూశ్రీనివాసనగర్‌లోని రోడ్లపై మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. ఇక్కడ చాలావరకు సీసీ రోడ్లు లేవు మట్టిదారుల్లో చెరువును తలపించే విధంగా నీరు నిలిచి ప్రయాణం నిత్యకష్టమవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైపులైన్ల కోసం గుంతలు తవ్వి అసంపూర్తిగా వదిలేశారు. ఇంటింటి చెత్త సేకరణ లేదు. చెత్తకుండీల ఊసేలేదు. దీంతో కాలనీవాసులు ఎక్కడ పడితే అక్కడ చెత్తపారవేస్తున్నారు. దీనికి తోడు వర్షం వచ్చిందంటే చాలు ఇళ్లలోకి నీరు చేరుతుంది.

పందులు, పాములు భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయని మహిళలు ఆరోపి స్తున్నారు. నగర పాలక సంస్థ, ప్రజాప్రతినిధులకు పలుసార్లు సమస్యలను తెలిపినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.

రోడ్లను బాగు చేయండి



దశాబ్దాల కాలం నుండి రోడ్లు సరిగాలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నగర పాలక అధికారులకు పలుమార్లు సమస్యను తెలిపినా ఫలితం శూన్యం. కల్లూరు పరిధిలోని వార్డు అయినందున అభివృద్ధి చేయడం లేదని ఆరోపించారు.

\- సురేష్, స్థానికుడు

డ్రైనేజీ, మరుగుదొడ్ల సమస్య వేదిస్తుంది



కాలనీలలో డ్రైనేజీలు, మహిళలకు మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది. వర్షాకాలం పందులు ఇళ్ల మధ్యచేరి బీభత్సం చేస్తున్నాయి. రాత్రి పాముల సంచారం ఎక్కువగా ఉంది. మహిళలు పొలాల్లోకి బహిర్భూమికి వెళ్లాల్సి వస్తుంది. తాగుబోతులు గతంలో మహిళలను వెంబడించారు.

\- పుష్పావతి, స్థానికురాలు

'తల్లిదండ్రుల కలలు సాకారం చేయండి'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాంప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని కర్నూ లు మెడికల్‌కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎస్ రామప్రసాద్ కొత్త వైద్యవిద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం 2017 ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం కొత్త వైద్యవిద్యార్థులకు న్యూలెక్చరర్స్ గ్యాలరీలో ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యవిద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యా రు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆసుపత్రి మీ జీవితంలో భాగం కావాలనీ, త్వరలో యోగా కేంద్రాన్ని కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీలో బైక్‌లను నియంత్రిస్తామనీ, ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలతో రాంగ్ సైడ్ ప్రయాణించరాదని సూచించారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందనీ, సమాజానికి సేవ చేసే ఈ వృత్తిలో కొనసాగటానికి మరింత కష్టపడాల్సిందిగా సూచించారు. ఇప్పటి వరకు కార్పొరేట్ కాలేజీలో చదివి మెరిట్‌తో ఇక్కడికి వచ్చారనీ, క్రమశిక్షణతో కూడిన విద్యతో రాణించవచ్చన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ 1975లో రెండు స్కూటర్లు, నాలుగు సైకిల్స్ మా బ్యాచ్‌లో ఉండేవని చెప్పారు.

తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లోనూ బైక్‌ను కొని ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉదయ్‌కుమార్, డాక్టర్ షారోన్, సోనియా, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ రంగనాథ్, డాకత్ర్ సూర్యప్రభ, వైద్యులు, వైద్య విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు స్కూల్ యూనిఫారాల పంపిణీ



వృద్ధులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

కర్నూలు (కల్చరల్): స్థానిక ప్రకాశ్‌నగర్‌లోని టంగుటూరి ప్రకాశం పంతులు నగర పాలక ఉన్నత పాఠశాల్లో మంగళవారం పేద విద్యార్థులకు స్కూల్ యూనిఫారాలు పంపిణీ చేశారు. ప్రజా వేదిక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ పాల్గొని, విద్యార్థులకు యూనిఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ సదస్సులో న్యాయమూర్తి సోమశేఖర్ మాట్లాడుతూ నమ్మైనారిటీ తీరని పిల్లలకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని చెప్పారు. విద్యార్థులు హక్కులు, బాధ్యతలు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యాహక్కు చట్టం - 2009 గురించి వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు, మహిళలకు, వికలాగులకు, రూ.లక్ష వారిక్షక ఆదాయం గల వారికి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కె.రాంపుల్లయ్య, రవిరాజు, ప్రజా వేదిక సంస్థ అధ్యక్షుడు తిమోతీ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నిరాశ్రయుల వసతి గృహాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి

స్థానిక అశోక్‌నగర్‌లోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ ఆకస్మిక తనిఖీచేశారు. వసతిగృహంలోని వృద్ధులను కలిసి వారికి కల్పిస్తున్న వసతుల గురించి వివరాలు సేకరించారు. అనంతరం రికార్డులను పరిశీలించి ఆశ్రమాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు డి.శ్రీనివాసులు (స్పెషల్ పీపీ, ఎస్సీ,ఎస్టీ), కె.రాంపుల్లయ్య, రవిరాజు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ నూతన కార్యవర్గం ఎన్నికల

కర్నూలు(కల్చరల్):విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కర్నూలు విభాగ్ పరిధిలో నూతన కార్యవర్గాన్ని నియమించారు. మంగళవారం స్థానిక నంద్యాల రోడ్డులోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనిలో ఉన్న వీహెచ్‌పీ కార్యాలయంలో వీహెచ్‌పీ పరివార్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కర్నూలు విభాగ్ (కర్నూలు, నంద్యాల)ను మరింత విస్తరించేలా చర్యలు తీసుకున్నారు. వీహెచ్‌పీ కర్నూలు విభాగ్ పరిధిలో కర్నూలు, నంద్యాలను జిల్లాలుగా పరిగణిస్తున్నారు. ఈ రెండు జిల్లాల స్థానంలో ఆదోని ప్రాంతాన్ని కూడా జిల్లాగా చేర్చి, కర్నూలు విభాగ్ పరిధిలో మూడు జిల్లాలను ఏర్పాటు చేస్తూ తీర్మానించారు. ఆయా జిల్లా కమిటీలకు నూతన అధ్యక్షులను ప్రకటించారు. కర్నూలు జిల్లా అధ్యక్షునిగా కే.క్రిష్ణన్న, గౌరవ అధ్యక్షుడిగా ఎస్.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా గుడా సుబ్రహ్మణ్యం ఎంపికయ్యారు. నంద్యాల జిల్లాకు అధ్యక్షులుగా విష్ణువర్దన్‌రెడ్డి, ఆదోని జిల్లా అధ్యక్షునిగా బసవన్నగౌడ్, గౌరవ అధ్యక్షునిగా వై.ప్రతాప్, కార్యదర్శి మారుతి మోహన్ ఎంపికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షునిగా సోమిశెట్టి వెంకట్రామయ్య, కర్నూలు విభాగ్ సహ సంపర్క ప్రముఖ్ ఏవీ ప్రసాద్ ఎంపికైనట్లు వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి ప్రకటించారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి వ్యాసరాజ్, రాష్ట్ర కోశాధికారులు సందడి మహేష్, పరమేష్, నగర అధ్యక్షులు డా.లక్కిరెడ్డి అమరసింహారెడ్డి, కార్యదర్శి మాళిగి భానుప్రకాష్, మాతృమండలి జిల్లా ప్రముఖ్ పార్వతమ్మ, రాష్ట్ర బజరంగదళ్ కన్వీనర్ టీ.ఎన్.వేదప్రకాష్ పాల్గొన్నారు.

4న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

కర్నూలు(రూరల్): కర్నూలు జిల్లా సంఘం అడ్‌హక్ కమిటి ఆధ్వర్యంలో యు-19 బాల, బాలికల జిల్లా స్థాయి చదరంగ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు అడ్‌హక్ కమిటి జిల్లా ఛైర్మన్ సత్యనారాయణ రావు మంగళవారం తెలిపారు. ఈ ఎంపిక పోటీలు నగరంలోని కిడ్స్ వరల్డ్ చెస్ అకాడమిలో ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తామన్నారు. చదరంగ క్రీడాకారులు 1998 జనవరి 1వ తేదీ ఆ తర్వాత పుట్టినవారు మాత్రమే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలు (2+2)ను ఎంపిక చేసి ఈనెల 7 నుండి 9వ తేదీ వరకు వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి చదరంగ పోటీలకు పంపనున్నట్లు ఆయన చెప్పారు. చదరంగ పోటీలు స్విస్‌లీగ్ పద్దతిలో నిర్వహిస్తామన్నారు. ప్రవేశ రుసుము రూ.100లు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9501800650 సెల్‌నెంబర్‌కు సంప్రదించవచ్చునన్నారు.

భాషా పండితుల పదోన్నతులు చేపట్టాలి



కర్నూలు(ఎడ్యుకేషన్): తెలుగు, హిందీ భాషా పండితుల పదోన్నతులు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఉపాధ్యాయ పండిత్ పరిషత్ డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి తాహేరా సుల్తానాకు ఉపాధ్యాయ పండిత్ పరిషత్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.నాగేంద్రుడు, కే.రఘు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఆర్‌సీ.నెంబర్ 247/ఈఎస్‌హెచ్ 1-8-2017న జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేసి తెలుగు, హిందీ పండితులకు పదోన్నతులు కల్పించాలన్నారు. గతంలో ఆర్‌సీ.నెంబర్ 190 ద్వారా 25.3.2017న ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా పదోన్నతులు జరపకపోవడంతో ప్రస్తుతం జరుగుతున్న బదిలీలలో డీఈఓ పూల్‌కు వెళ్లారు. ఇప్పటికైనా భాషాపండితుల పదోన్నతులు చేపట్టాలన్నారు. డీఈఓను కలిసిన వారిలో ఎపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు పాల్గొన్నారు.

5లోగా భాషా పండితుల పదోన్నతులు చేపట్టాలి

కర్నూలు(ఎడ్యుకేషన్): ఈనెల 5వ తేదీలోగా తెలుగు, హింది భాషా పండితుల పదోన్నతులు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్ష యోగీశ్వరరెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శులు వెంకటరమణ, వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చిన్నారుల చేత అమ్మవారికి జలాభిషేకం

కోడుమూరు: వర్షాలు అనుకూలించి రైతులను కాపాడాలని స్థానిక గంగమ్మ దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెస్త సంఘం ఆధ్వర్యంలో చిన్నారుల చేత గంగమ్మకు 116 బిందెలతో జలాభిషేకం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు డిష్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు లేక రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. వేసిన పంటలు ఎండిపోయి అన్నదాన ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వర్షాలు అనుకూలించాలని అమ్మవారికి పూజలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెస్త సంఘం నాయకులు క్రిష్ణ, శ్రీనివాసులు, నాగరాజు, రాజు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

తట్టు, రుబెల్లా వ్యాక్సిన్ వేయించుకోవాలి

డాక్టర్ నారాయణ ● పలుచోట్ల విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సినేషన్





విద్యార్థులకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ నారాయణ, కోడుమూరులో పిల్లలకు టీకాను వేస్తున్న డాక్టర్ ప్రకాశం

గూడూరు: విద్యార్థులు తట్టు, రుబెల్లా వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించుకోవాలని డాక్టర్ నారాయణ కోరారు. మంగళవారం గూడూరు జిల్లా పరిషత్ బాలురు, బాలికల పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సిన్‌ను విద్యార్థులకు వేయించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణ మాట్లాడుతూ గూడూరు మండలంలో 9 నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు దాదాపు 13 వేల మంది ఉన్నారని, వారందరికీ వ్యాక్సిన్ వేసే కార్యక్రమం ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సునీలమ్మ, సీహెచ్‌వో సత్యవతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడుమూరులో..

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఎమ్మార్ వ్యాక్సిన్ల కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం వైద్యాధికారి ప్రకాశం ప్రారంభించారు. తట్టు, రుబెల్లా వ్యాధులను ఒక్క టీకాతో దూరం చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యం బృందం డాక్టర్ రాజ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసయాదవ్, సిబ్బంది వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలి

కోడుమూరు(రూరల్): 9 నెలల నుంచి 15 సంవత్సరాల వరకు గల పిల్లలందరికీ తట్టు, రుబెల్లా వ్యాధి నివారణకు వ్యాక్సిన్‌ను తప్పకుండా వేయించాలని తల్లిదండ్రులకు ఎంఈవో అనంతయ్య సూచించారు. మంగళవారం వర్కూరు బీసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది ఎంఆర్ వ్యాక్సిన్‌లు వేశారు. వ్యాక్సినేషన్ సరళిని ఎంఈవో పరిశీలించారు. అర్హులైన పిల్లలందరికీ తప్పకుండా వ్యాక్సిన్ వేయించే బాధ్యత తీసుకోవాలని హెచ్ఎం బుగ్గన్నకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాఘవయ్య, టీచర్ సీబీ పుష్పలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సి.బెళగల్‌లో..

ప్రతి పిల్లవాడికి ఎంఆర్ వ్యాక్సిన్ అవసరమని వైద్యాధికారి పద్మావతి, శివకుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని కోటా స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాల్లో రుబెల్లా, తట్టు వ్యాక్సిన్‌ను 160 మంది బాలబాలికలకు వేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఆయుర్వేద వైద్యాధికారి ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఓర్వకల్లులో..

ఎంఆర్ వ్యాక్సిన్‌తో తట్టు, రుబెల్లా వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించవచ్చని ఎంఈవో ఫైజున్నీసాబేగం అన్నారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ ప్రారంభించారు. ఓర్వకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, చార్లీ స్కూల్‌లో ఎంఈవో ఫైజున్నీసా బేగం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ విజయకుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'వ్యాక్సిన్ వేయించాలి'

కల్లూరు: పిల్లలందరికీ తట్టు, రుబెల్లా వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలని కల్లూరు ఎంపీడీవో అన్వరాబేగం కోరారు. మంగళవారం పందిపాడులోని జీఎస్ఎన్ఆర్ ప్రైవేట్ పాఠశాలలో వ్యాక్సినేషన్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఒకే వ్యాక్సిన్‌తో తట్టు, రుబెల్లా వ్యాధుల నివారణ సాధ్యమని ఆమె తెలిపారు. సర్పంచ్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ భార్గవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





కోడుమూరు మండలంలో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో అనంతయ్య, ఓర్వకల్లు హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాక్సినేషన్

ఆలస్యంగా పింఛన్ల పంపిణీ

గూడూరు: 1వ తేదీ అనగానే పింఛన్ పంపిణీ జరుగుతుందని పింఛన్‌దారులు ఆశపడతారు. అయితే బ్యాంకు అధికారుల నిర్వాకం కారణంగా జూలై 31వ తేదీ అందాల్సిన పింఛన్ సొమ్ము ఆగస్టు 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు పంచాయతీ కార్యదర్శుల చేతికి అందడంతో పంపిణీ ప్రక్రియ ఆలస్యం అయింది. దీంతో పింఛన్‌దారులు వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. గూడూరు మండలంలో 2,550 మంది పింఛన్‌దారులు ఉండగా రూ. 27,72,500 పంపిణీ చేయాల్సి ఉందని ఎంపీడీవో షేక్ అమానుల్లా తెలిపారు. అయితే జూలై 31వ తేదీ పింఛన్ సొమ్ము బ్యాంకు అధికారులు డబ్బులు లేవని ఇవ్వకపోవడంతో ఆగస్టు 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు డబ్బులు ఇవ్వడంతో పంపిణీ ప్రక్రియ ఆలస్యం అయినట్లు ఎంపీడీవో చెప్పారు. అయితే పంచాయతీ కార్యదర్శులకు పింఛన్ డబ్బులను ఇచ్చి గ్రామాల్లో పంపిణీ చేయాలని ఆదేశించామన్నారు. అయితే పింఛన్‌దారులకు డబ్బులు ఇస్తున్నట్లు చెప్పడంతో ఇళ్లకు వెళ్లిన పింఛన్‌దారులు తిరిగి కార్యాలయాల దగ్గరకు వచ్చి పింఛన్ తీసుకొని వెళ్లారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు: విజయకుమార్



పొద్దుతిరుగుడు పంటను పరిశీలిస్తున్న విజయకుమార్

ఓర్వకల్లు: ప్రకృతి వ్యవసాయం మేలని, ఈ పద్ధతిలో సాగుచేసిన పంటలే బెట్టను తట్టుకుంటాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రకృతి వ్యవసాయం సలహాదారు విజయకుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంతో రైతు లు సాగు చేసిన మినుములు, పొద్దు తిరుగుడు, మొక్కజొన్న, రసాయన ఎరువులతో సాగు చేసిన పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులతో సాగు చేసిన పంటలు వాడిపోతున్నాయని అన్నారు. వర్షాభావ ప్రాంతాల్లోని రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సంధ్య, నంది కొట్కూర్ ఏడీఏ వీరారెడ్డి, ఏవో మధుమతి, రైతులు సంజీవరెడ్డి, మద్దిలేటి, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి: ఏపీవో



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీవో

సి.బెళగల్: కూలీల సంఖ్య పెంచాలని ఏపీవో కేజీ నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముడుమాల, పొలకల్ గ్రామాల్లో చేస్తున్న ఉపాధి కూలీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు ఫారం పాండ్ గుంతలను తవ్వుకోవాలని సూచించారు. కూలీలు ఆధార్ నెంబరు, వ్యక్తిగత బ్యాంకు ఖాతా ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు కిశోర్‌కుమార్, ఈసీ మల్లికార్జునగౌడ్ ఉన్నారు.

'చెత్తతో సంపద సేకరణకు స్థల పరిశీలన'

గూడూరు: చెత్తతో సంపద సేకరణకు అవసరమైన స్థలాన్ని ఎంపీడీవో షేక్ అమానుల్లా పరిశీలించారు. మంగళవారం మండలంలోని మల్లాపురం గ్రామంలో స్థలాన్ని పరిశీలించి త్వరలోనే నిర్మాణ పనులు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఈవోఆర్డీ నాగేశ్వరరెడ్డి, ఈసీ మధుసూదన్‌రావు ఉన్నారు.

కోడుమూరుకు ఎల్లెల్సీ నీరు బంద్



అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ చంద్రశేఖర్

కోడుమూరు(రూరల్): గత 8 రోజులుగా కోడుమూరు పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు విడుదల చేస్తున్న ఎల్లెల్సీ నీటిని అధికారులు మంగళవారం నిలిపివేశారు. వర్కూరు దగ్గర సుద్దవాగువంకకు ఏర్పాటు చేసిన రంధ్రాన్ని ఇరిగేషన్ అధికారులు లష్కర్లతో మూయించారు. ఈ సందర్భంగా వర్క్ ఇన్‌స్పెక్టర్ రామేశ్వరరెడ్డి, ఎస్ఈ చంద్రశేఖర్‌రావు, డీఈ రఘురామిరెడ్డిలతో మాట్లాడుతూ కోడుమూరుకు రోజూ 50 క్యూసెక్కుల చొప్పున గత 8 రోజులుగా విడుదల చేశామని వివరించారు. అయితే కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం నీటిని కిందకు విడిపించారని తెలిపారు. ప్రస్తుతం గాజులదిన్నె దగ్గర నీటిని నిలుపుదల చేయించామని, కాల్వ వెంట ఏవైనా మరమ్మతులు ఉంటే సిబ్బందితో పరిశీలింపచేసి విడుదల చేయిస్తామని తెలిపారు. వారి వెంట నాగలాపురం సబ్‌డివిజన్ ఏఈ శేషశయన ఉన్నారు.

భవన నిర్మాణ పనులను పరిశీలించిన పబ్లిక్ హెల్త్ ఎస్ఈ



నూతన నగర పంచాయతీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనాథరెడ్డి

గూడూరు: గూడూరు నగర పంచాయతీ నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులను మున్సిపల్ శాఖ పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనాథరెడ్డి పరిశీలించారు. మంగళవారం గూడూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రూ. కోటి 40 లక్షలతో నిర్మిస్తున్న నూతన నగర పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనులు నాణ్యంగా, వేగంగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట పబ్లిక్ హెల్త్ ఈఈ రామ్మూర్తి, డీఈ గుర్రప్పయాదవ్, ఏఈ వెంకటసుబ్బయ్య ఉన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

సి.బెళగల్: మండలంలోని పొలకల్, కొత్తకోట, పల్‌దొడ్డి గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులను ఈవోఆర్డీ సుమిత్రమ్మ, గ్రామ సర్పంచ్‌లు చేపట్టారు. ఈ సందర్భంగా సుమిత్రమ్మ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఈవోఆర్డీ

ఉరుకుంద ఈరన్న ఆదాయం రూ.38.46 లక్షలు

కౌతాళం : ఉరుకుంద ఈరన్న (నరసింహా) స్వామి ఆలయ హుండీ లెక్కింపు కాలక్షేప మండపంలో మంగళవారం జరిగింది. ఈ లెక్కింపులో స్వామికి భక్తులు నగదు రూపంలో రూ. 38,46,196, వెండి 12.400 కిలోలు, బంగారు 42 గ్రాములు కానుకలుగా సమర్పించారు. లెక్కింపు కార్యక్రమంలో పాలక మండలి చైర్మన్ చెన్నబసప్ప, ఈవో మల్లికార్జున ప్రసాద్, జిల్లా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఆలయ పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేశ్వరరావు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

‘తట్టు, రూబెల్లా నుంచి పిల్లలను కాపాడుకుందాం’

పెద్దకడుబూరు: తట్టు, రూబెల్లా నుంచి పిల్లలను కాపాడుకుందామని వైద్యాధికారి విజయమాధురి, ఎంపీడీవో పద్మజ అన్నారు. మంగళవారం పెద్దకడుబూరు ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఎంఆర్ వ్యాక్సిన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కృపాకర్ రెడ్డి, సూపర్‌వైజరు వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి, ఈరన్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రాలయం: 9 నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు పిల్లలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా మంత్రాలయంలోని అయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో, మండల పరిధిలోని కలుదేవకుంట గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు రాజశేఖర్, ఏఎన్ఎంలు శారద, నాగమ్మ, రామలక్ష్మి, శైలజ, దేవమ్మ భీమన్న, మంజుల, కల్యాణి, స్వప్న పాల్గొన్నారు.

కౌతాళం: మండల పరిధిలోని 9 నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు పిల్లలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మండల వైద్యాధికారి చిదంబరరావు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఒకే టీకాతో రెండు వ్యాధులను దూరం చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గంగాధరయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పెద్దకడుబూరులో టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

కోసిగి: ఎంఆర్ వ్యాక్సిన్ వేయించి రూబెల్లా, తట్టు వ్యాధులకు దూరంగా ఉండాలని వైద్యురాలు కీర్తిప్రియ పేర్కొన్నారు. మంగళవారం చింతకుంట, పల్లెపాడు గ్రామాల్లో 1365 మంది పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. వారం రోజుల్లోగా మండలంలోని అన్ని గ్రామాల్లో తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఈ టీకాలు తప్పకుండా వేయిస్తామన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు టీకాలు వేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అనుమంతప్ప, వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు


కౌతాళంలో వర్షం కోసం పూజలు చేస్తున్న ప్రజలు

కౌతాళం: వరుణ దేవుడు కరుణించాలని కోరుతూ మంగళవారం కౌతాళంలో గ్రామస్థులు గ్రామ దేవత చౌడమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బదినేహాల్ రహదారిలో వెలసిన దేవికి కుంకుమార్చన, దీపారాధన, మహా మంగళహారతి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: విస్తారంగా వర్షాలు కురవాలని కోరుతూ పెద్దకడుబూరు గ్రామస్థులు మంగళవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మంత్రాలయం సమీపంలోని తుంగభద్ర నదికి కాలినడకన వెళ్లి జలాలు తెచ్చి ఆలయాల్లోని దేవతామూర్తులకు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత నెల రోజులుగా తీవ్ర వర్షాభావ కారణంగా పంటలు ఎండుముఖం పట్టాయని, వరుణదేవుడు కరుణించాలనే ఉద్దేశ్యంతో పూజలు చేస్తున్నామని తెలిపారు. మరి కొన్ని గ్రామాల్లో రాత్రిపూట వర్షం కోసం నిత్యం భజనలు చేస్తున్నారు. వారంరోజుల్లో వర్షం రాకపోతే పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కోసిగి: వర్షం కురవాలని గత ఏడు రోజులుగా కోసిగి సిద్దప్ప పాలెం మారెమ్మ గుడి వద్ద చేస్తున్న సప్త భజనలు మంగళవారం తో ముగిసాయి. దశల వారీగా ఎడతెరపి లేకుండా భక్తులు సప్త భజన చేశారు. సోమ, మంగళవారాల్లో కోసిగిలో చిరుజల్లులు కురియడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

200ల మంది టీడీపీలో చేరిక

మంత్రాలయం: మండల పరిధిలోని సూగూరు గ్రామానికి చెందిన 200 మంది వైసీపీ కార్యకర్తలు గోపాల్‌రావు, ఈరన్న ఆధ్వర్యంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ పన్నాగ వెంకటేష్ స్వగృహం వద్ద సూగూరు వైసీపీ కార్యకర్తలకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సూగూరు గ్రామానికి చెందిన ఏజ్కెల్, బుజ్జి, ఈరన్న, ప్రభాకర్, జనార్దన్, రాజు, యాకోబు, జక్రయ్య, ప్రసంగితో పాటు దాదాపు 190 మంది సూగూరు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. అలాగే మంత్రాలయానికి చెందిన వైసీపీ నాయకులు పాల వెంకటేష్, మల్లన్నగౌడు, చంద్రశేఖర్‌గౌడు, బసవరాజుతో పాటు మరికొందరు టీడీపీలో చేరారు. వీరికి కూడా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వ్యాసరాజాచార్, బూదూరు మల్లికార్జునరెడ్డి, పంపన్నగౌడు, మధుస్వామి, కుమార్, నరసింహులు, దుల్లయ్య, యోబు, రఘు, హనుమంతు పాల్గొన్నారు.

‘ఆర్డీఎస్ పూడికతీత పనులు నిలిపివేయాలి’

మంత్రాలయం : ఆర్డీఎస్ లెఫ్ట్ కెనాల్ వద్ద కొనసాగుతున్న పూడికతీత పనులు వెంటనే నిలిపి వేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ లెఫ్ట్ కెనాల్ వద్ద పూడికతీత పనులు కొనసాగిస్తే దిగువున ఉన్న మంత్రాలయం నియోజకవర్గంతో పాటు కర్నూలు వరకు నీటి ఎద్దడి ముంచుకోస్తుందన్నారు. పూడికతీత పనులు సమాంతరంగా చేయాలని, లేకుంటే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆర్డీఎస్ షెట్టర్లను పగలగొడతామని హెచ్చరించారు. వర్షాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్న తరుణంలో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు జలదోపిడీ చేయడం దారుణమన్నారు. జలవనరుల శాఖ అధికారులు స్పందించి పనులు నిలిపి వేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పన్నాగ వెంకటేష్, బూదూరు మల్లికార్జునరెడ్డి, గోపాల్‌రావు, వెంకటేష్ పాల్గొన్నారు.

పనులు చేస్తే అడ్డుకుంటాం

ఇరిగేషన్ ఏఈతో వాగ్వాదానికి దిగిన నాయకులు

కోసిగి రూరల్: కోసిగి మండల పరిధిలోని అగసనూరు వద్ద ఆర్డీఎస్ వద్ద గుట్టుచప్పుడు కాకుండా పనులు చేస్తే సహించబోమని బీజేపీ, వైసీపీ నాయకులు అందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడిసె శివన్న మాట్లాడుతూ కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ సీఈలు ఎవరికి తెలియకుండా కర్నూలులోని ఏసీ గదుల్లో సమావేశం నిర్వహించి అనుమతి ఇస్తే ఒప్పుకునేది లేదన్నారు. పూడికతీత పనులు వల్ల ఆంధ్ర వైపు కంటే కర్ణాటక వైపు నీరు ఎక్కువగా వెళ్తుందని, ఆంధ్ర వైపు ఉన్న చిన్న, సన్నకారు రైతులు నష్టపోతారని వాపోయారు. ఈ విషయం ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరెడ్డితో వాగ్వివాదం చేశారు. అదే విధంగా ఆంధ్ర వైపు కూడా పూడిక తీత పనులు చేసి సమన్యాయం చేయాలన్నారు. ఆర్డీఎస్ వద్ద అధికారులు మరో వివాదం సృష్టించారని రైతులు వాపోతున్నారు. అగసనూరు, సాతనూరు, తుంబిగనూరు, మంత్రాలయం నుంచి రైతులు అక్కడికి చేరుకోని అందోళన కార్యక్రమాలు చేపట్టారు. అధికారులకు పూడిక తీతపై ఉన్న దృష్టి ఆంధ్ర వైపు రావాల్సిన కుడి కాలువపై దృష్టి సారించి రైతులకు న్యాయం చేయాలన్నారు. రాత్రికి రాత్రే పనులు చేస్తే కేంద్ర జలవనరుల శాఖకు ఫిర్యాదు చేస్తామని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్డీఎస్ అనకట్ట ఆంధ్ర వైపు న్యాయం చేయడం లేదని, అనకట్ట నుంచి అక్రమంగా ఎక్కువ మోతాదులో జలచౌర్యం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం వైసీపీ నాయకులు మురళీరెడ్డి, శివన్న ఏఈ శ్రీనివాసరెడ్డితో వాగ్వాదానికి దిగారు. ఏఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చి ఆంధ్ర వైపు కూడా పూడిక తీత పనులు చేసి సమ న్యాయం చేస్తామని చెప్పడంతో రైతులు, నాయకులు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఎస్ఈ చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, వైసీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

‘ఉపాధి వేతనాలు చెల్లించాలి’

కౌతాళం: కౌతాళం మండలంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలను తక్షణమే కూలీలకు చెల్లించాలని ఆఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు నాగేంద్రప్ప, జగదీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద వేతనాలు చెల్లించాలని ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏపీవో కృష్ణమూర్తికి అందజేశారు.

పంచాయతీ నిధులతో చెరువు నిర్మాణం

కౌతాళం: మండల పరిధిలోని ఉప్పరహాల్ గ్రామంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి 14వ ఆర్థిక సంఘం నిధులతో తాగునీటి చెరువు నిర్మించినట్లు సర్పంచ్ ఈరన్న, ఉప సర్పంచ్ బాషా తెలిపారు. మంగళవారం వారు విలేఖరులతో మాట్లాడుతూ గ్రామంలో ఒకే ఒక్క చెరువు ఉండటంతో వేసవిలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, దీనిని వల్ల ఇబ్బందులు తలెత్తకుండా రూ. 6 లక్షలతో మరో చెరువును నిర్మించామన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు.

‘అనాథలను ఆదుకుందాం..’

కౌతాళం: అనాథలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ దూద్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తేజస్వీ అనాథ శరణాలయానికి పాఠశాల యజామన్యం రూ. 3 వేలు, విద్యార్థులు రూ. 3 వేలు కలిసి మొత్తం రూ. 6 వేలను విరాళంగా అందించాడు. ఈ సందర్భంగా దూద్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సేవా గుణాలను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

‘గ్రానైట్ లారీలను తిరగనివ్వం’

పెద్దకడుబూరు: మండల పరిధిలోని కల్లుకుంట గ్రామ శివారులో ఉన్న కొండల్లో నుంచి గ్రానైట్ బండను తరలించే లారీలను కల్లుకుంట-పెద్దకడుబూరు రహదారిపై తిరగనివ్వమని గ్రామస్థులు విజయ్, శాబీర్ బాషా, వీరేష్, మహేంద్ర, యాదగిరి, రాజు పేర్కొన్నారు. మంగళవారం గ్రానైట్ బండను తరలించే లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రానైట్ లారీలు మెయిన్ రోడ్డుపై తిరుగుతుండడంతో రోడ్లు పాడైపోయి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. లారీలో ఓవర్ లోడుతో వెళ్లడంతో రోడ్లు గుంతలు పడుతున్నాయని ఆరోపించారు. అధికారులు స్పందించి గ్రానైట్ బండను తీసుకెళ్లే లారీలను మెయిన్ రోడ్డుపై వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున అందోళన చేపడుతామని హెచ్చరించారు.

‘జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి’

పెద్దకడుబూరు: పెద్దకడుబూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శాబీర్ బాషా, డివిజన్ నాయకుడు రాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, లక్ష్మన్న, రాజు, రంగస్వామి, నాగరాజు, ఆనంద్, మహబూబ్, గణేష్, వినోద్ ఖాజ పాల్గొన్నారు.

‘ఇందిరమ్మ బిల్లులు మంజూరు చేయాలి’

కోసిగి: కోసిగి మండలంలో పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ బిల్లులు మంజూరు చేయాలని ఏపీ దళిత సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి లోకేష్ అన్నారు. మంగళవారం కోసిగిలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు పూర్తై మూడు సంవత్సరాలు గడిచిపోయిన ఇప్పటివరకు బిల్లులు కాలేదని, ఎంతోమంది లబ్ధిదారులు ఇళ్లు కుట్టుకోని అప్పులపాలయ్యారన్నారు. వెంటనే బిల్లులు చెల్లించి వారిని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో తాయన్న, ఉలిగయ్య, ఓంకార స్వామి పాల్గొన్నారు.

‘నేడు పొలం పిలుస్తోంది’

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని కలుదేవకుంట, చిలకలడోణ గ్రామాల్లో వ్యవసాయాధికారి శివశంకర్ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫసల్ బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో స్వాతి, అరుంధతి, రైతులు పాల్గొన్నారు.

తల్లి పాల వారోత్సవాలపై ర్యాలీ

పగిడ్యాల: మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలపై మంగళవారం అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని వీధుల గుండా తల్లి పాల వారోత్సవాలపై నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాపడం వల్ల ఎంతో ఆరోగ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాలమద్దిలేటి, అంగన్‌వాడీ టీచర్లు భారతి, నారాయణమ్మ, షాజిదాబీ, సుధామణి పాల్గొన్నారు.

హంద్రీ నీవా కాలువ విస్తరణకు పేలుళ్లు

ఎత్తిపోతల పంప్‌హౌస్‌లకు పొంచి ఉన్న ప్రమాదం



హంద్రీ నీవా కాలువలో బ్లాస్టింగ్ కోసం రంధ్రాలు వేస్తున్న దృశ్యం

నందికొట్కూరు రూరల్: హంద్రీ నీవా ప్రధాన కాలువ విస్తరణ పనుల కోసం భారీ పేలుళ్లు చేపడుతున్నారు. పేలుళ్ల దాటికి ఎత్తిపోతల పంప్‌హౌస్‌లు బీటలు వారి దెబ్బ తినే ప్రమాదం నెలకొంది. అంతేగాక చుట్టు పక్కల ప్రాంతమంతా దద్దరిల్లుతోంది. హంద్రీ నీవా ప్రధాన కాలువపై 8 ఎత్తిపోతల పథకాలు, ఎస్కేప్ ఛానళ్లను నిర్మించారు. బ్లాస్టింగ్ చేపట్టడంతో ఇప్పటికే పంప్‌హౌస్‌ల వద్ద భూమి కంపించిపోయి బీటలు వారుతున్నాయి. సమీప గ్రామాలు ఉలిక్కి పడుతున్నాయి. విస్తరణ పనుల్లో గట్టి రాళ్లను తొలగించేందుకు భారీ మోతాదులో పేలుడు పదార్థం వినియోగిస్తున్నారు. పేలుడు పదార్థాలను జాగ్రత్తగా నిల్వ చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్లు ఎక్కడ పడితే అక్కడ నిల్వ చేస్తున్నారు. గతంలో హంద్రీ నీవా కాలువ తవ్వకం పనులకు బ్లాసింగ్‌ను ఉపయోగించారు. ప్రస్తుతం కాలువ విస్తరణ పనుల కోసం మరోసారి రాళ్లను తొలగించేందుకు ఓపెన్ బ్లాస్టింగ్ చేస్తుండడం వల్ల సమీప పొలాల్లో వ్యవసాయ కూలీలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. బ్లాస్టింగ్ పేలుళ్ల దాటికి రాళ్లు ఎగిసి చుట్టు పక్కల ఉన్న పొలాల్లో పడుతున్నాయి. వేసవిలో చేయాల్సిన బ్లాస్టింగ్ పనులు వర్షాకాలంలో చేస్తుండడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. హంద్రీ నీవా కాలువపై 8ఎత్తిపోతల పథకాల పంప్ హౌస్‌లు, ఎస్కేప్ ఛానళ్ల నిర్మాణాలు కూడ చేపట్టారు. బ్లాస్టింగ్ పేలుళ్లతో దెబ్బతినే అవకాశం ఉండడంతో అక్కడ పనులను ఏ విధంగా చేపట్టాలన్న పరిశీలనలో అధికారులు ఉన్నారు. మల్యాల నుంచి జీడిపల్లి వరకు 216 కి.మీ వరకు ప్రధాన కాలువను రూ.950కోట్లతో విస్తరణ పనులను చేపట్టారు. కృష్ణా నది జలాశయానికి వరద నీరు వచ్చి చేరుకునేలోగా 70శాతం పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విస్తరణ పనులను కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా చేస్తున్నారు.



బ్లాస్టింగ్‌కు ఉపయోగించే మందుగుండు

పేలుళ్లకు భయాందోళన చెందుతున్నాం

హంద్రీ నీవా కాలువ విస్తరణ కోసం బ్లాస్టింగ్ చేస్తుండడం వల్ల శబ్దాల దాటికి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా బ్లాస్టింగ్ చేస్తున్నారు. కూలీలు కూడ కాలువ సమీప పొలాల్లో పనులు చేసేందుకు రావడం లేదు. ఈ పేలుళ్ల వల్ల భూమి కూడ కంపించి నెరియలు ఇచ్చి పొలాలు సేద్యానికి చేసుకోవడానికి ఇబ్బందిగా మారింది.

అల్లిహుసేన్, వడ్డెమాను

విద్యార్థులకు మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్ పంపిణీ



పగిడ్యాలలో ఎమ్ఆర్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లాలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మీజిల్స్ రూబెల్లా టీకాలను వైద్య సిబ్బంది వేశారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పిల్లలకు టీకాలు వేశారు. ఎంపీడీవో సుబ్బారెడ్డి, ఎంఈవో శ్రీనివాసులు జూపాడుబంగ్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, 80 బన్నూరు, మండ్లెం పాఠశాలల్లో ఎమ్ఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. 15ఏళ్లలోపు ఉన్న ప్రతి విద్యార్థికి ఎమ్ఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.



జూపాడుబంగ్లాలో టీకా వేస్తున్న దృశ్యం

పగిడ్యాలలో..

పగిడ్యాల జడ్పీ పాఠశాల, ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్‌ను మంగళవారం ఆరోగ్య సిబ్బంది వేశారు. ఉదయం నుంచి విద్యార్థులకు టీకాలను వేశారు. 9నెలల నుంచి 15ఏళ్ల పిల్లలు తట్టు, పొంగు వ్యాధి బారిన పడకుండా ప్రభుత్వం టీకా పంపిణీకి శ్రీకారం చుట్టిందని ఇన్‌చార్జి వైద్యాధికారి ప్రసాద్ తెలిపారు. పగిడ్యాలలో 963మందికి టీకాలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి, పీహెచ్ఎం పార్వతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

30ఎకరాల్లో పండ్ల తోటల సాగు: ఏపీఎం



జూపాడుబంగ్లాలో మామిడి మొక్కలు నాటుతున్న దృశ్యం

జూపాడుబంగ్లా: మండలంలో 30ఎకరాల్లో పండ్ల తోటల సాగు చేపట్టారు. వెలుగు ఆధ్వర్యంలో జూపాడుబంగ్లా, మండ్లెం, రామసముద్రం గ్రామాల్లోని రైతుల పొలాల్లో మామిడి మొక్కలను మంగళవారం నాటారు. ఎకరాకు 70 మొక్కల చొప్పున నాటినట్లు ఏపీఎం కరుణాకర్ తెలిపారు. పండ్ల మొక్కల సంరక్షణ కోసం రైతుకు నెలకు ఎకరాకు రూ.2,500 చొప్పున వెలుగు నుంచి సొమ్ము చెల్లిస్తుందన్నారు. మండలంలో 180 ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేయాల్సి ఉండగా మొక్కలు ఆలస్యంగా రావడంతో రైతులు ఇతర పంటలను సాగు చేశారన్నారు. ఈ ఏడాది 30ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేస్తున్నామని, రైతులు ముందుకు వస్తే సాగును మరింత పెంచుతామని ఆయన తెలిపారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ఆటో

ముగ్గురికి తీవ్రగాయాలు

జూపాడుబంగ్లా: మండల పరిధిలోని రబ్బాని రూరల్ వేర్‌హౌస్ సమీపంలో కేజీ రోడ్డుపై మంగళవారం ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్‌ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామానికి చెందిన హుసేన్‌వలి, యూసుఫ్ అనే వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై నందికొట్కూరుకు వెళ్లుతుండగా ఆత్మకూరు వైపు వెళ్తున్న ఆటో వేగంగా ఎదురుగా వచ్చి ఢీకొంది. హుసేన్‌వలి, యూసుఫ్‌కు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. ఆటో డ్రైవర్ రమేష్ కూడ తీవ్ర గాయాలయ్యాయి. నందికొట్కూరు, జూపాడుబంగ్లా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

'తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి'



మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు రూరల్: పట్టణంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను అమరావతిలో మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి కలిశారు. వర్షాభావ పరిస్థితులు, నదీజలాశయాలు, కేసీ కాలువలో నీరు లేకపోవడంతో సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుల్లో నీరు అడుగంటిపోయిందన్నారు. పట్టణంలో తాగునీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోందని, ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాల్సిన పరిస్థితి ఏర్పడిందని మంత్రికి వివరించారు. ఇంటింటికి కొళాయి సౌకర్యం ఏర్పాటు చేయాలని, మిడుతూరు మండలం అలగనూరు గ్రామంలో సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. అలాగే ఆయా గ్రామాల్లో నీటిసమస్య పరిష్కారం కోసం రక్షిత మంచినీటి పథకాలను ఏర్పాటు చేయాలన్నారు.

దొంగతనాల కేసుల్లో నిందితుల అరెస్టు

నందికొట్కూరు టౌన్: పట్టణంలో జరిగిన పలు దొంగతనాల కేసుల్లో నిందితులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. విలేఖర్ల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలను సీఐ వెంకటరమణ వివరించారు. పట్టణంలో ఆరు నెలల క్రితం రామకృష్ణ గౌడు ఇంట్లో, శాలుబీ ఇంట్లో, బోయ మహేశ్వరమ్మ ఇంట్లో జరిగిన దొంగతనాల నిందితులను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.87 వేల నగదు, ఒక హోంథియేటర్ స్వాధీనం చేసుకున్నారు. బ్రాహ్మణకొట్కూరుకు చెందిన దాసరి రాజు అలియాస్ నాగస్వాములు అలియాస్ అజీజుల్లా, అల్లూరు గ్రామానికి చెందిన బత్తుల రమేష్, నందికొట్కూరు పట్టణం సుబ్బరావుపేటకు చెందిన కరీంబాషా, సొహైల్‌లను అరెస్ట్ చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా రిమాండ్‌కు అదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు లక్ష్మీనారాయణ, బాలనరసింహులు, సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన కానిస్టేబుళ్లు నాగరాజు, కొండన్నను అభినందించారు.

'పెండింగ్ బిల్లుల చెల్లింపునకు గ్రామసభ'



కూలీల వివరాలను సేకరిస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది

పగిడ్యాల: ఉపాధి పథకంలో పని చేసిన కూలీలకు పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు నెహ్రూనగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామసభను నిర్వహించారు. గ్రామానికి చెందిన 657మంది కూలీలకు పని చేసినప్పటికీ బిల్లులు మంజూరు కాకపోవడంతో గ్రామసభలో కూలీల పేర్లను చదివి వినిపించారు. కూలీలకు బిల్లులు రాకపోవడానికి గల కారణాలను పరిశీలించిన అనంతరం బిల్లులు అందేలా చర్యలు తీసుకుంటామని ఏపీవో జయంతి తెలిపారు. కూలీలు ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతాలు సక్రమంగా లేకపోవడం వల్లే బిల్లులు అందడం లేదని, కూలీలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తే బ్యాంకు అధికారులతో మాట్లాడి బిల్లులు మంజూరయ్యేలా చూస్తామన్నారు. గతంలో కొంతమంది కూలీలు బిల్లులు అందని వారు కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడంతో బిల్లులు మంజూరైన వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రాంగోపాల్, బ్యాంకు మిత్ర కిరణ్, కూలీలు ఉన్నారు.

సినిమా గైడ్

నందికొట్కూరు

శాంతి	: ఫిదా
శివశంకర్	: గౌతమ్‌నందా
అప్సర	: డీజే.. దువ్వాడ జగన్నాథం
శ్రీరామ	: వాసుకి
శ్రీకృష్ణ	: దండుపాళ్యం-2

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసిన వారు ఈ సెల్ నెంబర్లను సంప్రదించగలరు
ఏసీఓ. 9985411379 ఎస్.ఆర్. 9985422887

వర్షం కోసం గంగమ్మకు పూజలు

గోస్పాడు: వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ మంగళవారం గోస్పాడులో పెద్ద సంఖ్యలో మహిళలు గంగమ్మకు బోనాలు సమర్పించారు. ఖరీఫ్‌లో వేసిన పంటలు ఎండిపోతున్నాయని, చాలా రోజుల నుంచి వర్షాలు పడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వర్షాలు కురవాలని పూజలు చేస్తున్నట్లు మహిళలు తెలిపారు.


బోనాలతో వెళ్తున్న మహిళలు

'7,8,9 తేదీల్లో ఛలో ఢిల్లీ'


సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

నంద్యాల (ఎడ్యుకేషన్): చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ జనసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో లక్ష్మీనరసింహ మాట్లాడుతూ బీసీల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఆగస్టు నెల 7,8,9వ తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో 56 శాతం, పంచాయతీరాజ్ సంస్థల్లో 50 శాతానికి రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని టీడీపీ, వైసీపీ ఎంపీలు పార్లమెంట్ సమావేశంల్లో బీసీల సమస్యలపై గళం విప్పాలని డిమాండ్ చేశారు. యువకులు, ఉద్యోగులు, మేధావులు అధిక సంఖ్యలో ఛలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను, బీసీ జనసభ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, నాయకులు ముక్తార్‌బాషా, వెంకటేష్, బాలరాజు, కార్తీక్, లక్ష్మణ్, సుధాకర్ పాల్గొన్నారు.

ఇరువురిపై వేధింపుల కేసు నమోదు

బండిఆత్మకూరు: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన పుల్లయ్య, లీలావతిలపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విష్ణునారాయణ మంగళవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళను పుల్లయ్య వివాహం చేసుకున్నాడన్నారు. అయితే ఇటీవల లీలావతి అనే మహిళతో పరిచయం ఏర్పరచుకొని భార్య లక్ష్మిని మానసికంగా వేధించేవాడని తెలిపారు. అదనపు కట్నం తేవాలని, భార్యా పిల్లలను ఇంటి నుంచి బయటకు పంపించాడని లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మోటార్ సైకిల్‌పై నుంచి పడి యువతి మృతి

పాణ్యం: మండలంలోని తమ్మరాజుపల్లె టర్నింగ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చాకలి చంద్రకళ(25) అనే యువతి మృతి చెందిందని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. గత నెల 31వ తేదీన చంద్రకళ నంద్యాల నుంచి తన బావతో పాటు మోటార్ సైకిల్‌పై సిమెంట్ నగర్‌కు వెళ్తుండగా తమ్మరాజుపల్లె వద్ద స్పీడ్ బ్రేకర్లు దాటుతూ అదుపు తప్పి మోటార్ సైకిల్‌పై నుంచి కిందపడటంతో తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు తెలిపారు. ఆమె కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సమాచారం

పాణ్యం మండల అధికారుల ఫోన్ నంబర్లు

ఎంపీడీవో	- 9949603399
తహసీల్దార్	- 8333988957
పశువైద్యాధికారి	- 9966368818
ప్రభుత్వ వైద్యాధికారి	- 9492759499
ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ	- 9440105233
ఉపాధి ఏపీవో	- 7702074563
పాణ్యం సీఐ	- 9440795534
ఎస్ఐ	- 9440795535

జీపీఆర్‌ఎస్ ద్వారా అధికారుల కదలికల పరిశీలన

ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్


సమావేశంలో పాల్గొన్న ఎన్నికల అధికారులు

నంద్యాల టౌన్: ఎన్నికలలో విధులు నిర్వహించే ప్రతి అధికారి కదలికలు జీపీఆర్‌ఎస్ ద్వారా పరిశీలించనున్నట్లు రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికలలో విధులు నిర్వహించే అధికారులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు నిర్వహించాల్సిన విధులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అధికారుల మధ్య సమాచారం తెలుసుకోవడానికి ప్రత్యేక వాట్సప్, యాప్ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎటువంటి సంఘటన జరిగినా తక్షణమే అధికారుల దృష్టికి తీసుకొని రావాలన్నారు. అధికారులు విధి నిర్వహణలో అలసత్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి విషయాన్ని వీడియోలో చిత్రీకరించాల్సిన అవసరం ఉందన్నారు. గృహ యజమానుల అనుమతులు లేకుండా వాల్ పోస్టర్లు అంటించరాదని పేర్కొన్నారు. అభ్యర్థి నామినేషన్ వేసిన సమయం నుంచి ఖర్చులను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అభ్యర్థుల ప్రచార సమయంలో ఎవరినీ కించపరిచే విధంగా దుర్భాషలాడరాదని తెలిపారు. సభలు సమావేశాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో 6 ఫ్లయింగ్ బృందాలు, 3 అదనపు ఫ్లయింగ్ బృందాలు, 3 నోడల్ కోడ్ బృందాలు, 3 వీడియో సర్వేలైన్ బృందాలు, ఒక వీడియో లివింగ్ బృందాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో అధికారులు స్పెషల్ కలెక్టర్ తిప్పేనాయక్, జడ్పీ సీఈవో ఈశ్వర్, ఆర్డీవోలు రాంసుందర్‌రెడ్డి, ఓటులేసు, డీఎస్పీ గోపాల్‌కృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ గెలుపు.. రాష్ట్రాభివృద్ధికి మలుపు: పెద్దిరెడ్డి


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

గోస్పాడు: ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి గెలుపు రాబోయే వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధికి మలుపు అని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం దీబగుంట్లలో సొసైటీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శిల్పా మోహన్‌రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో వైసీపీ ప్రచారం

నంద్యాల వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి మంగళ వారం రాయపాడు, కూలూరు, తేళ్లపురి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న పాలన జగన్‌మోహన్‌రెడ్డి తోనే సాధ్యమని, చంద్రబాబు పరిపాలనలో ఎక్కడా అభివృద్ధి జరగడం లేదని, అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. రాయపాడు గ్రామంలో మాజీ సర్పంచ్ యాశం మహేశ్వరరెడ్డి వైసీపీలో చేరారు. ఆయనతోపాటు జయరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గాండ్ల రాజశేఖర్, బాబు, మరో 20 మంది యువకులు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ నాగేశ్వరమ్మ, పీపీ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ రామసుబ్బారెడ్డి, రవికుమార్‌రెడ్డి, నారాయణ, అన్నయ్య, సుధాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

పదవుల ఎరవేస్తున్నారు: శిల్పా

నంద్యాల రూరల్: ఉప ఎన్నికలో అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక నాయకులకు పదవుల ఎర వేసి తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 18 వార్డులో ఉప ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో వార్డులోని ప్రతి వీధిలో తిరిగి ఇంటింట ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు జగన్ ఈ నెల 3వ తేదీన నంద్యాలకు రానున్నారని తెలిపారు. ఉప ఎన్నికలో వైసీపీ ఘన విజయం సాధించనున్నదని పేర్కొన్నారు. తనను ఆదరించి తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ ప్రచారంలో ఆయన వెంట మున్సిపల్ చైర్ పర్సన్ దేశం సులోచన, స్థానిక కౌన్సిలర్ సుబ్బరాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచార ర్యాలీలో పాల్గొన్న శిల్పా మోహన్‌రెడ్డి

ఎస్‌డీఆర్‌లో పట్టాభిషేకం వేడుకలు


విద్యార్థికి పట్టాభిషేకం చేస్తున్న ప్రిన్సిపాల్

నంద్యాల టౌన్: నంద్యాల సమీపంలోని ఎస్‌డీఆర్ స్కూల్‌లో పట్టాభిషేక వేడుకలు ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా 2017-18 అకాడమి విద్యార్థులకు వివిధ రకాల పదవులను కేటాయించి పట్టాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీఆర్ స్కూల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శనివారపు కొండారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్కూల్ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అధ్యాపక బృందం, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గురురాజ విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న దస్తగిరిరెడ్డి

నంద్యాల (ఎడ్యుకేషన్): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో నంద్యాల గురురాజ పాఠశాల విద్యార్థిని బి. రాజేశ్వరి అత్యంత ప్రతిభ కనబర్చి పతకాన్ని సాధించిందని గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత పి.దస్తగిరి రెడ్డి మంగళవారం తెలిపారు. విశాఖ పట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి 3వ తైక్వాండో పోటీల్లో 45 కేజీల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి రాజేశ్వరిని దస్తగిరిరెడ్డి, ఆ విద్యాసంస్థల కో-డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి అభినందించారు.

ఏవీ సమక్షంలో టీడీపీలో చేరికలు


ఏవీ సమక్షంలో టీడీపీలో చేరిన యువకులు, మహిళలు

నంద్యాల: నంద్యాల పట్టణంలోని వైఎస్ నగర్, బొమ్మలసత్రం కాలనీలకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఏపీఆర్‌ఐసీ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. నూనెపల్లెకు చెందిన బాబుల్లా ఆధ్వర్యంలో, వైఎస్‌నగర్‌కు చెందిన రోహిత్, సుభాన్, ఇమ్రాన్, రఫీ, నూర్జహాన్, తదితరుల నాయకత్వంలో పలువురు టీడీపీలో చేరారు. బొమ్మల సత్రం పుల్లయ్య, ఉమామహేశ్వరరావు, బాలదాసు, ఈశ్వరయ్యల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఏవీ సుబ్బారెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆంధ్రజ్యోతి దిన పత్రిక కావలసిన వారు ఈ సెల్ నెంబర్లను సంప్రదించగలరు.
ఏసీవో సెల్: 9985411377
ఎస్ఆర్ సెల్: 9985457435

'గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి'

మద్దికెర: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ నరసింహారెడ్డి సూచించారు. మద్దికెర జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మంగళవారం గ్రంథాలయంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందిస్తాయన్నారు. గ్రంథాలయంలో మనకు కావాల్సిన పుస్తకాలు దొరుకుతాయన్నారు. ప్రభుత్వం అన్ని రకాల పుస్తకాలను గ్రంథాలయాలకు సరఫరా చేస్తుందన్నారు. విద్యార్థి దశనుంచే పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్ తప్పనిసరి

● అన్ని పాఠశాలల్లో టీకాలు వేసిన వైద్యులు, సిబ్బంది ● అపోహలు వద్దని తల్లిదండ్రులకు సూచన


మద్దికెరలో..


దేవనకొండలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది


తుగ్గలిలో విద్యార్థులకు టీకా


పత్తికొండలో..

పత్తికొండటౌన్: తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్ల లోపు చిన్నారులకు ఎమ్మార్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని, ద్వారా తట్టు, రుబెల్లా వ్యాధులను నివారించవచ్చునని వైద్యాధికారి బలరామ్‌నాయక్ సూచించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో, అంగన్‌వాడీలు, ఆరోగ్య కేంద్రాల్లో 1060 మంది చిన్నారులకు మంగళవారం వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వనజాక్షి, ఎంపీహెచ్‌వో రామకృష్ణ, వైద్య, ఆరోగ్య సిబ్బంది లక్ష్మీదేవి, రామాంజినమ్మ, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండలో..

చిన్నారులందరికీ రుబెల్లా, మీజిల్స్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని జిల్లా హెల్త్ కో-ఆర్డినేటర్ హేమలత సూచించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లోను, అంగన్‌వాడీలలో ఈ వ్యాక్సిన్ కార్యక్రమం మంగళవారం వైద్యాధికారి శ్రీమంత్‌మాదన్న ఆధ్వర్యంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. మొదటి రోజు 2928 మంది చిన్నారులకు రుబెల్లా టీకాలను వేసినట్లు వైద్యాధికారి తెలిపారు. మండలంలో 9నెలల నుంచి 15ఏళ్ల లోపు 20,299 మంది ఉన్నారని ఆయన తెలిపారు. ఆశా ఆరోగ్య సిబ్బంది 16 బృందాలుగా ఏర్పడినట్లు తెలిపారు. చిన్నారుల తల్లిదండ్రులు ఈ టీకాలపై ఎలాంటి అపోహ పెట్టుకోరాదన్నారు. ఈ టీకాలు వేసుకోవడం వల్ల డైయేరియా, మొదడువాపు వంటి వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ కమ్యూనిటీ అధికారి శాంత, హెల్త్ ఎడ్యుకేటర్ ఈశ్వరయ్య, సూపర్‌వైజర్లు రంగస్వామి, రవికిశోర్, భాగ్యలక్ష్మి, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్దికెరలో..

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎమ్మార్ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించాలని ప్రభుత్వ వైద్యాధికారి శరీష సూచించారు. మద్దికెర గ్రామంలోని ఫ్రెండ్స్ విద్యానికేతన్, వివిధ పాఠశాలల్లో ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక వ్యాక్సిన్ వేయడం వల్ల రెండు వ్యాధులు దరిచేరవన్నారు. 15ఏళ్ల లోపు పిల్లలందరికి ఈ వ్యాక్సిన్‌ను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రామకృష్ణ, ఫ్రెండ్స్ విద్యానికేతన్ నిర్వాహకులు రామాంజనేయులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలిలో..

ఎమ్మార్ వ్యాక్సిన్ వేయిస్తే చిన్నారులకు తట్టు, పొంగు, మీజిల్స్ వంటి వ్యాధులు సోకవని వైద్యులు ప్రియాంక, నీరజ అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చిన్నారులకు మంగళవారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ చిన్నారులకు వేయడం హృదయ సంబంధిత వ్యాధులు కూడా సోకవని తెలిపారు.

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు

● ఎస్‌ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ కరణం నరేష్


మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ నరేష్

పత్తికొండటౌన్: విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగిద్దామని ఎస్‌ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ కరణం నరేష్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తికొండ డిగ్రీ కళాశాలలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చినప్పటికీ సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అలాగే కళాశాలలో ఎన్‌సీసీ ట్రైనింగ్ క్యాంప్‌లను పెట్టాలని డిమాండ్ చేశారు. విద్యారంగ పరిరక్షణ కోసం ఏబీవీపీ చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమన్న, పట్టణ అధ్యక్షుడు గోవింద్, సహాయ కార్యదర్శి రవి, నీలకంఠగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల నూతన కమిటీ ఎన్నిక:

పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏబీవీపీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుగ్గన్న, ఉపాధ్యక్షులుగా రాజు, హిదయతుల్లా, రాంబాబు, సహాయ కార్యదర్శులు శివనాయుడు, చంద్రబాబు, రవి, అంజి, శివకుమార్, రంగస్వామి, కళాశాల ఇన్‌చార్జిగా సత్యరంగస్వామితో పాటు ఇతరులను ఎన్నుకున్నారు.

'జయప్రదం చేయండి'

పత్తికొండటౌన్: సివిల్ సప్లయ్ కార్మికుల సమస్యలపై ఈ నెల 5న ఆదోనిలో తలపెట్టిన జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఏపీ సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సివిల్ సప్లయ్ గోదాము ఆవరణలో జరిగిన యూనియన్ సమావేశానికి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని, ప్రభుత్వం వెంటనే నగదు బదిలీ పథకాన్ని రద్దు చేయాలని, హమాలీలకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని తదితర డిమాండ్లపై ఈనెల 5న తలపెట్టిన జిల్లా సదస్సుకు పెద్దఎత్తున కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రుడు, యూనియన్ నాయకులు హుసేని, చెన్నకేశవులు, సుంకన్న, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు, భజనలు


నీరు తీసుకొస్తున్న యువకులు

పత్తికొండటౌన్: పట్టణంలోని చాకలివీధికి చెందిన 9 మంది యువకులు తొమ్మిది ఆలయాలకు సుంకులమ్మ, బంగారమ్మ, అంకాలమ్మ, మారెమ్మ, యల్లమ్మ, బసవన్న, బొడ్డురాయి తదితర దేవతామూర్తులకు మడిబట్టలతో ఉదయం నుంచి సాయంత్రం దాకా నీటితో జలాభిషేకం చేశారు. అనంతరం ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకులమ్మ ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు.


బోనాలు తీసుకెళ్తున్న చిన్నారులు

దేవనకొండలో..

అలారుదిన్నె గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో సప్తభజనలు మంగళవారం ప్రారంభమయ్యాయి. దేవాలయంలో వేదపండితుడు లక్ష్మీనారాయణ స్వామివారికి పంచామృతాభిషేకం, గంగపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకనూరు గ్రామంలో వర్షం కురవాలని చిన్నారులు పెద్దమ్మ, మారెమ్మవ్వ, సుంకులమ్మ, గంగమ్మలతో పాటు గాలెమ్మవ్వకు బోనాలు సమర్పించారు.

'శాశ్వత కరువు ప్రాంతంగా ప్రకటించాలి'

పత్తికొండటౌన్: వరుస కరువు కటకాలకు నిలయమైన పత్తికొండను శాశ్వత కరువు ప్రాంతంగా ప్రకటించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పత్తికొండ ప్రాంతంలో పంట పొలాలను పరిశీలించి రైతులను కరువు పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ఈశ్వర్ రెడ్డి భవన్‌లో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ నాలుగేళ్లుగా వరుస కరువు కటకాలతో నష్టపోయినప్పటికీ ఇప్పటి దాకా పరిహారం అందలేదన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరేశఖర్, నాయకులు శ్రీరాములు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దికెరలో..

వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిపోయాయని, కరువు విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి హనుమన్న తెలిపారు. మంగళవారం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం కరువు బృందం పంటలను పరిశీలిస్తుందని తెలిపారు. రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు భీమలింగప్ప, సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి నబీరసూల్ వస్తారని తెలిపారు. ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించి ఎకరాకు రూ.25వేలు చొప్పున పంటనష్టం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఉపాధ్యక్షుడు నాగరాజు, సీపీఐ మాజీ కార్యదర్శి కోదండరాముడు పాల్గొన్నారు.

ఆర్ఐగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ



పత్తికొండటౌన్: పత్తికొండ మండల ఆర్ఐగా రవికుమార్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. పత్తికొండ ఆర్ఐగా పనిచేస్తున్న పక్కృద్దీన్ గత రెండు నెలల క్రితం పదవీవిరమణ పొందారు. దేవనకొండ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రవికుమార్ పదోన్నతిపై ఆర్ఐగా పత్తికొండకు ఉన్నతాధికారులు నియమించారు. దీంతో మంగళవారం బాధ్యతలు స్వీకరించిన ఆర్ఐ రవికుమార్‌కు సిబ్బంది, డీలర్లు అభినందనలు తెలిపారు.

అనుమానాస్పద మృతిపై విచారణ


విచారణ జరుపుతున్న పోలీసులు

పత్తికొండటౌన్: పత్తికొండ పట్టణంలో సోమవారం అనుమానాస్పదస్థితిలో కృష్ణ అనే వ్యక్తి మృతిచెందడంతో సీఐ విక్రమసింహ మంగళవారం విచారణ చేపట్టారు. కృష్ణ నివాసం ఉంటున్న కుమ్మరివీధికి చేరుకున్న పోలీసులు మృతుడి బంధువులు, చుట్టు పక్కలవారిని సమగ్రంగా విచారించారు. ఈ సందర్భంగా సీఐ విక్రమ్ సింహ మాట్లాడుతూ కృష్ణ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే మృతుడి భార్యతో పాటు మరో అనుమానాస్పద యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

'గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి'

మద్దికెర: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ నరసింహారెడ్డి సూచించారు. మద్దికెర జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మంగళవారం గ్రంథాలయంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందిస్తాయన్నారు. గ్రంథాలయంలో మనకు కావాల్సిన పుస్తకాలు దొరుకుతాయన్నారు. ప్రభుత్వం అన్ని రకాల పుస్తకాలను గ్రంథాలయాలకు సరఫరా చేస్తుందన్నారు. విద్యార్థి దశనంచే పస్తలకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్ తప్పనిసరి

● అన్ని పాఠశాలల్లో టీకాలు వేసిన వైద్యులు, సిబ్బంది ● అపోహలు వద్దని తల్లిదండ్రులకు సూచన


మద్దికెరలో..


దేవనకొండలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది


తుగ్గలిలో విద్యార్థులకు టీకా


పత్తికొండలో..

పత్తికొండటౌన్: తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్ల లోపు చిన్నారులకు ఎమ్మార్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని, ద్వారా తట్టు, రుబెల్లా వ్యాధులను నివారించవచ్చునని వైద్యాధికారి బలరామ్‌నాయక్ సూచించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో, అంగన్‌వాడీలు, ఆరోగ్య కేంద్రాల్లో 1060 మంది చిన్నారులకు మంగళవారం వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వనజాక్షి, ఎంపీహెచ్‌వో రామకృష్ణ, వైద్య, ఆరోగ్య సిబ్బంది లక్ష్మీదేవి, రామాంజినమ్మ, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండలో..

చిన్నారులందరికీ రుబెల్లా, మీజిల్స్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని జిల్లా హెల్త్ కో-ఆర్డినేటర్ హేమలత సూచించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లోను, అంగన్‌వాడీలలో ఈ వ్యాక్సిన్ కార్యక్రమం మంగళవారం వైద్యాధికారి శ్రీమంత్‌మాదన్న ఆధ్వర్యంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. మొదటి రోజు 2928 మంది చిన్నారులకు రుబెల్లా టీకాలను వేసినట్లు వైద్యాధికారి తెలిపారు. మండలంలో 9నెలల నుంచి 15ఏళ్ల లోపు 20,299 మంది ఉన్నారని ఆయన తెలిపారు. ఆశా ఆరోగ్య సిబ్బంది 16 బృందాలుగా ఏర్పడినట్లు తెలిపారు. చిన్నారుల తల్లిదండ్రులు ఈ టీకాలపై ఎలాంటి అపోహ పెట్టుకోరాదన్నారు. ఈ టీకాలు వేసుకోవడం వల్ల డైయోరియా, మొదడువాపు వంటి వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ కమ్యూనిటీ అధికారి శాంత, హెల్త్ ఎడ్యుకేటర్ ఈశ్వరయ్య, సూపర్‌వైజర్లు రంగస్వామి, రవికిశోర్, భాగ్యలక్ష్మి, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్దికెరలో..

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎమ్మార్ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించాలని ప్రభుత్వ వైద్యాధికారి శరీష సూచించారు. మద్దికెర గ్రామంలోని ఫ్రెండ్స్ విద్యానికేతన్, వివిధ పాఠశాలల్లో ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక వ్యాక్సిన్ వేయడం వల్ల రెండు వ్యాధులు దరిచేరవన్నారు. 15ఏళ్ల లోపు పిల్లలందరికి ఈ వ్యాక్సిన్‌ను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రామకృష్ణ, ఫ్రెండ్స్ విద్యానికేతన్ నిర్వాహకులు రామాంజనేయులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలిలో..

ఎమ్మార్ వ్యాక్సిన్ వేయిస్తే చిన్నారులకు తట్టు, పొగు, మీజిల్స్ వంటి వ్యాధులు సోకవని వైద్యులు ప్రియాంక, నీరజ అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చిన్నారులకు మంగళవారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ చిన్నారులకు వేయడం హృదయ సంబంధిత వ్యాధులు కూడా సోకవని తెలిపారు.

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు

● ఎస్‌ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ కరణం నరేష్


మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ నరేష్

పత్తికొండటౌన్: విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగిద్దామని ఎస్‌ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ కరణం నరేష్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తికొండ డిగ్రీ కళాశాలలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చినప్పటికీ సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అలాగే కళాశాలలో ఎన్‌సీసీ ట్రైనింగ్ క్యాంప్‌లను పెట్టాలని డిమాండ్ చేశారు. విద్యారంగ పరిరక్షణ కోసం ఏబీవీపీ చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాల్లో విద్యార్థులు భాగ్యస్వాములు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమన్న, పట్టణ అధ్యక్షుడు గోవింద్, సహాయ కార్యదర్శి రవి, నీలకంఠగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల నూతన కమిటీ ఎన్నిక: పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏబీవీపీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుగ్గెన్న, ఉపాధ్యక్షులుగా రాజు, హిదయతుల్లా, రాంబాబు, సహాయ కార్యదర్శులు శివనాయుడు, చంద్రబాబు, రవి, అంజి, శివకుమార్, రంగస్వామి, కళాశాల ఇన్‌చార్జిగా సత్యరంగస్వామితో పాటు ఇతరులను ఎన్నుకున్నారు.

'శాశ్వత కరువు ప్రాంతంగా ప్రకటించాలి'

పత్తికొండటౌన్: వరుస కరువు కటకాలకు నిలయమైన పత్తికొండను శాశ్వత కరువు ప్రాంతంగా ప్రకటించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పత్తికొండ ప్రాంతంలో పంట పొలాలను పరిశీలించి రైతులను కరువు పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ఈశ్వర్‌రెడ్డి భవన్‌లో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ నాలుగేళ్లుగా వరుస కరువు కటకాలతో నష్టపోయినప్పటికీ ఇప్పటి దాకా పరిహారం అందలేదన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరశేఖర్, నాయకులు శ్రీరాములు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దికెరలో..

వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిపోయాయని, కరువు విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి హనుమన్న తెలిపారు. మంగళవారం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం కరువు బృందం పంటలను పరిశీలిస్తుందని తెలిపారు. రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు భీమలింగప్ప, సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి నభిరసూల్ వస్తారని తెలిపారు. ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించి ఎకరాకు రూ.25వేలు చొప్పున పంటనష్టం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఉపాధ్యక్షుడు నాగరాజు, సీపీఐ మాజీ కార్యదర్శి కోదండరాముడు పాల్గొన్నారు.

'జయప్రదం చేయండి'

పత్తికొండటౌన్: సివిల్ సప్లయ్ కార్మికుల సమస్యలపై ఈ నెల 5న ఆదోనిలో తలపెట్టిన జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఏపీ సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సివిల్ సప్లయ్ గోదాము ఆవరణంలో జరిగిన యూనియన్ సమావేశానికి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ హామాలీలకు కూలీ రేట్లు పెంచాలని, ప్రభుత్వం వెంటనే నగదు బదిలీ పథకాన్ని రద్దు చేయాలని, హామాలీలకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని తదితర డిమాండ్లపై ఈనెల 5న తలపెట్టిన జిల్లా సదస్సుకు పెద్దఎత్తున కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రుడు, యూనియన్ నాయకులు హుసేని, చెన్నకేశవులు, సుంకన్న, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ



పత్తికొండటౌన్: పత్తికొండ మండల ఆర్‌ఐగా రవికుమార్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. పత్తికొండ ఆర్‌ఐగా పనిచేస్తున్న ఫక్రుద్దీన్ గత రెండు నెలల క్రితం పదవీవిరమణ పొందారు. దేవనకొండ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రవికుమార్ పదోన్నతిపై ఆర్‌ఐగా పత్తికొండకు ఉన్నతాధికారులు నియమించారు. దీంతో మంగళవారం బాధ్యతలు స్వీకరించిన ఆర్‌ఐ రవికుమార్‌కు సిబ్బంది, డీలర్లు అభినందనలు తెలిపారు.

వర్షం కోసం పూజలు, భజనలు


నీరు తీసుకొస్తున్న యువకులు


బోనాలు తీసుకెళ్తున్న చిన్నారులు

పత్తికొండటౌన్: పట్టణంలోని చాకలివీధికి చెందిన 9 మంది యువకులు తొమ్మిది ఆలయాలకు సుంకులమ్మ, బంగారమ్మ, అంకాలమ్మ, మారెమ్మ, యల్లమ్మ, బసవన్న, బొడ్డురాయి తదితర దేవతామూర్తులకు మడిబట్టలతో ఉదయం నుంచి సాయంత్రం దాకా నీటితో జలాభిషేకం చేశారు. అనంతరం ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకులమ్మ ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

దేవనకొండలో..

అలారుదిన్నె గ్రామంలోని ఆంజనేయస్వామిదేవాలయంలో సప్తభజనలు మంగళవారం ప్రారంభమయ్యాయి. దేవాలయంలో వేదపండితుడు లక్ష్మీనారాయణ స్వామివారికి పంచామృతాభిషేకం, గంగపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకనూరు గ్రామంలో వర్షం కురవాలని చిన్నారులు పెద్దమ్మ, మారెమ్మవ్వ, సుంకులమ్మ, గంగమ్మలతో పాటు గాలెమ్మవ్వకు బోనాలు సమర్పించారు.

అనుమానాస్పద మృతిపై విచారణ


విచారణ జరుపుతున్న పోలీసులు

పత్తికొండటౌన్: పత్తికొండ పట్టణంలో సోమవారం అనుమానాస్పదస్థితిలో కృష్ణ అనే వ్యక్తి మృతిచెందడంతో సీఐ విక్రమసింహ మంగళవారం విచారణ చేపట్టారు. కృష్ణ నివాసం ఉంటున్న కుమ్మరివీధికి చేరుకున్న పోలీసులు మృతుడి బంధువులు, చుట్టు పక్కలవారిని సమగ్రంగా విచారించారు. ఈ సందర్భంగా సీఐ విక్రమ్‌సింహ మాట్లాడుతూ కృష్ణ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే మృతుడి భార్యతో పాటు మరో అనుమానాస్పద యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

'ఇంటర్, డిగ్రీ అడ్మిషన్ల గడువు పొడిగించాలి'

ఎమ్మిగనూరు టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్, డిగ్రీ కళాశాలలో గడువు తేదీని మరో 15 రోజులు పొడిగించాలని ఎన్ఎ్ఎస్ఎఫ్ నియోజక తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్ యాదవ్, ఉసేని డిమాండ్ చేశారు. ఈ విషయంపై మంగళవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. అడ్మిషన్ల గడువు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, గడువు పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో దివాకర్, కల్యాణ్, రవి, మనోజ్, భాస్కర్ పాల్గొన్నారు.

నిరీక్షించి.. నీరసించి..

● సమయానికి రాని వైద్యులు, సిబ్బంది
● ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు తప్పని ఇక్కట్లు

ఎమ్మిగనూరు టౌన్: ప్రస్తుతం వ్యాధులు ప్రబలుతుండటంతో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి రోగులు ఉదయమే చేరుకుంటున్నారు. ఈ ఆసుపత్రికి పట్టణం, మండలంలోని రోగులే కాక మంత్రాలయం, పెద్దకడుబూరు, నందవరం, గోనెగండ్ల, దేవనకొండ, సి.బెళగల్ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. ఉదయం 9గంటలకే వైద్యులు ఆసుపత్రికి చేరుకోవాల్సి ఉంది. కానీ ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు కూడా కొందరు వైద్యులు రాకపోవడంతో రోగులు ఓపీ చీటీలతో నిరీక్షించాల్సి వచ్చింది. గంటల కొద్దీ వరుసలో నిల్చునే ఓపిక లేక కొందరు వృద్ధులు నేల మీద కూర్చుండిపోయారు.

ఎవరికి వారే.. :

ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ఎవరికి వారే.. అన్న చందంగా వ్యవహరిస్తున్నార నే విమర్శలు ఉన్నాయి. పట్టణంలో పేరు గాంచిన వైద్యులు ఇక్కడ పనిచేస్తుండడంతో వివిధ మండలాల నుంచి రోగులు అధికంగా వస్తుంటారు. వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ఆసుపత్రికి ఉదయమే వచ్చిన రోగులకు గంటల తరబడి వైద్యం అందడంలేదు. మధ్యాహ్నం 12 దాటితే ఏ ఒక్క వైద్యుడు అందుబాటులో ఉండడు. అందుబాటులో ఉండాల్సిన డ్యూటీ డాక్టర్లు కూడా కనిపించకుండా పోతున్నారు. ఇక అత్యవసర చికిత్సలు సమయంలో అటెండర్లే దిక్కు అవుతున్నారు. సరైన వైద్యం అందక ఎంతోమంది ప్రాణాలు సైతం వదిలిన పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు మండిపడుతున్నారు. ఈ ఆసుపత్రిలో అడ్మిట్ అయిన రోగులను కూడా పట్టించుకోవడం లేదని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. డాక్టర్లు ఒక్కసారి మాత్రమే రౌండ్కు వెళ్లి ఆ తరువాత విధులు నిర్వహించడం లేదని రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోగులకు సకాలంలో చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.




వైద్యుల కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు

వైద్య సేవలందిస్తున్నాం


ఆసుపత్రికి వచ్చే రోగులందరికీ సక్రమంగా వైద్య సేవలు అందిస్తున్నాం. ఇతర కారణాల వల్ల ఒక్కోసారి ఆలస్యమై ఉండవచ్చు. ఇక నుంచి సకాలంలో రోగులకు చికిత్స అందేలా చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ బాలయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్

ఏ ఒక్కరూ పట్టించుకోలేదు

మా పెద్దనాన్న షేక్షావలికి నోట్లో నుంచి రక్తం రావడంతో హుటాహుటీనా 108 వాహనంలో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చాం. ఇక్కడ ఒక్క వైద్యుడు కూడా అందుబాటులో లేరు. నర్సు, అటెండరే చికిత్స అందించారు. ఉదయం 10.30గంటలైనా వైద్యులు రాలేదు. గట్టిగా నిలదీస్తే కర్నూలుకు వెళ్లాలంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఇబ్రహీం, రోగి బంధువు, కోటేకల్లు



'కళాశాల సమస్యలు పరిష్కరించాలి'



జూనియర్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు అజయ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మహేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం విద్యార్థులతో కలిసి కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు కనీస వసతులు కరువైయ్యాయన్నారు. బెంచీలు, ల్యాబొరేటరీ, మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగప్ప, రంగస్వామి పాల్గొన్నారు.

'చైనా వస్తువులు బహిష్కరిద్దాం'

ఎమ్మిగనూరు టౌన్: చైనా వస్తువులను బహిష్కరించి బలమైన భారత్‌ను నిర్మిద్దామని ఏబీవీపీ జిల్లా నాయకులు నరేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్‌లో తయారైన వస్తువులనే వాడాలని, చైనా వస్తువులను బహిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్, జయశేఖర్, ప్రభాకర్, చిన్న, రాము, శివ పాల్గొన్నారు.

'మెడికల్ స్టోర్, ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవాలి'

నందవరం: నందవరం మండలంలోని మెడికల్ స్టోర్ యజమాన్యం, ఆర్ఎంపీలు మందులు విచ్చలవిడిగా అధిక రేట్లకు విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి తిమ్మగురుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు విజయేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. జనరిక్ మందులను, బయట నుంచి తెచ్చిన మందులు అమ్ముతూ పేద, మధ్య తరగతి ప్రజల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారని, కాలం చెల్లిన మందులు కూడా అంటగడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఆర్ఎంపీలు, మెడికల్ స్టోర్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో నవీన్, భీమన్న, వీరాంజినేయులు, కేశవ్, రాము, సురేష్, గిరి, శేఖర్, రామాంజనేయులు, భీమేష్ పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో అంగన్‌వాడీ-3 కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు అంగన్‌వాడీ టీచర్లు డి.అరుణ, అరుణ ఆధ్వర్యంలో మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజరు గుణశేఖరమ్మ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాపాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గర్భిణులు తప్పనిసరిగా ఐరన్ మాత్రలు వాడాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

నంద్యాలలో నందవరం నాయకుల ప్రచారం

నందవరం: నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ తరుపున బరిలో నిలిచిన భూమా బ్రహ్మానందరెడ్డి గెలుపు కోసం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డితో పాటు నందవరం మండల నాయకులు, టీడీపీ జిల్లా కార్యదర్శి దేశాయి మాధవరావు, నాయకులు దేశాయిగురు, ఈరన్న, బసవరాజు, వెంకటేశ్వర్లు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రచారంలో తెలుగుదేశం అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

'వికలాంగులకు స్ఫూర్తినిచ్చేందుకే లఘుచిత్రం'

ఎమ్మిగనూరు టౌన్: వికలాంగులకు స్ఫూర్తినిచ్చేందుకే సామాజిక దృక్పథంలో లఘుచిత్రాన్ని చిత్రీకరిస్తున్నట్లు దర్శకుడు చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం పట్టణంలో స్ఫూర్తి వికలాంగులతో లఘుచిత్రం తీశారు. ఈ చిత్రాన్ని జాతీయ అవార్డుకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నటులు, కెమెరామెన్ సురేష్, కథా రచయిత పార్వతి పాల్గొన్నారు.

'టీకాలతోనే చిన్నారులకు రక్ష'

ఎమ్మిగనూరు టౌన్ /నందవరం: ప్రాణాంతక తట్టు, రూబెల్లా టీకాలు పిల్లలకు రక్ష అని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఆరోగ్య అధికారి ఆబిలేష్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పై మాలగేరి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం సెప్టెంబర్ 8వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతుందని, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నరసింహులు, నారాయణ, గోవిందమ్మ, జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జనార్ధనమ్మ, రాధ, సత్యవేణి, వీరనాగేంద్ర పాల్గొన్నారు.

నందవరంలో: తట్టు, రూబెల్లా వ్యాధులకు ఒకే వ్యాక్సిన్ పాఠశాలలో డాక్టర్ నిర్మల మంగళవారం వేశారు. నందవరం పాఠశాలలో డాక్టర్ నిర్మలతో పాటు ఎంఈవో సుదర్శన్‌రెడ్డి పాఠశాలలో కలియతిరుగుతూ ఈ వ్యాక్సిన్‌ను వేశారు. 9-15 సంవత్సరాల గల పిల్లలకు మండలంలోని అన్ని పాఠశాలల్లో వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజరు శ్రీనివాసులు, ఎస్ఏలు జయరామ్, దీప, ఎన్సీర్ రాణి, లక్ష్మన్న, హెచ్ఎం బసవరాజు గౌడ పాల్గొన్నారు.

ఎల్లెల్సీ నీరు జీడీపీకి మళ్లింపు

గోనెగండ్ల: తుంగభద్ర దిగువ కాలువ నీటిని గాజులదిన్నె ప్రాజెక్టు రోజుకు 97 క్యూసెక్కుల నీటిని మళ్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గోనెగండ్ల ఎస్కేప్ ఛానెల్ ద్వారా నీటిని మళ్లిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. గోనెగండ్ల సెక్షన్‌కు 127 క్యూసెక్కుల నీరు అందడంతో గాజులదిన్నె ప్రాజెక్టుకు 97, అల్వాల ఎస్ఎస్ ట్యాంకుకు 10, గోనెగండ్ల ఎస్ఎస్ ట్యాంకు 10 క్యూసెక్కులు చొప్పున నీటిని అందిస్తున్నారు. దిగువ ప్రాంతమైన కోడుమూరుకు నీటిని మళ్లించడం నిలిపివేశారు. గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి బండగట్టు, డోన్, కిష్టగిరి నీటి పథకాలకు తాగు నీరు అందించాల్సి ఉంది. అయితే గాజులదిన్నె ప్రాజెక్టులో నీరు పూర్తి స్థాయిలో ఎండిపోవడంతో జిల్లా స్థాయి అధికారులు, నాయకులు తుంగభద్ర డ్యామ్ అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో మరో వారం రోజులపాటు అదనంగా ఎల్లెల్సీకి నీటిని విడుదల చేయనున్నారు. దీంతో మరో వారం రోజులపాటు రోజుకు 97 క్యూసెక్కుల నీటిని గాజులదిన్నె ప్రాజెక్టు మళ్లించి, ఆ నీటిని తాగునీటి పథకాలకు అందించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

డెంగ్యూ లక్షణాలతో యువకుడి మృతి

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని లక్ష్మన్ టాకీస్ ప్రాంతంలో నివసిస్తున్న ప్రసన్న (25) అనే యువకుడు డెంగ్యూ లక్షణాలతో మంగళవారం మృతిచెందాడు. ఈయన గత వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానికంగా చికిత్స అందించిన ఫలితం లేకపోవడంతో గత మూడు రోజులుగా కర్నూలులో చికిత్స అందించారు. కోలుకోకపోవడంతో మంగళవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పేదల గుడిసెలపై అధికారుల ప్రతాపం

ముస్లిం మైనార్టీ కాలనీవాసుల ధర్నా

ఎమ్మిగనూరు: పట్టణ పరిధిలోని ముస్లిం మైనార్టీ కాలనీలో కొందరు అధికారులు పేదల గుడిసెలపై ప్రతాపం చూపారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా మంగళవారం గుడిసెలను కూల్చివేశారు. దీంతో కొద్దిసేపు అధికారులకు, కాలనీ వాసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇటీవల ప్రభుత్వం కొత్తగా నిర్మాణం చేపడుతున్న జీప్లస్ 3 గృహాలను మైనార్టీ కాలనీలో నిర్మించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జీప్లస్ 3 గృహాల నిర్మాణానికి ఈ గుడిసెలు అడ్డంగా మారుతాయనే ఉద్దేశంతో అధికారులు కాలనీ వాసులకు సర్ది చెప్పగా వారు ససేమిరా అన్నారు. దీంతో మంగళవారం రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులు కాలనీలో జీ ప్లస్ 3 గృహాల నిర్మించే స్థలాల్లో ఉన్న ఐదు గుడిసెలను కూల్చివేయడం మొదలు పెట్టడంతో ప్రజలు అడ్డుకున్నారు. దీంతో బందోబస్తుకు వెళ్లిన రూరల్ ఎస్ఐ వేణుగోపాల్‌కు, గుడిసెవాసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. సాయంత్రం స్థానిక ఎద్దుల మార్కెట్ సమీపంలోని బైపాస్ రోడ్డులో రూరల్ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని దాదాపు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ కాలనీవాసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

'50 ఏళ్ల పదవీ విరమణను ఉపసంహరించుకోవాలి'

ఎమ్మిగనూరు : 50 ఏళ్ల పదవి విరమణ ముసాయిదా తీర్మానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ ఎన్జీవోస్ తాలుక అధ్యక్షుడు ఈశ్వరయ్య, నాయకులు జోసెఫ్, బజారి, ప్రభు, అనుమప్ప డిమాండ్ చేశారు. మంగళవారం రాజేశ్వరి హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక భారాన్ని తప్పించుకునేందుకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని ఉపసంహరించుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు.

'వర్షం కోసం సుంకలమ్మ అవ్వకు జలాభిషేకం'

ఎమ్మిగనూరు: సంవృద్ధిగా వర్షాలు కురిపించాలని కోరుతూ కులసంఘాలు, సుంకలమ్మ అవ్వ దేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా కుల సంఘాల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఇంటర్, డిగ్రీ అడ్మిషన్ల గడువు పొడిగించాలి'

ఎమ్మిగనూరు టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్, డిగ్రీ కళాశాలలో గడువు తేదీని మరో 15 రోజులు పొడిగించాలని ఎన్ఎస్‌యూఐ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్ యాదవ్, ఉసేని డిమాండ్ చేశారు. ఈ విషయంపై మంగళవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. అడ్మిషన్ల గడువు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, గడువు పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో దివాకర్, కల్యాణ్, రవి, మనోజ్, భాస్కర్ పాల్గొన్నారు.

నిరీక్షించి.. నీరసించి..

● సమయానికి రాని వైద్యులు, సిబ్బంది
● ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు తప్పని ఇక్కట్లు

ఎమ్మిగనూరు టౌన్: ప్రస్తుతం వ్యాధులు ప్రబలుతుండటంతో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి రోగులు ఉదయమే చేరుకుంటున్నారు. ఈ ఆసుపత్రికి పట్టణం, మండలంలోని రోగులే కాక మంత్రాలయం, పెద్దకడుబూరు, నందవరం, గోనెగండ్ల, దేవనకొండ, సి.బెళగల్ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. ఉదయం 9గంటలకే వైద్యులు ఆసుపత్రికి చేరుకోవాల్సి ఉంది. కానీ ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు కూడా కొందరు వైద్యులు రాకపోవడంతో రోగులు ఓపీ చీటీలతో నిరీక్షించాల్సి వచ్చింది. గంటల కొద్దీ వరుసలో నిల్చునే ఓపిక లేక కొందరు వృద్ధులు నేల మీద కూర్చుండిపోయారు.

ఎవరికి వారే.. :

ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ఎవరికి వారే.. అన్న చందంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పట్టణంలో పేరు గాంచిన వైద్యులు ఇక్కడ పనిచేస్తుండడంతో వివిధ మండలాల నుంచి రోగులు అధికంగా వస్తుంటారు. వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ఆసుపత్రికి ఉదయమే వచ్చిన రోగులకు గంటల తరబడి వైద్యం అందడంలేదు. మధ్యాహ్నం 12 దాటితే ఏ ఒక్క వైద్యుడు అందుబాటులో ఉండడు. అందుబాటులో ఉండాల్సిన డ్యూటీ డాక్టర్లు కూడా కనిపించకుండా పోతున్నారు. ఇక అత్యవసర చికిత్సలు సమయంలో అటెండర్లే దిక్కు అవుతున్నారు. సరైన వైద్యం అందక ఎంతోమంది ప్రాణాలు సైతం వదిలిన పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు మండిపడుతున్నారు. ఈ ఆసుపత్రిలో అడ్మిట్ అయిన రోగులను కూడా పట్టించుకోవడం లేదని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. డాక్టర్లు ఒక్కసారి మాత్రమే రౌండ్‌కు వెళ్లి ఆ తరువాత విధులు నిర్వహించడం లేదని రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోగులకు సకాలంలో చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.





వైద్యుల కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు

వైద్య సేవలందిస్తున్నాం


ఆసుపత్రికి వచ్చే రోగులందరికీ సక్రమంగా వైద్య సేవలు అందిస్తున్నాం. ఇతర కారణాల వల్ల ఒక్కోసారి ఆలస్యమై ఉండవచ్చు. ఇక నుంచి సకాలంలో రోగులకు చికిత్స అందేలా చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ బాలయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్

ఏ ఒక్కరూ పట్టించుకోలేదు

మా పెద్దనాన్న షేక్షావలికి నోట్లో నుంచి రక్తం రావడంతో హుటాహుటిన 108 వాహనంలో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చాం. ఇక్కడ ఒక్క వైద్యుడు కూడా అందుబాటులో లేరు. నర్సు, అటెండరే చికిత్స అందించారు. ఉదయం 10.30గంటలైనా వైద్యులు రాలేదు. గట్టిగా నిలదీస్తే కర్నూలుకు వెళ్లాలంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఇబ్రహీం, రోగి బంధువు, కోసిగి



'కళాశాల సమస్యలు పరిష్కరించాలి'



జూనియర్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు అజయ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మహేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం విద్యార్థులతో కలిసి కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు కనీస వసతులు కరువైయ్యాయన్నారు. బెంచీలు, ల్యాబొరేటరీ, మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగప్ప, రంగస్వామి పాల్గొన్నారు.

'చైనా వస్తువులు బహిష్కరిద్దాం'

ఎమ్మిగనూరు టౌన్: చైనా వస్తువులను బహిష్కరించి బలమైన భారత్‌ను నిర్మిద్దామని ఏబీవీపీ జిల్లా నాయకులు నరేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్‌లో తయారైన వస్తువులనే వాడాలని, చైనా వస్తువులను బహిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్, జయశేఖర్, ప్రభాకర్, చిన్న, రాము, శివ పాల్గొన్నారు.

'మెడికల్ స్టోర్, ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవాలి'

నందవరం: నందవరం మండలంలోని మెడికల్ స్టోర్ యజమాన్యం, ఆర్ఎంపీలు మందులు విచ్చలవిడిగా అధిక రేట్లకు విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి తిమ్మగురుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు విజయేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. జనరిక్ మందులు, బయట నుంచి తెచ్చిన మందులు అమ్ముతూ పేద, మధ్య తరగతి ప్రజల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారని, కాలం చెల్లిన మందులు కూడా అంటగడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఆర్ఎంపీలు, మెడికల్ స్టోర్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో నవీన్, భీమన్న, వీరాంజినేయులు, కేశవ్, రాము, సురేష్, గిరి, శేఖర్, రామాంజనేయులు, భీమేష్ పాల్గొన్నారు.

'టీకాలతోనే చిన్నారులకు రక్ష'

ఎమ్మిగనూరు టౌన్ /నందవరం: ప్రాణాంతక తట్టు, రూబెల్లా టీకాలు పిల్లలకు రక్ష అని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఆరోగ్య అధికారి అఖిలేష్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పలు పాఠశాలల్లో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం సెప్టెంబర్ 8వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతుందని, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నరసింహులు, నారాయణ, గోవిందమ్మ, జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జనార్ధనమ్మ, రాధ, సత్యవేణి, వీరనాగేంద్ర పాల్గొన్నారు.

నందవరంలో: తట్టు, రూబెల్లా వ్యాధులకు ఒకే వ్యాక్సిన్ పాఠశాలలో డాక్టర్ నిర్మల మంగళవారం వేశారు. నందవరం పాఠశాలలో డాక్టర్ నిర్మలతో పాటు ఎంఈవో సుదర్శన్‌రెడ్డి పాఠశాలలో కలియతిరుగుతూ ఈ వ్యాక్సిన్‌ను వేశారు. 9-15 సంవత్సరాల గల పిల్లలకు మండలంలోని అన్ని పాఠశాలల్లో వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజరు శ్రీనివాసులు, ఎస్ఏలు జయరామ్, దీప, ఎస్టేర్ రాణి, లక్ష్మన్న, హెచ్ఎం బసవరాజు గౌడ పాల్గొన్నారు.

ఎల్లెల్సీ నీరు జీడీపీకి మళ్లింపు

గోనెగండ్ల: తుంగభద్ర దిగువ కాలువ నీటిని గాజులదిన్నె ప్రాజెక్టు రోజుకు 97 క్యూసెక్కుల నీటిని మళ్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గోనెగండ్ల ఎస్కేప్ ఛానెల్ ద్వారా నీటిని మళ్లిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. గోనెగండ్ల సెక్షన్‌కు 127 క్యూసెక్కుల నీరు అందడంతో గాజులదిన్నె ప్రాజెక్టుకు 97, అల్వాల ఎస్ఎస్ ట్యాంకుకు 10, గోనెగండ్ల ఎస్ఎస్ ట్యాంకు 10 క్యూసెక్కులు చొప్పున నీటిని అందిస్తున్నారు. దిగువ ప్రాంతమైన కోడుమూరుకు నీటిని మళ్లించడం నిలిపివేశారు. గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి బండగట్టు, డోన్, కిష్టగిరి నీటి పథకాలకు తాగునీరు అందించాల్సి ఉంది. అయితే గాజులదిన్నె ప్రాజెక్టులో నీరు పూర్తిస్థాయిలో ఎండిపోవడంతో జిల్లా స్థాయి అధికారులు, నాయకులు తుంగభద్ర డ్యామ్ అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో మరో వారం రోజులపాటు అదనంగా ఎల్లెల్సీకి నీటిని విడుదల చేయనున్నారు. దీంతో మరో వారం రోజులపాటు రోజుకు 97 క్యూసెక్కుల నీటిని గాజులదిన్నె ప్రాజెక్టు మళ్లించి, ఆ నీటిని తాగునీటి పథకాలకు అందించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

డెంగ్యూ లక్షణాలతో యువకుడి మృతి

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని లక్ష్మన్ టాకీస్ ప్రాంతంలో నివసిస్తున్న ప్రసన్న (25) అనే యువకుడు డెంగ్యూ లక్షణాలతో మంగళవారం మృతిచెందాడు. ఈయన గత వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానికంగా చికిత్స అందించిన ఫలితం లేకపోవడంతో గత మూడు రోజులుగా కర్నూలులో చికిత్స అందించారు. కోలుకోకపోవడంతో మంగళవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పేదల గుడిసెలపై అధికారుల ప్రతాపం

ముస్లిం మైనార్టీ కాలనీవాసుల ధర్నా

ఎమ్మిగనూరు: పట్టణ పరిధిలోని ముస్లిం మైనార్టీ కాలనీలో కొందరు అధికారులు పేదల గుడిసెలపై ప్రతాపం చూపారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా మంగళవారం గుడిసెలను కూల్చివేశారు. దీంతో కొద్దిసేపు అధికారులకు, కాలనీ వాసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇటీవల ప్రభుత్వం కొత్తగా నిర్మాణం చేపడుతున్న జీప్లస్ 3 గృహాలను మైనార్టీ కాలనీలో నిర్మించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జీప్లస్ 3 గృహాల నిర్మాణానికి ఈ గుడిసెలు అడ్డంగా మారుతాయనే ఉద్దేశంతో అధికారులు కాలనీ వాసులకు సర్దిచెప్పగా వారు ససేమిరా అన్నారు. దీంతో మంగళవారం రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులు కాలనీలో జీ ప్లస్ 3 గృహాల నిర్మించే స్థలాల్లో ఉన్న ఐదు గుడిసెలను కూల్చివేయడం మొదలు పెట్టడంతో ప్రజలు అడ్డుకున్నారు. దీంతో బందోబస్తుకు వెళ్లిన రూరల్ ఎస్ఐ వేణుగోపాల్‌కు, గుడిసెవాసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. సాయంత్రం స్థానిక ఎద్దుల మార్కెట్ సమీపంలోని బైపాస్ రోడ్డులో రూరల్ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని దాదాపు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ కాలనీవాసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

తల్లిపాల వారోత్సవాలు

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో అంగన్‌వాడీ-3 కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు అంగన్‌వాడీ టీచర్లు డి.అరుణ, అరుణ ఆధ్వర్యంలో మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజరు గుణశేఖరమ్మ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాపాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గర్భిణులు తప్పనిసరిగా ఐరన్ మాత్రలు వాడాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

నంద్యాలలో నందవరం నాయకుల ప్రచారం

నందవరం: నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ తరుపున బరిలో నిలిచిన భూమా బ్రహ్మానందరెడ్డి గెలుపు కోసం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డితో పాటు నందవరం మండల నాయకులు, టీడీపీ జిల్లా కార్యదర్శి దేశాయి మాధవరావు, నాయకులు దేశాయిగురు, ఈరన్న, బసవరాజు, వెంకటేశ్వర్లు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రచారంలో తెలుగుదేశం అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

'50 ఏళ్ల పదవీ విరమణను ఉపసంహరించుకోవాలి'

ఎమ్మిగనూరు : 50 ఏళ్ల పదవి విరమణ ముసాయిదా తీర్మానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ ఎన్జీవోస్ తాలుక అధ్యక్షుడు ఈశ్వరయ్య, నాయకులు జోసెఫ్, బజారి, ప్రభు, అనుమప్ప డిమాండ్ చేశారు. మంగళవారం రాజేశ్వరి హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక భారాన్ని తప్పించుకునేందుకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని ఉపసంహరించుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు.

'వికలాంగులకు స్ఫూర్తినిచ్చేందుకే లఘుచిత్రం'

ఎమ్మిగనూరు టౌన్: వికలాంగులకు స్ఫూర్తినిచ్చేందుకే సామాజిక దృక్పథంలో లఘుచిత్రాన్ని చిత్రీకరిస్తున్నట్లు దర్శకుడు చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం పట్టణంలో స్ఫూర్తి వికలాంగులతో లఘుచిత్రం తీశారు. ఈ చిత్రాన్ని జాతీయ అవార్డుకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నటులు, కెమెరామెన్ సురేష్, కథా రచయిత పార్వతి పాల్గొన్నారు.

'వర్షం కోసం సుంకలమ్మ అవ్వకు జలాభిషేకం'

ఎమ్మిగనూరు: సంవృద్ధిగా వర్షాలు కురిపించాలని కోరుతూ కులసంఘాలు, సుంకలమ్మ అవ్వ దేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా కుల సంఘాల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.